సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 124

గురువారం 19-1-2023



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



గిల్ 'డబుల్' గర్జన

న్యూజిలాండ్‌తో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ 12 పరుగుల తేడాతో గెలిచింది. శుబ్‌మన్ గిల్ (149 బంతుల్లో 208 పరుగులు) 'డబుల్ సెంచరీ' సాధించడంతో.. తొలుత భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 349 పరుగులు చేసింది. అనంతరం న్యూజిలాండ్ 49.2 ఓవర్లలో 337 పరుగులు చేసి ఓడిపోయింది. మైకేల్ బ్రేస్‌వెల్ వీరోచిత శతకం వృథా అయ్యింది. 12లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఈశాన్యాన ఎన్నికల నగారా

మూడు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో 27న పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో ▸



ఎఫ్‌పీవోకు అదానీ ఎంటర్‌ప్రైజెస్

ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్.. ఎఫ్‌పీవోకు సిద్ధమైంది. రూ.3,112 నుంచి రూ.3,276 ధరల శ్రేణిని నిర్ణయించింది.

వివరాలు 13లో ▸



ఉక్రెయిన్‌లో కూలిన హెలికాప్టర్

కీవ్ సమీపంలో హెలికాప్టర్ కుప్పకూలడంతో ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి డెనిస్ సహా 18 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



పతనం అంచున పాక్

పాక్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. పాక్‌ది దక్షిణాసియాలోనే బలహీన ఆర్థిక వ్యవస్థ అని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

వివరాలు 6లో ▸

దళారులకు తావేలేదు

నేరుగా ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు మేలు

ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గత ప్రభుత్వం కంటే మిన్నగా ధాన్యం సేకరణ

- చంద్రబాబు పెట్టిన ధాన్యం బకాయిలనూ తీర్చాం
- ధాన్యం రైతు సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి
- రైతుకు ఇచ్చే రశీదుపై ఫిర్యాదు చేయాల్సిన నంబర్ ముద్రించాలి
- 50% సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు ఇవ్వడంపై దృష్టి
- ఆర్బీకే స్థాయిలో మే–జూన్ నుంచి కిసాన్ డ్రోన్లు
- పూర్తి స్థాయిలో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు
- ఏప్రిల్ నుంచి మట్టి నమూనా పరీక్షలు
- రబీలో విత్తనాలు, ఎరువుల కొరత రానివ్వొద్దు



"గత ప్రభుత్వంతో పోలిస్తే ధాన్యం సేకరణలో మనం రైతులకు ఎంతో మేలు చేస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా మనమే చెల్లించాం. గతంలో ఏటా ధాన్యం సేకరణకు సుమారు రూ.8 వేల కోట్లు వెచ్చిస్తే, మన ప్రభుత్వంలో ఏకంగా రూ.15 వేల కోట్లు ఇస్తున్నాం. 2016-17లో 55 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తే, 2020-21లో మనం దాదాపు 85 లక్షల టన్నులు సేకరించాం. చంద్రబాబు ఐదేళ్ల హయాంలో 2.65 కోట్ల టన్నుల ధాన్యం సేకరిస్తే, ఈ మూడున్నరేళ్లలోనే మనం 2.87 కోట్ల టన్నులు కొనుగోలు చేయడం సంతోషంగా ఉంది.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్"

సాక్షి, అమరావతి: ఇదివరకెన్నడూ లేని విధంగా ఎటువంటి వివక్ష, అవినీతి, దళారుల బెడద లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, వారికి దక్కాల్సిన మద్దతు ధరను ప్రతిపైసాతో సహా అనుకున్న సమయానికే చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంతకు ముందు రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన సందర్భమే లేదన్నారు. ఇప్పుడు అలాంటి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని చెప్పారు. పది శాతం రంగు మారిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయాలని, ఇంకా ఎక్కువ శాతం రంగు మారి ఉంటే మిల్లర్లతో మాట్లాడి కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఇప్పుడు హమాలి, రవాణా, గోనె సంచుల ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తూ రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని తెలిపారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అనుబంధ రంగాలు, పౌర సరఫరాల శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ–క్రాప్ డేటా ఆధారంగా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని.. మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ఖరీఫ్‌లో మిగిలిన సేకరణనూ

మిగతా 2వ పేజీలో ▶



బీఆర్‌ఎస్ సభలో యూపీ మాజీ సీఎం అఖిలేశ్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేరళ సీఎం విజయన్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా

భారత జాతి విముక్తి కోసమే

బీఆర్‌ఎస్

- దేశం దుస్థితికి కారణం కాంగ్రెస్, బీజేపీలే..
- ఖమ్మం బీఆర్‌ఎస్ సభలో తెలంగాణ సీఎం కేసీఆర్
- ప్రభుత్వ సంస్థలను అమ్మినా మేమొచ్చాక మళ్లీ తెచ్చుకుంటాం
- మీది ప్రైవేటైజేషన్.. మాది నేషనలైజేషన్
- ప్రధాని మోదీ.. 2024 తర్వాత నువ్వు ఇంటికి.. మేం ఢిల్లీకి
- అధికారంలోకి రాగానే అగ్నిపథ్‌ను రద్దు చేస్తాం
- దేశమంతా రైతులకు ఉచిత కరెంటు, దళిత బంధు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భారతదేశ దుస్థితికి, ఇప్పుడు జరుగుతున్న దుర్మార్గాలకు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలే కారణమని.. భారత జాతిని విముక్తం చేయడం కోసమే బీఆర్‌ఎస్ పుట్టిందని ఆ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. దేశంలో విస్తృతమైన వ్యవసాయ భూమి, 70 వేల టీఎంసీల నీళ్లు, అవసరానికి మించిన కరెంటు ఉత్పత్తి ఉన్నా.. వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితిలో ఉందని, ఒక్క భారీ ప్రాజెక్టు లేదని మండిపడ్డారు. 'భయ్యా హమ్‌నే కర్ దియా.. ఉన్హోనే రోక్ దియా..' అంటూ కాంగ్రెస్ ఉంటే బీజేపీని తిట్టడం, బీజేపీ ఉంటే కాంగ్రెస్‌ను తిట్టడమే సరిపోయిందన్నారు. మనకు కావాల్సింది ఇది కాదని.. ఈ చైతన్యం తేవడానికి, ప్రశ్నించడానికే బీఆర్‌ఎస్ వస్తోందని

మిగతా 10వ పేజీలో ▶

ఏది నిజం?

వలంటీర్లంటే వణుకేల?

- వారు గౌరవ పారితోషికంతో సేవలందిస్తున్నది అబద్ధమా?
- ప్రభుత్వ పథకాలను చేర్చటంలో లంచాలకు, వివక్షకు తావుందా?
- అద్భుతంగా సేవలందిస్తున్న సీఎం సైన్యాన్ని ఏనాడైనా ప్రశంసించారా?
- వారికి ఒక రాజకీయ పార్టీపై అభిమానం ఉండటం తప్పా?
- ఇష్టపూర్వకంగా వారు రాజకీయ సమావేశాలకెళితే ఆపేదెవరు?
- బాబు హయాంలో జన్మభూమి కమిటీలన్నీ పూర్తిగా టీడీపీవే కదా?
- టీడీపీ నేతల నామినేషన్‌తోనేగా వారిని నియమించింది?.. పూర్తి వివక్షతో, లంచాల కోసం వారు ఏం చేసినా మీరు పెన్నెత్తలేదేం?
- ఇప్పుడు పైసా కూడా దుర్వినియోగం కావట్లేదనేది నిజం కాదా?
- ప్రభుత్వానికి వారు బ్రాండ్ అంబాసిడర్లుగా మారటం మీకు నచ్చట్లేదా?
- అందుకేనా... గూఢచారులు, రాజకీయ ప్రచారకులు అంటూ కథనాలు?

4లో

న్యూస్‌రీల్

కోర్టు ధిక్కార కేసులో నాటకీయ పరిణామాలు



కోర్టు ధిక్కార కేసులో విద్యా శాఖ గత అధికారులకు హైకోర్టు జడ్జి జస్టిస్ దేవానంద్ జైలు శిక్ష విధించారు. అయితే వారు క్షమాపణ కోరడంతో.. పని గంటలు ముగిసే వరకు కోర్టులోనే ఉండాలని ఆదేశాలిచ్చారు. మరోవైపు ఈ ఆదేశాల అమలును నిలిపేస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

వివరాలు 3 ▸

శ్రీహరికోటలో మరో ఆత్మహత్య!



షార్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐఎస్‌ఎఫ్ ఎస్‌ఐ వికాస్‌సింగ్ సోమవారం రాత్రి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోగా.. ఆయన భార్య ప్రియాసింగ్(29) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ప్రాణాలొదిలారు. దీంతో షార్‌లో విషాదం నెలకొంది.

వివరాలు 5 ▸

మన గుడ్డు వైపు.. విదేశాల చూపు

అంతర్జాతీయంగా భారీగా పడిపోయిన కోడి గుడ్ల ఉత్పత్తి

- బర్డ్‌ఫ్లూ కారణంగా అమెరికా, జపాన్‌లో కోట్లాది కోళ్లు హతం
- గుడ్ల కోసం జపాన్, మలేసియా, తైవాన్, హాంకాంగ్‌లు ఇండియావైపు చూపు
- దాణా రేట్లు పెరగడంతో ఉత్తరాదిన భారీగా తగ్గిన పౌల్ట్రీ రైతులు
- దేశీయంగానూ పెరిగిన డిమాండ్
- పెరుగుతున్న కోడి గుడ్ల ధరలు
- 2 నెలల్లో ఫారంగేటు వద్ద గుడ్డు ధర రూ.4.20 నుంచి రూ.5.60కు పెరుగుదల
- అవకాశాలను అందిపుచ్చుకుంటున్న రాష్ట్ర పౌల్ట్రీ రైతులు



సాక్షి, అమరావతి: భారత దేశ కోడి గుడ్లకు.. మరీ ముఖ్యంగా ఏపీతో పాటు దక్షిణాది రాష్ట్రాల గుడ్లకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగింది. పలు దేశాలు కోడి గుడ్ల కోసం దక్షిణాది రాష్ట్రాల వైపు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా కోడి గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో మలేసియా, తైవాన్, హాంకాంగ్, జపాన్ వంటి దేశాలు ఇండియా వైపు చూస్తున్నాయి. మన రాష్ట్రంలో రోజుకు 5.5 కోట్ల కోడి గుడ్ల ఉత్పత్తి అవుతున్నాయి. మొత్తం దేశీయ గుడ్ల ఎగుమతుల్లో రాష్ట్రం వాటా సుమారు 20 శాతం ఉంది. ప్రస్తుత డిమాండ్‌తో ఇది మరింత పెరగనుంది. స్థానిక డిమాండ్‌కు తోడు అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో గుడ్ల ధరలు కూడా పెరుగుతున్నాయి. గడిచిన రెండు నెలల్లో ఫాం గేటు వద్ద గుడ్డు ధర రూ.4.20 నుంచి రూ.5.60కి పెరిగింది. రిటైల్ మార్కెట్లో చాలా చోట్ల ధర రూ.7కు చేరింది. మలేసియా వంటి దేశాల్లో గుడ్డు ధర రూ.8.50 దాటడంతో ఎగుమతులపై రాష్ట్ర పౌల్ట్రీ రైతులు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటివరకు సౌదీ అరేబియా వంటి దేశాలకు అత్యధికంగా ఎగుమతి చేస్తున్న రాష్ట్రం.. ఇప్పుడు

మిగతా 3వ పేజీలో ▶

ఫోను నుంచే 'ఫారిన్' మనీ

ఇక విదేశాల నుంచి కూడా డిజిటల్ చెల్లింపులు



- ఏప్రిల్ 30 నుంచి అనుమతి
- తొలి దశలో 10 దేశాల నుంచి చెల్లింపులకు అనుమతి.. విధి విధానాలు ఖరారు చేసిన ఎన్‌పీసీఐ
- ఎన్నారైల నుంచి కుటుంబ సభ్యులకు మరింత సులభంగా నిధులు
- ఈ చెల్లింపులకు అనుబంధ సంస్థ ఏర్పాటు చేసిన ఎన్‌పీసీఐ
- విదేశాల్లోని పేమెంట్ సంస్థలతో ఒప్పందాలు.. ఎన్నారైలకు భారత్‌లోనూ బ్యాంకు ఖాతా ఉంటేనే చెల్లింపులు
- ఫెమాకు కట్టుబడిన బ్యాంకుల అకౌంట్లకే చెల్లింపులు
- ఇతర నిబంధనలూ పాటించాల్సిందే

14లో

వాటాలు తేల్చాకే కాళేశ్వరానికి మూడో టీఎంసీ



- అప్పటిదాకా డీపీఆర్‌ను పరిశీలించొద్దు
- గోదావరి బోర్డుకు తేల్చి చెప్పిన ఏపీ ప్రభుత్వం
- గోదావరి జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయని కేంద్రం
- జలాల వినియోగంపై ఇరు రాష్ట్రాల మధ్య కుదరని ఒప్పందం
- వాటాలు తేల్చడం లేదా ఒప్పందం ద్వారానే కొత్త ప్రాజెక్టులకు అనుమతి
- ఇవేవీ కాకుండా రెండు టీఎంసీలతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి
- మూడో టీఎంసీ తరలించడానికి గోదావరి బోర్డుకు తెలంగాణ డీపీఆర్

3లో

వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలోనే

ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు



- ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణలో సజ్జల
- ఉద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉంటా
- చంద్రబాబు తొమ్మిదిసార్లు దావోస్ వెళ్లి ఏం చేశారు?

- వివరాలు 2లో

ప్రభుత్వం సమతుల్యతతో వ్యవహరిస్తున్నట్లు

కనిపిస్తోంది


- పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడుతోంది: హైకోర్టు
- రోడ్లపై సభలు, రోడ్‌షోల నియంత్రణపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- విచారణ ఫిబ్రవరికి వాయిదా

14లో

ఇదండీ సంగతి



మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.. చివరకు కరోనాతో సాధ్యమైంది!!



రెజ్లింగ్ అధ్యక్షుడు లైంగికంగా

వేధిస్తున్నాడు

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ మహిళా రెజ్లర్లు రోడ్డెక్కారు. బ్రిజ్‌భూషణ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి మలిక్ సహా 30 మంది రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగారు. అధ్యక్ష పదవి నుంచి ఆయన్ని తప్పించేదాకా ధర్నా విరమించబోమన్నారు. కాగా, తాను లైంగికంగా వేధించానని నిరూపిస్తే ఉరేసుకుంటానని బ్రిజ్‌భూషణ్ అన్నారు.

12లో

బాల్య విద్యలో భళా

పూర్వ ప్రాథమిక స్కూళ్లలో జాతీయ సగటుకు మించి ఏపీలో చిన్నారుల చేరికలు

- బాలికల డ్రాపౌట్లు అతి తక్కువ
- ఆంగ్లం సామర్థ్యంలో జాతీయ సగటుకు మించి ఫలితాలు
- 8వ తరగతి గణితంలోనూ అదే తరహా..
- ట్యూషన్లకు పెరిగిన డిమాండ్
- నాలుగేళ్ల అనంతరం అసర్ 2022 నివేదిక విడుదల



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల చేరికల్లో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాలు సాధించినట్లు యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ (అసర్) 2022 నివేదిక వెల్లడించింది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్కూళ్ల చేరికల్లో మంచి పురోగతి ఉన్నట్లు పేర్కొంది. ప్రథమ్ సంస్థ నిర్వహించిన అసర్ సర్వే 2022ను బుధవారం విడుదల చేసింది. 2018 తరువాత నాలుగేళ్ల అనంతరం ప్రథమ్ సంస్థ ఈ సర్వేను ప్రకటించింది. జాతీయ స్థాయిలో పాఠశాల విద్యారంగం, రాష్ట్రాలలో పరిస్థితులను గణాంకాలతో పొందుపరిచింది. 2014–2018 వరకు, 2018 – 2022 వరకు పరిస్థితులను బేరీజు వేసి ప్రమాణాలను విశ్లేషించింది. ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యారంగ పరిస్థితిని

మిగతా 2వ పేజీలో ▶

కందుకూరు ఘటనపై

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కేసు నమోదు



గత నెల 28న నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇరుకు రోడ్డులో నిర్వహించిన సభ వల్ల ఎనిమిది మంది మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేసింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజయవాడకు చెందిన వైద్యుడు నాగరాధాకృష్ణ యాదవ్ ఈ ఫిర్యాదు చేశారు.

- వివరాలు 3లో

క్లుప్తంగా...

స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ అమల్లో ఏపీకి ఉత్తమ అవార్డు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జాతీయ పాఠశాల ఆరోగ్యం, సంక్షేమం కార్యక్రమం (స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రోగ్రామ్) అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రథమ స్థానం దక్కిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన 2వ జాతీయ వర్క్ షాపులో ఆంధ్రప్రదేశ్ తరఫున స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రోగ్రామ్, పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు (ఎస్సీఈఆర్టీ) నోడల్ ఆఫీసర్ హేమరాణి ఈ పురస్కారాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రోలీ సింగ్ చేతుల మీదుగా అందుకున్నారని పేర్కొన్నారు. కేంద్రం 2020 ఫిబ్రవరి 24న ప్రారంభించిన ఈ కార్యక్రమం మన రాష్ట్రంలో ఆగస్టు 2020 నుంచి ఎస్సీఈఆర్టీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సంయుక్తంగా యూనిసెఫ్ సాంకేతిక సాయంతో అమలు చేశాయని తెలిపారు.

డీసీసీబీల్లో కామన్ క్యాడర్ బదిలీలు

- జీఎం, డీజీఎం స్థాయి అధికారులకు వర్తింపు
- ప్రతి మూడేళ్లకు సీనియారిటీ, పనితీరు ప్రాతిపదికన బదిలీలు
- నెలాఖరులోగా నోటిఫికేషన్.. ఉగాదిలోగా బదిలీలు



సాక్షి, అమరావతి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న జనరల్ మేనేజర్(జీఎం), డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం) స్థాయి అధికారుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు ఎక్కడి బ్యాంకులో విధుల్లో చేరితే ఆ బ్యాంకులోనే పదోన్నతులు పొందడమే కాదు.. పదవీ విరమణ వరకు కొనసాగేవారు. దశాబ్దాలుగా ఒకే బ్యాంకులో పాతుకుపోవడం వల్ల పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడిన ఘటనలున్నాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ డీసీసీబీల్లో కామన్ క్యాడర్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం సహకార చట్టాన్ని సవరిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసింది. 2, 3 స్థాయిల్లో పనిచేసే అధికారుల(జీఎం, డీజీఎం)ను కామన్ క్యాడర్ కిందకు తీసుకొచ్చారు. జోనల్ పరిధిలో సీనియారిటీ ప్రాతిపదికన ప్రతి మూడేళ్లకోసారి బదిలీ చేయబోతున్నారు. నైపుణ్యం, పనితీరు ఆధారంగా ఈ బదిలీలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 13 డీసీసీబీ బ్యాంకుల పరిధిలో జీఎం పోస్టులు 24, డీజీఎం పోస్టులు 47 ఉండగా.. ప్రస్తుతం 22 మంది జీఎం, 43 మంది డీజీఎంలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరికి తొలుత బదిలీలు ఆ తర్వాత పదోన్నతులు కల్పించనున్నారు. ఇందుకోసం మార్గదర్శకాల రూపకల్పన బాధ్యతను ఆప్కాబ్‌కు అప్పగించారు. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాలు రూపొందించి ఆ వెంటనే బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఉగాదికల్లా బదిలీల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

సహకార బ్యాంకుల ప్రక్షాళనే లక్ష్యం

సహకార బ్యాంకులను ప్రక్షాళన చేయడం.. వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం. ఏళ్ల తరబడి ఒకేచోట ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారికి స్థానచలనం కల్పించాలని నిర్ణయించాం. ఇందుకు అనుగుణంగానే చట్టాన్ని సవరించాం. కోర్టుల్లో అడ్డంకులు తొలగిపోగానే హెచ్ఆర్ పాలసీని కూడా అమలు చేస్తాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

ఆగిందా.. గురువిందా!

మరమ్మతుల అనంతరం మర్నాడే పరుగులు.. ఈలోగా ఈనాడు విష ప్రచారం

- నాడు డొక్కు వాహనాలు మొరాయించినా రామోజీ కలం కదల్లేదు
- ఇప్పుడు 768 అంబులెన్స్‌లు.. మరో 146 వాహనాల కొనుగోలుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: గతంతో పోలిస్తే 108 అంబులెన్స్‌ల సేవలు ఎంతో బాగున్నట్లు చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఈనాడుకు మాత్రం 108లు ఆపదలో ఉన్నట్లు కనిపిస్తోంది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు డొక్కు వాహనాలతో 108 సేవలు మొరాయించినా రామోజీకి అంతా సవ్యంగానే కనిపించింది. నాడు అంబులెన్స్‌లు రాక ప్రాణాలు గాల్లో కలిసినా ఆ పెద్ద మనిషికి చీమ కుట్టినట్లైనా అనిపించలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిబంధనల ప్రకారం 60 వేల జనాభాకు ఒక అంబులెన్స్ ఉండాలి. దేశవ్యాప్తంగా సగటున లక్షకు పైగా జనాభాకు ఒక అంబులెన్స్ మాత్రమే అందుబాటులో ఉంది. మన రాష్ట్రంలో ప్రస్తుతం 74 వేల జనాభాకు ఒకటి చొప్పున 108 అంబులెన్స్‌లు ఉన్నాయి.

16 రోజుల్లో 89 కేసుల్లో సేవలు..

సెల్ఫ్ మోటర్, వైరింగ్ సమస్యతో ఓ అంబులెన్స్ శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఆగిపోవడంతో మెకానిక్ షెడ్డుకు తరలిస్తున్న ఫోటోను ఈనాడు కథనంలో ప్రచురించింది. నంబులపూలకుంట మండలానికి చెందిన ఈ వాహనం ఈ నెల 13వతేదీన 01 : 23 గంటలకు నిలిచిపోయింది. అంబులెన్స్ నిలిచిపోవడానికి ముందు వరకు కూడా 3 కేసుల్లో సేవలు అందించింది. మరమ్మతుల అనంతరం మరుసటి రోజు 4 : 52 గంటల నుంచి అంబులెన్స్ తిరిగి విధుల్లోకి వచ్చింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఒక్క రోజు మాత్రమే నిలిచిపోయింది. మిగిలిన 16 రోజుల్లో 89 కేసుల్లో సేవలు అందించింది.

కొత్త వాహనాల కొనుగోలు

2020 జూలై ఒకటో తేదీ నుంచి 768 వాహనాలతో సీఎం జగన్ ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవలను బలోపేతం చేసింది. 432 కొత్త వాహనాలను ప్రవేశపెట్టింది. 336 వాహనాలకు మరమ్మతులు నిర్వహించి సేవలు అందిస్తోంది. నంబులపూలకుంట అంబులెన్స్ చాలా పాత వాహనం. 2.5 లక్షల కి.మీ పైగా తిరిగిన వాటి స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టడంలో భాగంగా 146 అంబులెన్స్‌ల కొనుగోలుకు వైద్య శాఖ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. వీటి కొనుగోలుకు ప్రభుత్వం రూ.41 కోట్ల మేర ఖర్చు చేయనుంది.

నిబంధనలకు లోబడే స్పందన

నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి అంబులెన్స్ చేరుకోవాలన్నది నిబంధన. అయితే 14.50 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాలకు గాను 16.55 నిమిషాల్లోనే వచ్చేస్తున్నాయి. ఇక గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాలకు గాను 22.12 నిమిషాల్లోనే వస్తున్నాయి.

త్వరలోనే ట్రాకింగ్ సదుపాయం..



కాల్ సెంటర్ నుంచి అన్ని అంబులెన్స్‌లను ట్రాక్ చేస్తుంటాం. ఎక్కడైనా వాహనం అందుబాటులో లేకపోయినా, నిలిచిపోయినా వెంటనే తెలిసిపోతుంది. జిల్లాల వారీగా డ్యాష్ బోర్డును కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తుంటారు. మరో 20 రోజుల్లో కాల్ చేసిన వారు తమ మొబైల్ నుంచి అంబులెన్స్ లొకేషన్‌ను ట్రాక్ చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తున్నాం. అప్లికేషన్ ఇప్పటికే సిద్ధమైంది. అంబులెన్స్‌ల ప్రతిస్పందన సమయం తనిఖీ చేయడానికి జియో ఫెన్సింగ్ టెక్నాలజీని వినియోగించనున్నాం. 15 రోజుల్లో ఈ సదుపాయం కూడా అందుబాటులోకి వస్తుంది. – ఎం.ఎన్. హరేందిరప్రసాద్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

అంశం	నాడు(2014-19 మధ్య టీడీపీ హయాంలో)	నేడు(ప్రస్తుత ప్రభుత్వం)
రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు	440 ఉండగా ఇందులో 336 మాత్రమే కండిషన్‌లో ఉండేవి. మిగిలిన 104 వాహనాలు కండిషన్‌లో ఉండేవి కావు.	768 అంబులెన్స్‌లు ఉన్నాయి.
జనాభా ప్రాతిపదికన	1,19,595 మంది జనాభాకు ఒక అంబులెన్స్	74,609 మంది జనాభాకు ఒక అంబులెన్స్
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు	86 మాత్రమే ఉండేవి	216 ఉన్నాయి(వీటిలో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డెఫిబ్రిలేటర్ సదుపాయం ఉంటుంది)
నియోనాటల్ అంబులెన్స్‌లు	లేవు	26 అంబులెన్స్‌లున్నాయి.
ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఫిజిషియన్(ఈఆర్‌సీపీ) సేవలు	కేవలం కొన్ని కేసులకు మాత్రమే అందేవి	అన్ని కేసులకు సేవలు అందుబాటులో ఉన్నాయి.

దళారులకు తావేలేదు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న ప్రక్రియను మరింత బలోపేతం చేయాలన్నారు. ఆర్బీకేల్లో ధాన్యం సేకరించగానే రైతుల పని ముగుస్తుందని, ఆ తర్వాత అంతా ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ఏమైనా సమస్యలు, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం ఉంటే ఫిర్యాదు చేయడానికి వీలుగా ఒక నంబర్‌ను ఏర్పాటు చేయాలని, రైతులు ఫిర్యాదు చేయగానే వెంటనే అధికారులు స్పందించాలని ఆదేశించారు. ఈ వివరాలు అన్నింటినీ రైతులకు ఇచ్చే రశీదులో ముద్రించాలని చెప్పారు. ఇలా అన్ని విధాలా రైతులకు మంచి చేయడంలోనే సంతోషం ఉంటుందన్నారు.



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> ప్రతి గ్రామంలో సాయిల్ టెస్టింగ్ అయ్యాక కచ్చితంగా మ్యాపింగ్ చేయాలి. తద్వారా ఎరువులు, రసాయనాల వినియోగం అవసరాల మేరకే జరుగుతుంది. దీంతో రైతులకు పెట్టుబడి ఆదాతో పాటు కాలుష్యం కూడా తగ్గుతుంది. రబీలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉండేలా ముందస్తుగా సమకూర్చుకోవాలి. ఫిబ్రవరి 20 నుంచి ఈ క్రాప్ నమోదు ప్రారంభిస్తే.. మార్చి మొదటి వారంలోగా తుది జాబితా వెల్లడించేలా పని చేయాలి. - సీఎం వైఎస్ జగన్

ఉత్తరాంధ్రలోనూ డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం

రైతులకు 50 శాతం సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాలను అందించడంపై దృష్టి సారించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ఆర్బీకేల స్థాయిలో కిసాన్ డ్రోన్లకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల (సీహెచ్‌సీ)ను లక్ష్యం మేరకు నిర్ణీత వ్యవధిలోగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో మాదిరిగానే ఉత్తరాంధ్రలోనూ డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను సైతం అందించాలని చెప్పారు. మాండస్ తుపానుతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ అమలుకు కార్యాచరణ రూపొందించాలని, ఏటా ఏప్రిల్‌లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించి రైతులకు టెస్టు రిపోర్టులు ఇవ్వాలని ఆదేశించారు. ఆ ఫలితాల ఆధారంగా భూమిలో ఎటువంటి పంటలు వేయాలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని, ఆ పంటకు అవసరమైన పోషకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేస్తున్న ల్యాబ్‌లలో మట్టి నమూనా పరీక్షలు వేగంగా చేసేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ప్రతి ఆర్బీకేలోనూ పరీక్షలు చేసేలా పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. ఇందు కోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద నిధులు విడుదల చేసే సమయంలోనే రాష్ట్రంలో మనం రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తొలి విడత 500 డ్రోన్లు..

రైతులకు ఈ ఏడాది మార్చి, మే, జూన్ నెలల్లో డ్రోన్లను అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. 2 వేల డ్రోన్ల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో భాగంగా తొలి విడతగా 500 డ్రోన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత డిసెంబర్ నుంచే డ్రోన్ల వినియోగంపై శిక్షణ ప్రారంభించామని, ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశించారు.

పెరిగిన ఆహార ధాన్యాల ఉత్పత్తి

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. 2014–19 మధ్య ఆహార ధాన్యాల సగటు ఉత్పత్తి 153.95 లక్షల టన్నులుంటే.. 2019–20 నుంచి 2022–23 ఖరీఫ్ వరకు 166.09 లక్షల టన్నులు నమోదైందన్నారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు వాటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని, రేషన్‌లో కోరుకున్న వారికి చిరు ధాన్యాలు అందించడానికి అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ధాన్యం సేకరణ కొనసాగింపు

ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఇప్పటి వరకు 89 శాతం మంది రైతులకు మద్దతు ధరను వారి ఖాతాల్లో జమ చేసినట్టు అధికారులు సీఎంకు చెప్పారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని 21 రోజుల కంటే ముందుగానే చాలా వరకు రైతులకు చెల్లింపులు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.5,373 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పంటల సీజన్లను దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి రెండో వారం వరకూ సేకరణ కొనసాగిస్తామన్నారు. స్థానిక వీఏఓ నుంచి డీఆర్‌ఓ నుంచి సర్టిఫై చేసిన తర్వాతే సేకరణ ముగిస్తామని తెలిపారు. తొలిసారిగా మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం సేకరణ జరిగిందని, రైతులకు సంపూర్ణ మద్దతు ధరను అందించగలిగామన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ వై.మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్, సహకారం ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సరళాదేవి



సరళాదేవికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి/తణుకు అర్బన్: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వావిలాల సరళాదేవి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, చేనేత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి, ఆమె భర్త వావిలాల వెంకట రమేశ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, సునీల్ పాల్గొన్నారు.

బాల్య విద్యలో భళా

▶ మొదటి పేజీ తరువాయి

విశ్లేషించేందుకు ప్రథమ్ సంస్థ 390 గ్రామాలలో సర్వే నిర్వహించింది. 7,760 కుటుంబాలు, 3 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న 12,950 మంది విద్యార్థులు సర్వేలో పాల్గొన్నారు.

- జాతీయ స్థాయిలో గత 15 ఏళ్లలో 6 – 14 ఏళ్ల వయసు పిల్లల చేరికలు 95 శాతం లోపే ఉండగా 2018 నాటికి 97.2 శాతానికి పెరిగాయి. ఇక 2022లో 98.4 శాతానికి చేరుకున్నట్లు సర్వేలో తేలింది. స్కూళ్లలో చేరని వారి సంఖ్య జాతీయ స్థాయిలో 1.6 శాతానికి తగ్గగా ఏపీలో 0.6 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.
- మూడేళ్ల వయసు పిల్లలకు జాతీయ స్థాయిలో 78.3 శాతం మందికి బాల్యవిద్య అందుతున్నట్లు సర్వే పేర్కొంది. 2018లో ఇది 71.2 శాతం మాత్రమే ఉంది. మూడేళ్ల అనంతరం ప్రీస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలలో చేరేవారు 2018లో 57.1 శాతం మంది ఉండగా 2022లో 66.8 శాతానికి పెరిగింది. నాలుగేళ్ల వయసు చిన్నారుల చేరికలు 50.5 శాతం నుంచి 61.2 శాతానికి పెరిగాయి. ఇదే కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయికి మించి ప్రగతి సాధించినట్లు ప్రథమ్ సర్వే వెల్లడించింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీలు, ప్రీస్కూళ్లలో చేరే పిల్లలు 2018లో 71.3 శాతం ఉండగా 2022 నాటికి 80.7 శాతానికి పెరిగారు. నాలుగేళ్ల వయసు పిల్లల చేరికలు 53.4 నుంచి 68.3 శాతానికి పెరిగాయి.
- దేశంలో ప్రభుత్వ స్కూళ్లలో 6–14 వయసు పిల్లల చేరికలు 2014 నాటికి 64.9 శాతం ఉండగా నాలుగేళ్లు పెరుగుదల లేదు. 2018 నాటికి 65.6 శాతానికి చేరుకోగా 2022లో 72.9 శాతానికి పెరిగినట్లు ప్రథమ్ సంస్థ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు 63.2 శాతం నుంచి 70.8 శాతానికి చేరినట్లు సర్వే పేర్కొంది. 2018 నుంచి 2022 మధ్య చేరికల్లో జాతీయ స్థాయి పెరుగుదల 7.3 శాతం కాగా ఏపీలో 7.6 శాతంగా ఉంది.
- బాలికల చేరికల విషయంలో జాతీయ స్థాయిలో ఏపీ ముందు వరుసలో నిలిచింది. 11 – 14 ఏళ్ల మధ్య వయసు బాలికల్లో పాఠశాలలకు వెళ్లని వారు జాతీయ స్థాయిలో 2006లో 10.3 శాతం కాగా 2018 నాటికి 4.1 శాతానికి తగ్గింది. 2022లో రెండు శాతానికి తగ్గిపోయింది. అదే ఆంధ్రప్రదేశ్‌లో బాలికల డ్రాపౌట్లు 1 శాతం లోపే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 15 – 16 ఏళ్ల వయసు బాలికల్లో పాఠశాలలకు రాని వారు జాతీయ స్థాయిలో 2008 నాటికి 20 శాతం ఉండగా 2018లో అది 13.5 శాతానికి తగ్గింది. 2022 నాటికి 7.9 శాతానికి తగ్గిపోయినట్లు అసర్ ప్రకటించింది. అదే ఆంధ్రప్రదేశ్‌లో స్కూళ్లకు దూరమైన 15 – 16 ఏళ్ల వయసు బాలికలు 2 శాతం లోపేనని తెలిపింది. మధ్యప్రదేశ్ (17శాతం), ఉత్తర్‌ప్రదేశ్ (15 శాతం), ఛత్తీస్‌గఢ్ (11.2 శాతం)లో జాతీయ సగటుకు మించి బడికి దూరమైన బాలికలున్నట్లు పేర్కొంది.
- దేశవ్యాప్తంగా ప్రైవేట్ ట్యూషన్లను ఆశ్రయిస్తున్న విద్యార్థుల శాతం పెరిగినట్లు అసర్ సర్వే తెలిపింది. 1 – 8 తరగతుల విద్యార్థుల ట్యూషన్లు 2018 – 22 మధ్య మరింత పెరిగినట్లు వెల్లడించింది. 2018లో 26.4 శాతం మంది ట్యూషన్లను ఆశ్రయించగా 2022 నాటికి 30.5 శాతానికి పైగా ఉన్నట్లు పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, జార్ఖండ్‌లలో ఇది మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది.
- టీచర్లు, విద్యార్థుల హాజరు శాతం గతంలో కన్నా మెరుగుపడినట్లు సర్వేలో తేలింది. జాతీయ స్థాయిలో 2018లో టీచర్ల అటెండెన్సు 85.4 శాతం ఉండగా 2022 నాటికి 87.1 శాతానికి పెరిగింది. గతంలో వీరి హాజరు 72 శాతం మాత్రమే ఉంది. స్కూళ్లలో పిల్లల హాజరు కూడా గణనీయంగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది.

ఆంగ్లంలో జాతీయ సగటుకు మించి ఫలితాలు

- రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో మంచి పురోగతి సాధించారని అసర్ 2022 నివేదిక పేర్కొంది. ఆంగ్లం, గణితంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నివేదికలో పొందుపరిచారు. ఇంగ్లిష్‌లో కేపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్, సింపుల్ 3 లెటర్ వర్డ్‌లు, అతి చిన్న వాక్యాలను ఇచ్చి 3, 5, 8 తరగతుల విద్యార్థులతో సర్వే చేపట్టినట్లు ప్రథమ్ సంస్థ పేర్కొంది.
- జాతీయ స్థాయిలో 5వ తరగతి పిల్లల్లో 2016లో ఇంగ్లిష్‌లో సామర్థ్యాలున్న పిల్లలు 24.7 శాతం మేర ఉండగా 2022లో అది 24.5 శాతంగా ఉంది. అదే 8వ తరగతిలో 45.3 శాతం నుంచి 46.7 శాతానికి పెరుగుదల ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జాతీయ సగటును మించి ఫలితాలు నమోదయ్యాయి. ఏపీలో ఇంగ్లిష్‌లో సామర్థ్యాలున్న (చిన్న వాక్యాలను చదవడం) పిల్లలు 5వ తరగతిలో 42.5 శాతం మంది ఉన్నట్లు నివేదిక తెలిపింది. అదే 8వ తరగతిలో 69.8 శాతం ఉన్నారు.
- అంకగణితం (అర్థమెటిక్స్)లో దేశవ్యాప్తంగా పిల్లల్లో సామర్థ్యాలు తగ్గాయని నివేదిక పేర్కొంది. కరోనా సమయంలో విద్యార్థులకు ఎదురైన ప్రతికూల పరిస్థితులే ఇందుకు కారణం. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లన్నిటిలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు వివరించింది. అయితే ఏపీలో 3, 5వ తరగతుల పిల్లలు ఒకింత వెనుకబడి ఉండగా 8వ తరగతి పిల్లల సామర్థ్యాలు జాతీయ సగటుకు మించి ఉన్నాయని ప్రథమ్ సంస్థ వెల్లడించింది. గణితంలో విభజన (డివిజన్) చేసే 8వ తరగతి పిల్లలు జాతీయస్థాయిలో 2018లో 44.1 శాతం మంది ఉండగా 2022 నాటికి స్వల్పంగా 44.7 శాతానికి పెరిగింది. ఏపీలో ఇది 2018లో 47.6 శాతం కాగా 2022లో 51.7 శాతంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

రోజూ జిల్లాకో లక్ష మందికి 'ఉపాధి'

- గ్రామాల్లో ముగుస్తున్న వ్యవసాయ సీజన్
- పేదలకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనుల కల్పనకు ప్రణాళిక
- మార్చి నెలాఖరులోగా కనీసం 5 కోట్ల పని దినాలు
- ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటికే 19 కోట్ల పని దినాల కల్పన
- కేంద్రం మూడో విడత కూడా 1.20 కోట్ల పని దినాలు పెంపు



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సీజను ముగుస్తుండటంతో పేదలు పనుల్లేక వలస పోయే పరిస్థితి లేకుండా ఉండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. అందుకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం ద్వారా రోజూ ప్రతి జిల్లాలో లక్ష మందికి పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మార్చి నెలాఖరుకి కనీసం ఐదు కోట్ల పని దినాల పాటైనా పేదలకు పనులు కల్పించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ఐదేళ్లుగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది కూడా పేదలకు సొంత గ్రామాల్లో పనుల కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున పను22ళ కల్పనపై గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ రోజూ జిల్లా అధికారులతో సమీక్ష చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో పనుల గుర్తింపుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఈ ఏడాదిలో ఇప్పటికే రూ. 4,022 కోట్ల మేర ఉపాధి పనులు

గత వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పనులతో కలిసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి) ఇప్పటివరకు 19.07 కోట్ల పనిదినాల పాటు ప్రభుత్వం పనులు కల్పించింది. 43.08 లక్షల కుటుంబాలకు చెందిన 76.08 లక్షల మంది వారి సొంత గ్రామాల్లోనే పనులు చేసుకొని ఇప్పటికే రూ. 4,022 కోట్లు లబ్ధి పొందారు. వీరిలో దాదాపు 34 శాతం ఎస్సీ, ఎస్టీలే. ఫిబ్రవరి, మార్చి నెలలో కూడా కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన దాదాపు 70 రోజుల్లో కనీసం ఐదు కోట్లు పనిదినాలు పని కల్పించాలని, మొత్తంగా ఈ ఏడాది 24 కోట్ల పనిదినాలు కల్పించాలని అధికారులు ఏర్పాట్లు చేశారు.

పని దినాల కేటాయింపులు పెంచిన కేంద్రం

కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఏడాది మూడో విడత పని దినాల కేటాయింపులు పెంచింది. ఈ ఆర్థిక ఏడాదికి మొదట రాష్ట్రానికి 14 కోట్ల పనిదినాలు మాత్రమే కేటాయించిన కేంద్రం.. గతంలో ఒక విడత మరో ఐదు కోట్ల పని దినాలకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తం 19 కోట్ల పనిదినాలు కేటాయింపులు చేసింది. ఆ లక్ష్యం కూడా ఇప్పటికే పూర్తవడంతో మంగవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, రాష్ట్ర అధికారుల వర్చువల్ సమావేశంలో మరో 1.20 కోట్ల పని దినాను కేటాయించింది. దీనితో పాటు వచ్చే రెండు నెలల్లో అవసరం ఉన్న మేరకు మరిన్ని పని దినాల కేటాయింపులు పెంచేందుకు సిద్ధమంటూ కేంద్ర అధికారులు రాష్ట్రానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్టు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

- సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అణగారిన వర్గాలు ఉన్నతస్థాయికి చేరుకుంటేనే నిజమైన సమ సమాజం ఏర్పడుతుందని విశ్వసిస్తూ గాంధీజీ, పూలే, అంబేడ్కర్ లాంటి మహానాయకులు కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని చెప్పారు. పరిపాలన అంటే ఎలా ఉండాలో చాటిచెప్పి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. బుధవారం తాడేపల్లిలోని సీఎస్సార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ – క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంలో ఉద్యోగులు కూడా భాగమని ముఖ్యమంత్రి జగన్ దృఢంగా భావిస్తున్నారని, ఉద్యోగులు లేకుండా ఏమీ చేయలేమన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, అందరి సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు ఆయా వర్గాల ప్రజలకు వాటిని తెలియచేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల



పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. గతంలో ఉద్యోగుల సంఘాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని సమస్యలున్నా ఖర్చు పెట్టే ప్రతి రూపాయి సరైన మార్గంలోనే వెళుతోందన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

గిరిజన సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. ఏజెన్సీలో విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు చేరేలా ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలని కోరారు.

సామాజిక న్యాయం సాకారం..

సామాజిక న్యాయాన్ని ఆచరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 50 శాతం ప్రజాప్రతినిధులను పాలనలో భాగస్వాములను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ప్రతి అధికారి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

బెంచ్ మార్క్‌గా సీఎం నిర్ణయం

సీఎం జగన్ ప్రభుత్వంపై విపక్షం అబద్ధాలను ప్రచారం చేస్తోందని సజ్జల ధ్వజమెత్తారు. ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని దారుణంగా కించపరచిన వ్యక్తి చంద్రన్న కానుక, విదేశీ విద్యను ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్య, వైద్యం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు మేలు జరిగేలా వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీకి మొదటి అడుగులు పడ్డాయని గుర్తుచేశారు. నామినేటెడ్ పోస్టులు, పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీఎం జగన్ 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతోపాటు మహిళలకు అందులో సగం కేటాయించారని చెప్పారు. సీఎం జగన్ తన నిర్ణయంతో బెంచ్ మార్కుగా నిర్దేశించారని తెలిపారు. ఎక్కువ మందికి న్యాయం జరుగుతుందని భావిస్తే సంతకం చేయడానికి సీఎం జగన్ వెనుకాడరని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పేద విద్యార్థులు రాణించాలనే ఇంగ్లిష్‌ను ప్రోత్సహిస్తున్నారని, తెలుగుపై కోపంతో కాదని స్పష్టం చేశారు. విదేశాల్లోని టాప్ వంద యూనివర్సిటీలలో పేద విద్యార్థులు సీటు తెచ్చుకుంటే ఎన్ని కోట్లైనా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. 101 నుంచి 200 ర్యాంక్ వరకు 50 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం విదేశీ విద్య పేరుతో అరకొరగానే విదిలించి బకాయిలు పెట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 9 సార్లు దావోస్ వెళ్లిన చంద్రబాబు ఎన్ని పెట్టుబడులు తెచ్చారని ప్రశ్నించారు. కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఒప్పందాన్నీ అమలు చేయలేదన్నారు.

తోడుగా నిలవాలి..

బడుగు బలహీన వర్గాలకు సీఎం జగన్ ప్రభుత్వం చేకూరుస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై కూడా ఉందని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. తొలుత ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్, ప్రభుత్వ సలహాదారు(సోషల్ జస్టిస్) జూపూడి ప్రభాకర్‌రావు, ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు, ఈఎన్సీ బాలూనాయక్, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ పద్మసుజాత, ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కందుకూరు ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ కేసు నమోదు

సాక్షి, అమరావతి: గత నెల 28న నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రోడ్‌ షోలో ఎనిమిదిమంది మృతిచెందిన ఘటనపై జాతీయ మానవహక్కుల సంఘం (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ - ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేసు నమోదు చేసింది. జనాలు ఎక్కువమంది వచ్చారని చూపించుకోవడం కోసం ఉద్దేశపూర్వకంగా ఇరుకైన వీధుల్లో రోడ్‌షో ఏర్పాటు చేసి తొక్కిసలాటకు తావిచ్చారని, దీంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ విజయవాడకు చెందిన వైద్యుడు అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ ఎన్‌హెచ్‌ఆర్‌సీకి గత నెల 29న ఫిర్యాదు చేశారు. ఇరుకైన వీధుల్లో జనాలు పోగైతే డ్రోన్ షాట్స్ బాగా వస్తాయని, వీటిని పార్టీ పబ్లిసిటీ కోసం వినియోగించుకోవచ్చని నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా రోడ్ షోకు ప్రణాళిక రచించారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు పబ్లిసిటీ కోసం చేసిన చర్యల ఫలితంగా తొక్కిసలాట జరిగి 29 మంది మృతిచెందారని ఫిర్యాదుదారుడు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కందుకూరు ఘటనపై నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తన ఫిర్యాదుపై ఈ నెల 10వ తేదీన కమిషన్ కేసు నమోదు చేసిందని రాధాకృష్ణ 'సాక్షి' తో చెప్పారు.

'పుడా' చైర్‌పర్సన్‌గా మిట్టపల్లి రమేష్‌బాబు

ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ



సాక్షి, అమరావతి: నరసరావుపేట కేంద్రంగా ఇటీవల ఏర్పడిన పలనాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్‌పర్సన్‌గా మిట్టపల్లి రమేష్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన పదవీ కాలం ఏడాది పాటు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేమూరి బలరామ్‌కు 'లోక్‌నాయక్' సాహిత్య పురస్కారం

- రాఘవేంద్రరావు, జయప్రద, జయసుధలకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారాలు
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా ప్రదానం



వేమూరి బలరామ్‌కు పురస్కారం అందజేస్తున్న వెంకయ్యనాయుడు

బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను విశాఖపట్నంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా పురస్కారాలను ప్రదానం చేశారు. స్వాతి వారపత్రిక ఎడిటర్ వేమూరి బలరామ్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. అలాగే సాహిత్య రంగం అభివృద్ధికి కృషి చేసిన కూచిభొట్ల ఆనంద్, విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన కోనేరు సత్యనారాయణ, గన్ని భాస్కరరావులకు లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. నటీమణులు జయప్రద, జయసుధలకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. రాజకీయాల్లో సంస్కరణలు తెచ్చిన మహనీయుడు ఎన్టీ రామారావు అని కొనియాడారు. వెన్నుపోటు పొడిచి ఆయన నుంచి పదవి దూరం చేసినప్పుడు తన వెంట నడిచి న్యాయం కోసం పోరాటం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నటుడు బ్రహ్మానందం, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కవి రెహమాన్ కన్నుమూత



విజయవాడ కల్చరల్: విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ కవి, అనువాదకుడు ఎం.ఎ. రెహమాన్ (76) బుధవారం ఆయన స్వగృహంలో కన్నుమూశారు. రెహమాన్ అనేక కవితా సంకలనాలను వెలువరించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్, పార్సీ, పర్షియన్, అరబిక్ భాషల్లో ఆయన కవితా సంకలనాలు వెలువడ్డాయి. విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా అనేక మంది ప్రముఖ కవులను పరిచయం చేశారు. అనువాదకునిగా అనేక సాహిత్య గ్రంథాలను వివిధ భాషల్లోకి అనువదించారు. కవి ఖాదర్ మొహిద్దీన్ రచించిన 'పుట్టుమచ్చ' ను ఇతర భాషల్లోకి అనువదించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రెహమాన్ మృతికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, కవులు, సాహితీ సంస్థల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

వాటాలు తేల్చాకే కాళేశ్వరానికి మూడో టీఎంసీ

గోదావరి బోర్డుకు తేల్చి చెప్పిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, అమరావతి: గోదావరి జలాల్లో నీటి వాటాలు తేలే వరకు మూడో టీఎంసీని తరలించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరణ పనులకు అనుమతి ఇవ్వకూడదని గోదావరి బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. విభజన చట్టం ప్రకారం ట్రిబ్యునల్ ద్వారా నీటి వాటాలు తేలే వరకు లేదా నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరాకే కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని గుర్తు చేసింది. కానీ.. నిబంధనలను తుంగలో తొక్కి గోదావరి జలాలను రోజుకు రెండు టీఎంసీలు తరలించేలా కాళేశ్వరం ఎత్తిపోతలకు 2018 జూన్ 6న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతి ఇచ్చిందని ఎత్తిచూపింది. నీటి వాటాలు తేలేదాకా ఆ అనుమతిని పునఃసమీక్షించడంతో పాటు మూడో టీఎంసీకి అనుమతి ఇవ్వొద్దని గోదావరి బోర్డు చైర్మన్ ఎంకే సిన్హాకు తెగేసి చెబుతూ రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖ రాశారు. వాటాలు తేలకుండానే ఎగువ రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే.. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను హరించినట్లేనని తేల్చి చెప్పారు. ఏపీ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత గోదావరి బోర్డుపై ఉందని గుర్తు చేశారు.

కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటైతేనే..

ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్(జీడబ్ల్యూడీటీ)ను కేంద్రం ఏర్పాటు చేయాలి. 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో గోదావరి జలాలను పంపిణీ చేయడానికి కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరారు. కానీ.. ఇప్పటి దాకా ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేయలేదు. ట్రిబ్యునల్ ఏర్పాటైతేనే రెండు రాష్ట్రాల నీటి వాటాలు తేలే అవకాశం ఉంది. నీటి వాటాలు తేలకుండానే తెలంగాణ సర్కార్ చేపట్టిన కాళేశ్వరం (రెండు టీఎంసీలు), చనాకా-కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలకు సీడబ్ల్యూసీ టీఏసీ అనుమతి ఇవ్వడంపై ఏపీ ప్రభుత్వం గోదావరి బోర్డు సమావేశాల్లో, కేంద్ర జల్ శక్తి శాఖ సమావేశాలు, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పర్యావరణ అనుమతి లేకుండానే కాళేశ్వరం ఎత్తిపోతల విస్తరణ (మూడో టీఎంసీ తరలింపు) పనులు చేపట్టడంపై తెలంగాణ రైతులు ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలనను గోదావరి బోర్డు ఆపేసింది. ఈ నెల 6న ఆ డీపీఆర్‌ను పరిశీలించాలని గోదావరి బోర్డుకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో గోదావరి బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది.

ఏపీకి 1,238.436 టీఎంసీలు అవసరం

- గోదావరి పరివాహక ప్రాంతం(బేసిన్)లో ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రాజెక్టులకు 1,238.436 టీఎంసీలు అవసరమని కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించింది.
- ఇందులో ఇప్పటికే పూర్తయి, వినియోగంలో ఉన్న ప్రాజెక్టులతోపాటు పోలవరానికి 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 737.153 టీఎంసీలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టి, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 75 శాతం లభ్యత ఆధారంగా 165.280 టీఎంసీలు అవసరం. మొత్తంగా 75 శాతం లభ్యత ఆధారంగా 902.433 టీఎంసీలు అవసరం.
- వరద జలాలను వినియోగించుకునే పూర్తి స్వేచ్ఛను, ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన మిగిలిన నికర జలాలను వాడుకునే హక్కును దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కల్పించింది. విభజన నేపథ్యంలో బేసిన్‌లో దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవుతుంది. 336 టీఎంసీల వరద జలాలను వాడుకోవడానికి ప్రాజెక్టులు చేపడతామని ఇప్పటికే కేంద్రానికి ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

- మూడు డిస్కంల ప్రతిపాదనలపై విశాఖ వేదికగా నిర్వహణ
- ఎవరైనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం
- వెబ్‌లింక్‌తో ప్రత్యక్షంగా వీక్షించే వెసులుబాటు
- విశాఖ చేరుకున్న మండలి చైర్మన్, సభ్యులు, డిస్కంల సీఎండీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిస్కంల సీఎండీలు పద్మాజనార్దన్ రెడ్డి, సంతోషరావు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2023-24 సంవత్సరానికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ గురువారం ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వేదికగా గురు, శుక్ర, శనివారాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రజాభిప్రాయ సేకరణకు ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, సభ్యులు పి.రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్ రాంసింగ్, డిస్కంల సీఎండీలు, అధికారులు బుధవారం విశాఖ చేరుకున్నారు. డిస్కంల ప్రతిపాదనలపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారు.

దరఖాస్తు చేయకపోయినా పాల్గొనవచ్చు

తమ అభిప్రాయాలు చెప్పేందుకు ఇప్పటికే 57 మంది దరఖాస్తు చేసుకున్నారు. గురువారం 15 మంది, శుక్రవారం 24 మంది, శనివారం 18 మంది వెబ్‌లింక్ ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయనున్నారు. పేర్లు నమోదు చేసుకోకపోయినప్పటికీ రాష్ట్రంలో ఎవరైనా అభిప్రాయాలు చెప్పాలనుకుంటే తమ సమీపంలోని విద్యుత్ ఎస్‌ఈ, ఈఈ కార్యాలయాల్లో సంప్రదిస్తే మండలి అనుమతితో అవకాశం కల్పిస్తారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మళ్లీ రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు https://ncubestreamings.com/-apercpublichearing వెబ్‌లింకు ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించే వెసులుబాటు కల్పించారు. సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి దీనికి ఏర్పాట్లు చేశారు.

సామాన్యులపై భారం పడకుండా..

ఈసారి విద్యుత్ టారిఫ్‌లో సామాన్యులపై చార్జీల భారం పడకుండా డిస్కంలు జాగ్రత్తపడ్డాయి. ఆ మేరకే ప్రతిపాదనలిచ్చాయి. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లలో డిస్కంలను ఆదుకోవడానికి చేసిన ఆర్థికసాయం, తద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఏ మేరకు బలోపేతమయ్యాయనే వివరాలను గణాంకాలతో సహా ప్రజల ముందుంచనున్నాయి. ముఖ్యంగా భవిష్యత్‌లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించేందుకు ఎలాంటి ఢోకాలేకుండా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో డిస్కంలు చేపడుతున్న చర్యలు, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించనున్నాయి. పరిశ్రమలకు సంబంధించి కొత్త ప్రతిపాదనలను మండలి ముందు ఉంచనున్నాయి. వీటన్నిటిపై వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది టారిఫ్‌పై మండలి నిర్ణయం తీసుకుంటుంది.

27న 'స్త్రీనిధి' ఎన్నికలు

- ఈ నెల 21న నామినేషన్ల స్వీకరణ
- 28న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

సాక్షి, అమరావతి: విజయవాడ అర్బన్ స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్‌కు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.కిరణ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ మేరకు ఎన్నికల నోటీసు, ఓటర్ల జాబితా విడుదల చేశామని తెలిపారు. 30 మంది పాలకవర్గ సభ్యుల్లో 26 మందిని రూరల్ సమాఖ్యల నుంచి, నలుగురిని అర్బన్ సమాఖ్యల నుంచి ఎన్నుకునేందుకు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని టి.టి.డి.సి, డి.ఆర్.డి.ఎ. పీడీ కార్యాలయాల్లో ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అనంతరం వాటిని పరిశీలించి సక్రమంగా ఉన్న వారి జాబితా ప్రకటిస్తామని తెలిపారు. 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఇస్తామని, అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటించి చిహ్నాలు కేటాయిస్తామని వెల్లడించారు. పోటీ ఉంటే 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాష్ట్రంలోని 26 జిల్లాల పథక సంచాలకులు, డి.ఆర్.డి.ఎ. కార్యాలయం ఆవరణలో ఆ జిల్లాకు సంబంధించిన రూరల్ సమాఖ్య, అర్బన్ సమాఖ్యకు కలిపి ఒకేచోట విడివిడిగా పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

411 ఎస్సై పోస్టులకు 1,73,047 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనున్న 411 ఎస్సై పోస్టులకు 1,73,047 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర పోలీసు నియామక మండలి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో 315 సివిల్ ఎస్సై (పురుషులు, మహిళలు) పోస్టులు, 96 ఏపీఎస్పీ ఎస్సై(పురుష) పోస్టులకు దరఖాస్తు గడువు బుధవారం సాయంత్రం ముగిసింది. సివిల్, ఏపీఎస్పీ ఎస్సై పోస్టులకు మొత్తం 1,73,047 దరఖాస్తులు రాగా.. పురుష అభ్యర్థులు 1,40,453 మంది, మహిళా అభ్యర్థులు 32,594 మంది ఉన్నారు.

కోర్టు ధిక్కార కేసులో నాటకీయ పరిణామాలు

- విద్యా శాఖ గత అధికారులు రాజశేఖర్, రామకృష్ణకు జైలుశిక్ష
- బేషరతు క్షమాపణలతో కోర్టు ముగిసే వరకు కోర్టులో ఉండాలని ఆదేశం
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేసిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కారం కేసులో హైకోర్టులో బుధవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో అలసత్వం ప్రదర్శించినందుకు పాఠశాల విద్యాశాఖ గత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఇంటర్మీడియెట్ విద్య గత కమిషనర్ వి.రామకృష్ణకు సింగిల్ జడ్జి జైలు శిక్ష విధించడం, వారు క్షమాపణలు కోరడంతో జైలుశిక్ష ఉత్తర్వులను సవరించి కోర్టు పని గంటలు ముగిసే వరకు కోర్టులోనే ఉండాలని ఆదేశాలు ఇవ్వడం, ఆ ఆదేశాలను ధర్మాసనం నిలుపుదల చేయడం చకచకా జరిగిపోయాయి. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ గోదావరి జిల్లా వీఈసీ జూనియర్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్న సాంబశివరావు సర్వీసును క్రమబద్ధీకరించాలని న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ 2020లో ఆదేశాలు జారీ చేయగా.. అప్పటి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అప్పటి ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ రామకృష్ణ అమలు చేయలేదు. దీంతో వారిద్దరిపైనా సాంబశివరావు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ దేవానంద్ ఇరువురు అధికారులు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాల అమలులో జాప్యం చేశారని ప్రాథమికంగా తేల్చారు. శిక్ష విధించేందుకు వీలుగా వారిద్దరినీ కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రామకృష్ణ, రాజశేఖర్ బుధవారం కోర్టు ముందు హాజరయ్యారు. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. వారు క్షమాపణలు తెలిపారు. ఈ క్షమాపణలు సదుద్దేశంతో చెప్పడం లేదంటూ.. ఇరువురికీ నెల రోజుల చొప్పున జైలుశిక్ష, చెరో రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుని తుళ్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైకోర్టు అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ స్పందిస్తూ.. జైలు శిక్ష ఆదేశాల అమలును రెండు రోజులపాటు నిలుపుదల చేయాలని అభ్యర్థించగా.. న్యాయమూర్తి తోసిపుచ్చారు. కోర్టు హాలులోనే ఉన్న ఇరువురు అధికారులు మరోసారి బేషరతు క్షమాపణలు తెలపడంతో వారి వయసు, ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ దేవానంద్ వారికి విధించిన జైలు శిక్షను సవరించారు. కోర్టు పనివేళలు ముగిసేంత వరకు కోర్టు హాలులో ఉండాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. జరిమానా మాత్రం చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్ ఇచ్చిన ఆదేశాలపై ఇరువురు అధికారులు ధర్మాసనం ముందు వేర్వేరుగా కోర్టు ధిక్కార అప్పీళ్లు దాఖలు చేయగా.. న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ధర్మాసనం అత్యవసర విచారణకు అంగీకరించింది. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ

ముకరంజా అంత్యక్రియలు పూర్తి

- నిజాంకు నివాళులర్పించిన పలువురు అధికార, అనధికార ప్రముఖులు
- చౌమహల్లా ప్యాలెస్‌లో పోలీసుల గౌరవ వందనం
- అంతిమ యాత్రలో పాల్గొన్న హోంమంత్రి, ఎంఐఎం నేతలు

దూద్‌బౌలి (హైదరాబాద్): టర్కీలోని ఇస్తాంబుల్‌లో మృతిచెందిన 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ ముఖరంజా అంత్యక్రియలు బుధవారం మక్కా మసీదులో ముగిశాయి. చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచిన ఆయన పార్థివదేహానికి వేలాదిమంది నివాళులర్పించారు. చౌమహల్లా ప్యాలెస్‌లోనే ప్రభుత్వ లాంఛనాలతో ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం నవాబ్ అంతిమయాత్ర ప్యాలెస్ నుంచి ప్రారంభమై మక్కా మసీదు వరకు కొనసాగింది. పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఆయన అంతిమయాత్రలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం 5 గంటలకు మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పార్థివదేహాన్ని సమాధి చేశారు. గతంలో ఆయన కోరిక మేరకు తన తండ్రి సమాధి పక్కనే అంత్యక్రియలను పూర్తి చేశారు. అంతిమయాత్రలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, మేరాజ్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీతో పాటు అనేక మంది ముస్లిం మత ప్రముఖులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మన గుడ్డు వైపు.. విదేశాల చూపు

▶ మొదటి పేజీ తరువాయి

మలేషియా, తైవాన్, హాంకాంగ్, జపాన్ వంటి దేశాల మార్కెట్లలోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటోంది.

ధరలు పెరగడానికి కారణమిదే

బర్డ్‌ఫ్లూ, ఏవియన్ ఫ్లూ వంటి వైరస్‌లు వ్యాప్తి చెందడంతో అమెరికా, జపాన్ వంటి దేశాల్లో కోళ్ల ఉత్పత్తిని నిలిపివేశారు. ఒక్క అమెరికాలోనే వైరస్ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 8 కోట్ల కోళ్లను చంపేశారు. జపాన్‌లో మరో కోటికిపైగా కోళ్లను చంపేశారు. దీంతో అంతర్జాతీయంగా కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోయి డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని శ్రీనివాస హేచరీస్ ఎండీ సురేష్ చిట్టూరి 'సాక్షి'కి తెలిపారు. ఇదే సమయంలో కోళ్ల దాణా వ్యయం భారీగా పెరగడంతో పలు ఉత్తరాది రాష్ట్రాల్లో కోళ్ల పెంపకానికి విరామం ఇచ్చారు. మిగతా రాష్ట్రాల్లో ఉత్పత్తిని కొంత మేర తగ్గించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 45 లక్షల వరకు కోళ్ల ఉత్పత్తి తగ్గగా, ఆంధ్రా, తెలంగాణల్లో కలిసి 20 లక్షలకు పైగా ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో డిమాండ్‌కు తగినంతగా సరఫరా లేకుండాపోయింది. ఒక్క మహారాష్ట్రలోనే రోజుకు కోటికి పైగా గుడ్లకు కొరత ఉందని అధికారులు ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. ఇవన్నీ రాష్ట్రంలో పౌల్ట్రీ రైతులకు కలిసొచ్చే అంశాలని విశ్లేషకులు చెబుతున్నారు.

దేశంలోనూ భారీగా పెరుగుతున్న గుడ్డు వినియోగం

దేశంలో తలసరి కోడి గుడ్డు వినియోగం పెరుగుతుండటం కూడా గుడ్ల ధరలు పెరగడానికి మరో కారణమని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. దేశంలో గడిచిన 15 ఏళ్లలో కోడి గుడ్ల తలసరి వినియోగం మూడురెట్లు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2005లో దేశీయ తలసరి కోడిగుడ్డు వినియోగం 34 ఉండగా అది 2021కి 90 గుడ్లకు పెరిగింది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత కోడి గుడ్ల వినియోగం భారీగా పెరిగిందని సురేష్ తెలిపారు. కోవిడ్‌కు ముందు తలసరి గుడ్డు వినియోగం 70గా ఉంటే అది 90కి చేరినట్లు తెలిపారు. కానీ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ దేశీయ తలసరి కోడిగుడ్ల వినియోగం 180కి చేరినప్పుడే పిల్లలు బలవర్ధకంగా ఉంటారని సూచిస్తోంది. ఈ నేపథ్యంలో గుడ్ల ఉత్పత్తిని గణనీయంగా పెంచి, దేశీయంగా, విదేశాలకు ఎగుమతుల్లోనూ రాష్ట్ర రైతులు దూసుకుపోయే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



దేశంలో వినియోగం పెరిగింది ఇలా..

సంవత్సరం	తలసరి గుడ్డు వినియోగం
1965	7
1970	8
1975	12
1980	13
1985	18
1990	21
1995	24
2000	30
2005	34
2010	51
2015	62
2021	90

తనఖా..ఆదాయంలో తడాఖా

- ఊపిరి పీల్చుకున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆదాయార్జనలో మెరుగైన పరిస్థితి
- కోవిడ్‌తో పెరిగిన తనఖా రిజిస్ట్రేషన్లు
- ఫలితంగా లక్ష్య సాధనదిశగా అడుగులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం మెరుగుపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో (గతేడాది డిసెంబర్ వరకూ) రూ.701.84 కోట్ల ఆదాయం సమకూరింది. అంతకు ముందు అంటే 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ గల కాలపరిధితో పోల్చుకుంటే రూ.72 కోట్ల ఆదాయ వృద్ధి సాధించింది. ఒక్క తూర్పుగోదావరి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలోనే ఎక్కువగా 84.46 శాతం లక్ష్యం సాధించింది. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 76.32 శాతం..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 80.72 శాతం లక్ష్యం మేర ఆదాయం సమకూర్చుకుంది. ఇందులో సగం పెరుగుదలకు తనఖా రిజిస్ట్రేషన్లే కారణమని ఆశాఖ అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఊపందుకున్న రియల్ ఎస్టేట్

స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖ పరంగా భూముల కొనుగోళ్లు, అమ్మకాల ద్వారానే ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఏదైనా క్రయ విక్రయాలు పాటు,వివిధ రకాల రిజిస్ట్రేషన్ల వల్ల స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, తదితరాల రూపాలలో ఆదాయం ప్రభుత్వానికి చేకూరుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుండటంతో ఆదాయంలో గణనీయ మార్పు కనిపించింది. ఫలితంగా భూముల క్రయ,విక్రయాలు పెరిగాయి. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వాదాయం కూడా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తరువాత నుంచి అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. దానికి తోడు కోవిడ్ ప్రభావం రిజిస్ట్రేషన్లశాఖపై పడింది. వైరస్ ప్రభావమున్న కాలంలో చాలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఆదాయం అనుకున్న రీతిలో రాలేదు. గడచిన మూడు సంవత్సరాలతో పోలిస్తే స్థిరాస్తి రంగం ఇప్పుడు కాస్త ఊపందుకుంది. ఇటీవల నాన్ లేఅవుట్ స్థలాల రిజిస్ట్రేషన్ చేయకూడదని రావడంతో అంతంత మాత్రంగా ఆదాయం వచ్చింది.

పెరిగిన తనఖా రిజిస్ట్రేషన్లు

తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 12, కాకినాడ జిల్లా పరిధిలో 9, కోనసీమ పరిధిలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వ్యవసాయ భూములు,ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇలా వేటినైనా సరే కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ శాఖ అనుమతి అవసరం. ఇటీవల కాలంలో తనఖా రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వచ్చే వంద రిజిస్ట్రేషన్లలో సగం ఇవే ఉంటున్నాయని సమాచారం. కోవిడ్ కారణంగా బయట అప్పులు ఇచ్చే వాళ్లు వెనుకంజ వేయడంతో చేసేది లేక అప్పులు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి చాలమంది బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు వెళ్లి స్థిరాస్తులను కుదువ పెట్టారు. తప్పనసరి పరిస్థితుల్లో రుణాలు తీసుకున్నారు. గతంలో ఇవి ఆస్తులకు సంబంధించిన పత్రాలు తీసుకుని రుణాలు మంజూరు చేసేవి. ప్రస్తుతం అన్ని సంస్థలూ తనఖా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశాయి. కొవిడ్‌తో అన్ని వర్గాలు ఆర్థికంగా దెబ్బతినడంతో మున్ముందు ఇబ్బందులు తలెత్తకుండా ఆస్తులను కుదువ పెట్టుకుని తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాయి. తరువాతే అప్పు ఇస్తున్నాయి. దీంతో సేల్ డీడ్‌లు, వివిధ రకాల రిజిస్ట్రేషన్లతో పాటు తనఖా రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి.

సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు

విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలికిన గ్రామ సచివాలయంలోనే సేవలన్నీ అందుబాటులోకి తీసుకురావాలనేది వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఇప్పటికే ఉన్న ఊళ్లో పలు సేవలు పొందుతున్న ప్రజలకు చేరువగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరు సచివాలయాలలో ఇందుకోసం ప్రయోగాత్మకంగా స్థిరాస్థుల రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. రెండో విడతలో కాకినాడ జిల్లాకు 113 తూర్పుగోదావరిజిల్లాకు 47, కోనసీమజిల్లాకు 51 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. ఇవి త్వరలో ప్రారంభం కానున్నాయి.

ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సచివాలయాలు...

- కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం సిరివాడ, పిఠాపురం మండలం ఇల్లింద్రాడ.
- కోనసీమ అమలాపురం మండలం పాలగుమ్మి, రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి.
- తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం, కొవ్వూరు మండలం తుగుమ్మి.



మంచి ఆలోచన, మంచి మాట, మంచి పని... ఈ మూడింటి నుంచి నువ్వు ఎప్పటికీ వైదొలగకు!

– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, జనవరి, 19

తలబొప్పి పలికించిన తత్త్వం

తలబొప్పి కడితే కానీ తత్త్వం బోధపడదంటే ఇదే. పాలు పోసి పెంచిన తీవ్రవాద సర్పం తన మెడకే చుట్టుకొంటూ, అస్తవ్యస్త విధానాలతో ఆర్థికంగా నట్టేట మునిగాక పాకిస్తాన్ తెలివి తెచ్చుకుంటు న్నట్టుంది. నిరుడు పగ్గాలు పట్టిన ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నోట హఠాత్తుగా ఊడిపడ్డ భార త్‌తో శాంతి చర్చల మాట చూస్తే అలాగే అనిపిస్తోంది. రెండురోజుల పర్యటనకు వెళ్ళిన ఆయన దుబాయ్ వార్తాఛానల్ 'అల్ అరేబియా'తో సోమవారం మాట్లాడుతూ భారత్‌తో మూడు యుద్ధాలతో గుణపాఠాలు నేర్చామనీ, నిజాయతీగా శాంతి చర్చలు జరపాలనీ, ఉభయులకూ మిత్రదేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్యవర్తిగా వ్యవహరించాలనీ అన్నారు. కానీ, ఆ మర్నాడే పాక్ ప్రధాని కార్యాలయం హడావిడిగా వివరణనిచ్చింది. కశ్మీర్‌లో 'చట్టవిరుద్ధ చర్యల'పై భారత్ వెనక్కి తగ్గితేనే చర్చలంటూ మెలికపెట్టింది. తప్పంతా తమదేనని అనిపించుకోవడం ఇష్టం లేని శక్తిమంతమైన సైనిక వర్గాలు ఒత్తిడి తేవడంతో పాక్ పాలకులు అలా స్వరం సవరించుకోవాల్సి వచ్చింది. కానీ అసలంటూ చర్చల ప్రస్తావన రావడం విశేషమే.

భారత్‌తో శాంతి నెలకొంటేనే పాక్ ఆర్థికవ్యవస్థకు లాభమని షెహబాజ్, ఆయన సోదరుడైన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌లు తరచూ చెబుతుంటారు. కానీ, భారత్‌తో చేసిన మూడు యుద్ధాలతో బుద్ధి వచ్చిందనీ, వాటి వల్ల కష్టాలు, కన్నీళ్ళు, నిరుద్యోగం, పేదరికమే దక్కాయనీ ఒక పాకిస్తానీ పాలకుడు అనడం ఇదే తొలిసారి. అందుకే, షెహబాజ్ తాజా మాటలు తరచూ చేసే శుష్క ప్రకటనల కన్నా భిన్నమైనవి, ప్రాధాన్యమున్నవి. అందులోనూ ఆర్థిక కష్టాల్లో 300 కోట్ల డాలర్ల మేర భుజం కాస్తున్న 'సోదర' దేశం యూఏఈని శాంతిసంధాతగా రమ్మనడమూ కీలకమే. నిజానికి, దాయాదుల మధ్య తెర వెనుక చర్చల ప్రక్రియకు మధ్యవర్తి పాత్ర తమ దేశమే పోషించిందని యూఏఈ ఉన్నత దౌత్యాధికారి 2021లో బయటపెట్టారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు నిచ్చాయన్నారు. మళ్ళీ ఆ సోదర దేశాన్నే పాక్ సాయం కోరింది.

నిజాయతీ ఎంత ఉందో కానీ, ఇన్నాళ్ళకు పాక్ పాలకులు సరైన దోవలో ఆలోచిస్తున్నారు. డాలర్ నిల్వలు పడిపోతూ, శ్రీలంక బాటలో పాక్ కూడా దివాళా తీసే ప్రమాదపుటంచున ఉంది. ఈ నేపథ్యంలోనే 'అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం చెలరేగితే, ఏం జరిగిందో చెప్పడానికైనా ఎవరూ మిగలర'న్న ఆకస్మిక జ్ఞానం వారికి కలిగిందనుకోవాలి. నిజానికి, పాక్ చర్చల ఆకాంక్ష, కశ్మీర్ సమస్య పరిష్కారం, చివరకు భారత్‌తో శాంతిస్థాపన ఆలోచనలు కొత్తవేమీ కావు. జనరల్ పర్వేజ్ ముషారఫ్ పాలనలోనే ఈ కథ కంచి దాకా వెళ్ళినట్టే వెళ్ళి, ఆఖరి క్షణంలో అడ్డం తిరిగింది. అప్పట్లో ఇక్కడ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీజేపీ ఒత్తిడి, అక్కడ ముషారఫ్‌ను బలహీనపరిచిన దేశీయ సమస్యలు కలసి బంగారం లాంటి అవకాశాన్ని చేజార్చాయి. ఆ మధ్య ఇమ్రాన్ ఖాన్ – సైన్యాధ్యక్షుడు జనరల్ బజ్వా ద్వయం కూడా ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని పునఃప్రారంభించాలని ప్రయత్నించింది. కానీ, పాక్ పాలక వర్గాలు పడనివ్వలేదు.

దేశ ఆర్థిక సమస్యలు, తీవ్రవాద 'తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్' (టీటీపీ) తలనొప్పి, పశ్చిమ ఆసియా భౌగోళిక రాజకీయాల్లో మార్పులు – ఇలా అనేకం శాంతి గీతాలాపనకు కారణం. పశ్చిమాసియాలో కీలకమైనవీ, పాక్‌కు 'సోదర' దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా తాజా పరిస్థితుల్లో భారత్‌కు దగ్గరయ్యాయి. దీంతో, పాక్ రూటు మార్చక తప్పట్లేదు. పైగా, భారత్‌తో శాంతి నెలకొంటే వాయవ్యాన తలనొప్పిగా మారిన తాలిబన్లపై దృష్టి పెట్టవచ్చు. ఈ ఏడాదే పాక్‌లో ఎన్నికలు జరగనున్నందున ఈ శాంతి వచనాలు ఊహించదగ్గవే. అధికారం కోరే ప్రతి పార్టీ ఓటర్లకు గాలం వేస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో భారత్‌తో శాంతిస్థాపన అంశాన్ని చేర్చడం షరా మామూలే. గత ఎన్నికల్లో ప్రధాని పీఠానికి పోటీపడ్డ ముగ్గురూ ఆ వాగ్దానమే చేశారు. ఇప్పుడు ఎన్నికల వేళ షెహబాజ్ అదే పల్లవి అందుకున్నట్టున్నారు.

కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని రద్దు చేస్తూ 2019 ఆగస్టులో తీసుకున్న నిర్ణయాన్ని భారత్ పునఃసమీక్షించే అవకాశం లేదు. అది మినహాయించి, జమ్ము-కశ్మీర్‌ల రాష్ట్ర హోదా పునరుద్ధరణ లాంటివి కోరుతూ చర్చలంటే కథ కొంత ముందుకు నడుస్తుంది. అదే సమయంలో యూఏఈ సహా ఉభయ మిత్రులూ, తెర వెనుక శక్తిమంతులూ ఎందరున్నా... అంతర్గత అంశమైన కశ్మీర్‌పై అంతర్జాతీయ జోక్యం మనకు సమ్మతం కానే కాదు. అది గుర్తెరిగి ప్రవర్తిస్తేనే తాజా ప్రతిపాదనకు సార్థకత. పీఎంఓ ప్రకటన అటుంచి, చర్చలకు కట్టుబడి ఉన్నామని షెహబాజ్ బృందం చేతల్లో చూపాలి.

పాక్‌తో గత అనుభవాల దృష్ట్యా ఆ దేశం నేర్చుకున్నట్టు చెబుతున్న గుణపాఠాల పట్ల భారత్‌కు అనుమానాలు సహజమే. అయితే, అనాలోచితంగా శాంతి ప్రతిపాదనకు అడ్డం కొట్టాల్సిన పని లేదు. దౌత్య, వాణిజ్యపరంగా ముందుగా చేయాల్సినవీ చాలానే ఉన్నాయి. 2019 ఆగస్టు పరిణామాల తర్వాత ఇరుదేశాల రాజధానుల్లోనూ హైకమిషనర్లు లేరు. కింది సిబ్బందే బండి నడుపుతున్నారు. పరస్పర విశ్వాసం పాదుగొల్పే చర్యల్లో భాగంగా రెండుచోట్లా హైకమిషనర్ల నియామకం జరగాలి. వీసాలపై షరతుల్ని సడలించాలి. సాంస్కృతిక, క్రీడా సంరంభాలను పునరుద్ధరించాలి. ముఖ్యంగా తీవ్రవాదానికి కొమ్ము కాయబోమని పాక్ నమ్మకం కలిగించాలి. శాంతి పథంలో సాగాలంటే అది అతి ముఖ్యం. అందుకు పాక్ రెండడుగులు ముందుకు వేస్తే, నాలుగడుగులు వేయడానికి శాంతికాముక భారతావని సదా సిద్ధంగానే ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.9.55 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.34 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.8.06 నుండి 9.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.04 వరకు తదుపరి ప.2.45 నుండి 3.32 వరకు, **అమృతఘడియలు:** తె.5.10 నుండి 6.43 వరకు (తెల్లవారితే శుక్రవారం).

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

వలంటీర్లంటే వణుకేల?

వారు గౌరవ పారితోషికంతో సేవలందిస్తున్నది అబద్ధమా?
ప్రభుత్వ పథకాలను చేర్చటంలో లంచాలకు, వివక్షకు తావుందా?
'ఈనాడు' కథనంలోని డొల్లతనాన్ని ఎత్తిచూపే 'ఏది నిజం' ఇదిగో...

ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే... దాని ఫలితాలు జనానికి అందాలి. పేదల సంక్షేమానికి పథకాలు పెడితే... అవి నేరుగా వారిని చేరాలి. ప్రభుత్వం ఓ కార్యక్రమం తలపెడితే... జనమంతా భాగస్వాములవ్వాలి. ఇదిగో... ఈ లక్ష్యాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఓ సేనను తయారు చేసుకున్నారు. క్రమశిక్షణ కలిగిన సైన్యమిది. ప్రతినెలా 1వ తేదీన అవ్వాతాతల ఇళ్ల తలుపు తట్టడమే కాదు. పొలాల్లోని రైతులు,ఆసుపత్రుల్లోని రోగులు సహా అందరినీ పరామర్శిస్తూ వారికి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల నుంచి ఇతర సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తున్నారు. కాబట్టే... ఇపుడు రాష్ట్రంలో అర్హత ఉండి పథకం అందలేదనే వారెవరూ లేరు. వివక్షతో దూరమైన వారు లేరు. లంచాలివ్వాలని బాధపడేవారు లేరు. అందుకేనేమో!! జనానికి చేరువైన ఈ జగనన్న సైన్యంపై చంద్రబాబులో వణుకు మొదలైంది. బాబు భయంతో... దిక్కుతోచని రామోజీరావుకు కలవరం పెరుగుతోంది. దాని ఫలితమే 'ఈనాడు' వరస కథనాలు!!. ఇటీవలే వలంటీర్లను గూఢచారులుగా వర్ణిస్తూ కథనం వండి వార్చిన రామోజీ... బుధవారం 'వాలంటీర్లతో ఓటు మాట' అంటూ మరో కథనం అచ్చేశారు. మరి ఇందులో నిజానిజాలేంటి?



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Rural Development Department – Social Security Pensions (SSP) – Verification of Pensioners with Aadhaar Details – Guidelines – Orders – Issued.
PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT (RD.I) DEPARTMENT
G.O.MS.No. 135 Dated:17.09.2014.
Read the following:

Grampanchayat pensions Committee	Municipal Ward Pensions Committee	Municipal Corporation Division Pensions Committee
Sarpanch - President	Ward Member - President	Corporator - President
MPTC - Member	SHG members - 2 Members	SHG Members - 2 Members
SHG Members - 2 - Members	Social Activists - 3 members	Social Activists - 3 members
Social Activists - 2 Members	Bill Collector - Member convenor	Bill Collector - Member Convenor
Gram Panchayat Secretary - Member Convener	-	-

పెన్షన్లపై పెత్తనాన్ని గ్రామ పంచాయితీ కమిటీకి అప్పగిస్తూ చంద్రబాబు హయాంలో ఇచ్చిన జీవో



Selection of beneficiaries and Sanction of houses

ఇళ్ల విషయంలో జన్మభూమి కమిటీలు చెప్పినట్లు నడచుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలిస్తూ చంద్రబాబు సర్కారు ఇచ్చిన జీవో ఇది.

ఏది నిజం ?

రామోజీ సహా చంద్రబాబు జట్టు మొత్తం తెలుసుకోవాల్సిన ప్రధానమైన విషయం... వలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కారనేది. గౌరవ పారితోషకం తీసుకుంటూ... పేరుకు తగ్గట్టే సేవాభావంతో పని చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్రంలోని కొన్ని కోట్ల కుటుంబాలకు ప్రభుత్వ పథకాల్నిచే ర్చటమనేది... వ్యవస్థలో వచ్చిన గొప్ప మార్పు. సేవా దృక్పథంతో లంచాలు, వివక్షకు తావులేకుండా వీరంతా పనిచేస్తుండటం వల్లే ఇది సాధ్యమైంది. ''వీళ్లు చేసినన్నాళ్లు చేస్తారు. మంచి ఉద్యోగం వచ్చినా, దీనికన్నా మంచి అవకాశం వచ్చినా వెళ్లిపోతారు'' అని వీరిని నియమిస్తున్నపుడే చెప్పారు సీఎం వైఎస్ జగన్. మరి అలా గౌరవ పారితోషికం తీసుకుంటూ... ప్రభుత్వ పథకాలను జనానికి చేరువ చేస్తున్న వలంటీర్లకు ఏ రాజకీయ పార్టీపైనా అభిమానమో, దురభిమానమో ఉండకూడదా? ఒక పార్టీ పట్ల వారు గనక అభిమానం చూపిస్తుంటే దాన్ని ఎవరైనా ఆపగలరా? తాము అభిమానించే పార్టీ తాలూకు సమావేశాలకు వాళ్లు గనక హాజరైతే దాన్ని తప్పు అనగలమా? ఎందుకీ రాతలు రామోజీరావు గారూ?

బాబు ఘోరాలు చేసినా ప్రశ్నించలేదేం?

ఇప్పుడు వలంటీర్ల సైన్యం ద్వారా అర్హులైన రాష్ట్ర ప్రజలందరికీ పథకాలు నేరుగా అందుతున్నాయి. లంచాలు, వివక్షకు అవకాశమే లేకుండా పోయింది. కానీ చంద్రబాబు నాయుడి హయాంలో పేదలకు పింఛన్లు, ఇళ్లు, రుణాలు.. ఇలా ఏమివ్వాలన్నా ఆయన ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీల సిఫారసు తప్పనిసరి. వారు ఓకే అంటేనే... ఇళ్లయినా, పింఛన్లయినా... ఆఖరికి రుణాలైనా. అందుకే అప్పట్లో పథకాల సొమ్ములన్నీ తెలుగుదేశం కార్యకర్తలకే అందాయి. టీడీపీ నేతలకు లంచాలిచ్చిన వారికే దక్కాయి. జన్మభూమి కమిటీలు ఆమోదించిన వారికే ఇళ్లతో సహా ఇతర పథకాలను ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశిస్తూ నాటి ప్రభుత్వం ఏకంగా జీవో కూడా విడుదల చేసేసింది. స్థానికంగా ఎక్కడైనా వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులుంటే... వారి ప్రమేయం లేకుండా స్వచ్ఛంద కార్యకర్తల పేరిట టీడీపీ వారిని నియమించుకుని మరీ ప్రతి పథకాన్నీ దుర్వినియోగం చేశారు. ఇది ప్రబలిపోవటంతో కొందరు అప్పట్లో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినా... ఇందులో తప్పేమీ లేదని న్యాయస్థానం పేర్కొనటంతో టీడీపీ మరింతగా రెచ్చిపోయింది. లబ్ధిదారుల వివరాలు సైతం లేకుండా... 'నచ్చినోళ్లకు నచ్చినంత..' అనే రీతిలో సాగిన ఈ దుర్నీతిపై అప్పట్లో 'ఈనాడు' ఒక్క అక్షరం ముక్క రాస్తే ఒట్టు! రామోజీరావు ఒక్క ప్రశ్న సంధిస్తే ఒట్టు! వాస్తవమేంటంటే అప్పట్లా ఇప్పుడు వలంటీర్లకు పథకాలను మంజూరు చేసే అధికారమేదీ లేదు. వారు కేవలం సంధానకర్తలు. ప్రజల దరఖాస్తులను ప్రభుత్వ యంత్రాంగానికి అందజేయటం వరకే వారి పని. డాక్యుమెంట్ల ఆధారంగా అర్హతలను తేల్చేది పై స్థాయి అధికారులే. ఒకవేళ వలంటీర్లు తమకు పథకం దక్కకుండా చేస్తారనుకుంటే నేరుగా సచివాలయాలకే వెళ్లి దరఖాస్తు చేయొచ్చు. అయినా ఏ కారణం వల్లనైనా రాకపోతే... మళ్లీ దరఖాస్తు చేయొచ్చు. లబ్ధిదారుల సోషల్ ఆడిట్... పారదర్శకంగా పేర్లు సచివాలయాల్లో ప్రదర్శించటం... ఇదంతా వీసమెత్తు కూడా దాపరికం లేని వ్యవహారం. ఇక లబ్ధిదారులు ఎంపికయ్యాక వారికి ఆ పథకం ఫలాల్ని అందజేసే బాధ్యతను మాత్రం వలంటీర్లు తీసుకుంటున్నారు. అంటే వీరు ప్రజలకు– ప్రభుత్వానికి వారధి మాత్రమే. మరి ఈ రాతలెందుకు? వారికి సొంత రాజకీయ అభిప్రాయాలుండటం తప్పెలా అవుతుంది?

దుష్ప్రచారానికి దారులు...

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొదట ఈ వలంటీర్ల ఆలోచనను బయటపెట్టి నియామకాల ప్రక్రియ మొదలుపెట్టినపుడు బాబు నానా యాగీ చేశారు. ఎల్లో దుమారం ఎక్కువే రేగింది. అసలు వీళ్ల అవసరమేంటి? అంటూ కథనాలు వండేసింది ఎల్లో ముఠా. కానీ వలంటీర్లు తమ సేవా భావంతో ప్రజలకు దగ్గరయ్యారు. కోవిడ్ సమయంలో ప్రపంచమంతా నివ్వెరపోయే పనితీరు కనబరచడంతో పాటు... పెన్షన్లు అందించటంలో కొత్త చరిత్ర లిఖించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరుస్తూ వారే బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. దీంతో 'వలంటీర్ల గౌరవ వేతనం పెంపు' పేరుతో వారిని రెచ్చగొట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసేలా పురిగొల్పింది టీమ్ ఎల్లో. అందులో కూడా సక్సెస్ కాలేక ... ఏకంగా వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా పెట్టాలంటూ ఎన్నికల సంఘానికి తెలుగుదేశం నేతలే ఫిర్యాదు చేశారు. తరవాత వాళ్లను గూఢచారులుగా పేర్కొంటూ కొత్త ప్రచారానికి తెరతీశారు. ఇప్పుడేమో వాళ్లు వైఎస్సార్ సీపీ సమావేశాలకు హాజరవుతున్నారంటూ మరో వాదన తెచ్చారు.

వలంటీర్లకు ఎన్ని బాధ్యతలో...

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించటంలో వలంటీర్ల వ్యవస్థ ఎండావానలను లెక్క చేయక... చలికి భయపడక అహర్నిశలూ పనిచేస్తున్నదనేది కాదనలేని వాస్తవం. 2019 జూన్ నుంచి ఈ వ్యవస్థ ప్రతి నెలా దాదాపు 62.5 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తోంది. కొత్త రైస్ కార్డులివ్వటంతో పాటు రైస్ కార్డులున్న వారందరికీ సేవలందిస్తోందీ వ్యవస్థ. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద కొత్త కార్డులు మంజూరు చేయటం... ఆరోగ్య శ్రీని ఉపయోగించుకోవటంపై అవగాహన కల్పించటం చేస్తోంది. ఇవే కాదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కాపు నేస్తం, చేయూత, రైతు భరోసా, మత్స్యకార భరోసా, వైఎస్సార్ జలకళ, వాహన మిత్ర, నేతన్న నేస్తం, ఆసరా, వైఎస్సార్ బీమా, సంపూర్ణ పోషణ, ఉచిత పంటల బీమా, లా నేస్తం, రైతులకు సున్నా వడ్డీ, ఆరోగ్య ఆసరా, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విదేశీ విద్యా దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, రజకులు.. టైలర్లు... నాయీ బ్రాహ్మణుల కోసం జగనన్న చేదోడు, జీవ క్రాంతి, అమూల్ పాలవెల్లువ, కంటి వెలుగు, అమ్మ ఒడి... అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు ఒకసారి అందించే ఆర్థిక సాయం, పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాల పట్టాల మంజూరు, ఈబీసీ నేస్తం వంటి పదుల కొద్దీ పథకాల ఫలాలను అర్హులకు చేరుస్తున్నారు.

ఈ తేడా కనిపించదా రామోజీ?

- బాబు హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులంతా నామినేటెడ్ వ్యవహారమే. టీడీపీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన ఆ పార్టీ ఇన్‌ఛార్జీలే నామినేట్ చేసేశారు. అందులో కుల మతాల పాత్రా అధికమే. కానీ జగనన్న సైన్యమైన వలంటీర్లను మాత్రం... దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించి రిజర్వేషన్లు, రోస్టర్ ప్రకారం స్థానిక ఎంపీడీవోలే ఎంపిక చేశారు. అందుకే ప్రస్తుతం పనిచేస్తున్న 22.65 లక్షల మందిలో 82 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే!!. పైపెచ్చు వీరిలో సగానికి పైగా మహిళలే. వీరి సేవలను యునిసెఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. తమ అభివృద్ధి లక్ష్యాల కోసం వలంటీర్లతో కలిసి పనిచేస్తున్నాయి.
- బాబు హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు పూర్తిగా రాజకీయ నాయకుల్లానే పనిచేశారు. వలంటీర్లు మాత్రం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో విధిగా హాజరు వేయించుకుంటున్నారు. జవాబుదారీతనంతో పనిచేస్తున్నారు. అందుకే ఈ సైన్యాన్ని చూసి బాబుకు వణుకు పుడుతోంది.
- రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడున్నర ఏళ్లలో దాదాపు రూ.3.5 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందజేస్తే.. ఎక్కడా పైసా అవినీతి జరగకుండా ప్రతి పైసా నేరుగా లబ్ధిదారులకు చేరింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పథకాల్లో 15 శాతం కూడా పేదలకు సరిగా చేరని పరిస్థితి ఉండేది.

కోవిడ్ సమయంలో ప్రపంచమే జేజేలు కొట్టింది...

2020 తొలినాళ్లలో ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి వణికిస్తున్నపుడు... దేశం యావత్తూ భయాందోళనల నిండి, ఆసుపత్రులలో బెడ్‌లు సైతం దొరక్క విలవిలలాడినపుడు అందరికీ ఒక దిక్సూచిలా కనిపించింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. పక్క రాష్ట్రాల నుంచి కోవిడ్ రోగులు సైతం నిబంధనలను గాలికొదిలేసి మరీ ఏపీకి వచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడకు వస్తే... ఇక భయం లేదని ప్రతి ఒక్కరూ భరోసా ఫీలయ్యారంటే... అది ఈ ప్రభుత్వం సృష్టించిన వలంటీర్ల వ్యవస్థ వల్లే సాధ్యమైందని వేరే చెప్పక్కర్లేదు. ఎందుకంటే కోవిడ్ మహమ్మారికి భయపడి జనం ఇళ్లలోంచి బయటకు రావటానికే భయపడుతున్న సమయంలో... బయట తిరిగితే ప్రమాదమని తెలిసి కూడా వీరే సైన్యంగా పని చేశారు. ఇళ్లకు రోజువారీ సరుకులతో పాటు మందులు అందించటంతో పాటు 16 కోట్ల మాస్కుల్ని జనానికి అందజేశారు. పేదలకు ప్రత్యేక సాయంగా రూ.వెయ్యి చొప్పున అందించటంతో పాటు వ్యాక్సిన్లు త్వరగా అందేలా చూశారు. క్వారంటైన్ సెంటర్లలో సేవలందించటంతో పాటు రికార్డు స్థాయిలో 46 సార్లు ఫీవర్ సర్వే చేశారు. అన్నిటికన్నా ప్రధానం... కోవిడ్ మృతుల భౌతిక కాయాలను దహనం చేయటంలోనూ సాయపడ్డారు. అలాంటి సేవలకు యావత్తు దేశం జైకొట్టగా... రామోజీరావు మాత్రం రాజకీయాలు అంటగడుతూ చెలరేగిపోతుండటం ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరొకటి కాదనే చెప్పాలి.

ప్రభుత్వ విభాగాలకూ సహాయంగా...

- ఇవికాక వివిధ ప్రభుత్వ విభాగాలు సైతం వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటున్నాయి. సొంతిళ్లున్న వారిని ఆస్తిపన్ను చెల్లించమని అభ్యర్థిస్తున్న వలంటీర్లు... స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే, మనం మన పరిశుభ్రత, ఫ్రైడే-డ్రైడే, చెత్త పన్ను వసూలు... ఇలాంటి అంశాలన్నిటా వినియోగదార్లకు అవగాహన కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి విభాగానికి, పంచాయతీ రాజ్-గ్రామీణాభివృద్ధి విభాగానికి సహకరిస్తున్నారు.
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో అర్హత ప్రమాణాలను విచారించడంలో వీఆర్వోలకు సహకరిస్తున్నారు.
- వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టే వ్యాక్సినేషన్ డ్రైవ్‌లకు, ఫీవర్ సర్వేలు, ఆరోగ్య సర్వేలకు వలంటీర్లే ఆధారం.
- వలంటీర్ల సాయం లేకుంటే ఆర్‌బీకే సిబ్బంది ఈ-క్రాప్ బుకింగ్‌కు రైతులను గుర్తించడం అంత తేలిక కాదు.
- ప్రత్యేక వాహనాల్లో రేషన్ బియ్యాన్ని ఇళ్ల వద్దకు తీసుకెళ్లి అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు పూర్తి సహకారం వలంటీర్లదే.
- ఇక తుపానులు, భారీ ప్రమాదాలు జరిగినపుడు చాలా మంది వలంటీర్లు స్వచ్ఛంద సైనికుల్లా రంగంలోకి దూకి సేవలందిస్తున్నారు. నిన్నగాక మొన్న వచ్చిన కోనసీమ వరదల్లో వలంటీర్ల సాయాన్ని అక్కడి ఏ వ్యక్తినడిగినా చెప్పకమానడు.
- మరి ఇన్ని బాధ్యతలు నిర్వర్తిస్తున్న వలంటీర్లను రామోజీరావు ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? ఏదో ఒకలా వాళ్లను తమ విధులకు దూరం చేద్దామనా? ఈ రాష్ట్రంలో అర్హులకు పథకాలు అందకుండా చేసి... ప్రభుత్వానికి ఆ మకిలిని అంటిద్దామనా? ఇంతకన్నా ఘోరమైన కుట్ర ఉంటుందా రామోజీ?

ఒక పోస్ట్‌మాస్టర్ పెన్షన్ కథ!

నాపేరు తబ్బిబ్బు మహానందప్ప. నా వయసు 84 సంవత్సరాలు. నేను ఉమ్మడి కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో జన్మించాను. ఆ కాలంలోనే అంటే 1961 లో పీయూసీ చదివి కర్నూల్ మెడికల్ కాలేజీలో 1961–63 సంవత్సరాలలో 3 సంవత్సరాల కాంపౌండర్ కోర్సు, 1965లో హిందీ ప్రవీణ ప్రచారక్ కోర్సులను పూర్తి చేశాను. ఆ తర్వాత 1970లో గ్రామంలోనే బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఉద్యోగం రావడంతో ఆ ఉద్యోగం చూసుకుంటూ స్వగ్రామంలోనే స్థిరపడ్డాను. పోస్ట్ మాస్టర్ ఉద్యోగం అదనపు శాఖా ఉద్యోగం (ఈడీ) కావడంతో జీతం చాలా తక్కువ వచ్చేది. ఉద్యోగం ప్రారంభంలో నా జీతం 30 రూపాయలు మాత్రమే. అలవెన్సు కింద మరో 15 రూపాయలు ఇచ్చేవారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా 36 ఏళ్ళు పనిచేసి 2006 సంవత్సరంలో పదవీ విరమణ చేశాను. తపాలా శాఖ కేంద్ర ప్రభుత్వం అధీనంలోనిదే అయినా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లకు పదవీ విరమణ తర్వాత ఎలాంటి పెన్షన్ లేదు. పోస్ట్ మాస్టర్‌గా సుదీర్ఘ కాలం పని చేసినప్పటికీ కంటి తుడుపుగా గ్రాట్యుటీ పేరుతో కేవలం 48 వేల రూపాయలు మాత్రమే చేతిలో పెట్టి సాగనంపారు. ఆ డబ్బులు కనీస అవసరాలను కూడా తీర్చలేక పోయాయి. అరకొర జీతంతోనే మా బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని తొమ్మిది గ్రామాలకు సేవలను అందించాను. నాకు ఉద్యోగం వచ్చినప్పుడు మా బ్రాంచ్ ఆదాయం నెలకు 2 వేల రూపాయలు ఉండేది. నేను రిటైర్ అయ్యే నాటికి ఆ ఆదాయం నెలకు 25 వేల రూపాయలకు పెరిగింది.

నా జీతం మాత్రం పదవీ విరమణ నాటికి 2,800 రూపాయలే. గ్రామీణ ప్రజలకు తపాలా సేవలను అందించడంతోపాటు కాంపౌండర్‌గా శిక్షణ పొంది ఉండటంవల్ల వైద్యసేవలు కూడా అందించాను. పదవీ విరమణ తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే శూన్యం మాత్రమే కనబడింది. నా జీవన పోరాటంలో భాగంగా మైదుకూరులో నివాసం ఉంటూ ఈ వయసులో కూడావైఎస్ఆర్ జిల్లా, దువ్వూరు మండలం, గుడిపాడులో ఒక ప్రైవేటు విద్యాసంస్థలో పార్ట్ టైం హిందీ బోధకుడిగా పని చేస్తున్నాను. జగనన్న ప్రభుత్వం అందచేసే 'వైఎస్సార్ పెన్షన్ కానుక' కింద గత నెల దాకా రూ. 2,500 అందించేవారు. తాజాగా ఈ మొత్తాన్ని మరో 250 రూపాయలు పెంచడం ఆనందదాయకం. పెరిగిన మొత్తంతో కలిపి 2,750 రూపాయలు జనవరి 1వ తేదీ కానుకగా అందుకున్నాను. మా వార్డ్ వాలెంటీర్ 'యాస్మిన్' అనే అమ్మాయి ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఇంటి కొచ్చి ఠంచనుగా పింఛన్ అందజేస్తోంది. ఈ పింఛనే నా ఆత్మగౌరవాన్ని కాపాడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– టి. మహానందప్ప, రిటైర్డ్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, మైదుకూరు

లోకకవి మన వేమన!

సందర్భం




పి. విజయబాబు

వానకు తడవని వారూ, ఒక్క వేమన పద్యం కూడా వినని తెలుగువారూ ఉండరని లోకోక్తి. అలతి పదాలతో సమాజంలోని రుగ్మతలను తూర్పార బట్టిన మనో వైజ్ఞానికుడు వేమన. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘసంస్కర్త, విప్లవకారుడు వేమన. 1839లో తొలిసారిగా బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత అనేకమంది ఆయనపై పరిశోధన చేశారు. ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ వారి సహకారంతో వేమన జీవిత చరిత్రను 14 భాషలలోకి అనువదించడానికి కారకులయ్యారు. ఆంగ్ల, ఐరోపా భాషల్లోకీ; అన్ని ద్రవిడ భాషల్లోకీ వేమన పద్యాలు అనువాదమయ్యాయి. సి.ఇ. గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమన సాహిత్యానికి ముగ్ధులై ఆయనను లోక కవిగా కీర్తించారు.

వేమన 1602–1730 మధ్య కాలానికి చెందిన వాడనీ కొండవీటి రెడ్డి రాజవంశానికి చెందిన వాడనీ అంటారు. జన బాహుళ్యంలో ఉన్న వివరాల ప్రకారం, వేమన అసలు పేరు బెధమ కోమటి చినవేమారెడ్డి. ఈయన అన్న పేరు బెధమ కోమటి పెదవేమారెడ్డి. వేమన జన్మించిన ప్రాంతంపై అనేక రకాల అభిప్రాయాలు ఉన్నప్పటికీ చివరిగా ఆయన అనంతపురం జిల్లా కదిరి సమీపంలో ఉన్న కటారు పల్లె ప్రాంతానికి చెందిన వారని నిర్ధారించారు. అందుకే ఆ ప్రాంతంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా వేమన జయంతి ఉత్సవాలను జరపడానికి నిర్ణయించుకుంది.

వేమన భోగలాలసుడుగా తిరుగుతూ ఒకానొక దశకు వచ్చేటప్పటికి ఓ సాధువు ద్వారా ఆత్మ జ్ఞానం పొంది అన్నింటినీ త్యజించి యోగిలా మారిపోయాడని అంటారు. సంసార బాధల నుండి ఉపశమనం పొందడానికి తనను ఆశ్రయించే అభాగ్యులకు తన పద్యాల ద్వారా



తత్వాన్ని బోధించడం మొదలు పెట్టాడు. తన మాటల ద్వారా తనలో జ్ఞానజ్యోతిని మొట్ట మొదటగా వెలిగించిన తన ప్రేయసి విశ్వద పేరును, తనకు కష్ట కాలంలో అండగా నిలిచిన మిత్రుడు అభిరాముడి పేరును తన పద్యాలకు మకుటంలో చేర్చి వారికి శాశ్వత కీర్తిని ప్రసాదించాడు వేమన అనేది కొందరి అభిప్రాయం. అయితే అసలు ఇవన్నీ కూడా ప్రక్షిప్తాలనీ... వేమన చిన్ననాటి నుంచే జ్ఞానశీలి అనీ, తదనంతరం స్నేహితుల ప్రభావంవల్ల దారితప్పి, ఆపై పరివర్తన వచ్చి యోగిగా మారాడనీ అంటారు. ఆయన పద్య మకుటానికి 'సృష్టి కర్తకు ప్రియమైన వేమా వినుము' అని పండితులు మరో అర్థాన్ని చెప్పారు. బ్రౌన్ ఈ అర్థాన్నే తీసుకొని వేమన పద్యాలను ఇంగ్లిష్‌లోకి అనువదించారు.


వేమన పద్యాలలో ఎక్కువగా లోక నీతులు, సామాజిక రీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయి. ఆయన కవిత్వంలో స్పృశించని అంశమే లేదు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు; మతం పేరిట జరుగుతున్న అరాచకాలు, దోపిడీలు, విగ్రహారాధనలోని మౌఢ్యం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు... ఒకటే మిటి? కనిపించిన ప్రతి సామాజిక రుగ్మత మీద వేమన తనకలం ఝుళిపించాడు.

సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకునేట్లు వారికి పరిచితమైన భాషలో స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా శక్తిమంతంగా వ్యక్తీకరించారు. వేమన పద్యా లన్నీ ఆటవెలది చందస్సులోనే చెప్పాడు. కవిత్రయం అంటే తిక్కన, వేమన, గురజాడ అంటాడు శ్రీశ్రీ. 'వేమన కవిత్వం గాయానికి మందు రాసినట్లు కాక, ఆ గాయం చేసిన కత్తికే ముందు మందు పూసినట్లుంటుంది' అంటారు రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ. తన పద్యాలలో సామ్యవాద సిద్ధాంతాన్ని ఎప్పుడో ఎలిగెత్తి చాటిన సామ్యవాద ప్రజా కవి వేమన.

వ్యాసకర్త అధికార భాషా సంఘం అధ్యక్షులు, ఏపీ
(నేడు వేమన జయంతి ఉత్సవాల సందర్భంగా)

సానుకూల మానసిక స్థితి

మనం ఏ పని చేయాలనుకున్నా అందుకు సానుకూలమైన మానసిక స్థితి తప్పనిసరిగా ఉండాలి. పెద్ద పెద్ద విషయాలకే కాదు, రోజువారీ పనులకు కూడా... అంటే వంట చేయటం, బయటకు పని ఉంటే వెళ్ళటం వంటి వాటికి కూడా మానసిక సంసిద్ధత ఉండాలి. లేకపోతే, అరకొర మనసుతో ఏ పని చేసినా ఆ పని పూర్తయినా; పూర్ణమైన తృప్తినీ, ఫలితాన్నీ ఇవ్వదు. చేయబోతున్న పనికి సానుకూలమైన మానసిక స్థితిని పెంపొందించుకున్న తర్వాతే ఆ పని ప్రారంభించటం వల్ల మంచి ఫలితాలు పొందగలం. దేవా లయాల్లో గర్భగుడి... ముఖద్వారం నుంచీ కొంత దూరం ఉంటుంది. దేవాలయంలో ప్రవేశించి దేవుని సమీపానికి నడిచే వ్యవధిలో ఇతర ఆలోచనలన్నింటినీ క్రమంగా పరిహరించుకుంటూ దైవంపై మనసు కేంద్రీకృతం చేయటానికి సంసిద్ధులమవ్వాలి. అప్పుడే పరిపూర్ణమైన మనసుతో దైవ దర్శనం చేసుకుని, దైవ చింతనలో గడపటానికి సాధ్య మవుతుంది.



పుస్తకం చేతిలో పట్టుకుని, పరధ్యానంగా ఎటో చూస్తున్న విద్యార్థిపై 'ఎందుకా మనసు పెట్టని చదువు? సమయం వృథా మనసు లగ్నం చేసి చదువు', అని కేకలేస్తుంటాం. మనసులేని ఏ పనీ రాణించదు.

మనసును మంచి విషయాలపై సంసిద్ధం చేయటానికి ప్రతి రోజూ, చెవులతో మంచి విషయాలనే వినాలి. కళ్ళతో మంచి విషయాలే చూడాలి. ఇతరులకు మేలు చేసే రీతిలోనే జీవించాలి అని ప్రార్థించాలని ఉప నిషత్తులు చెపుతున్నాయి.

తాను ఎందుకు, ఎవరికీ ఉపయోగపడనని రాత్రింబగళ్ళు భావించే వ్యక్తి నుంచి ఎలాంటి మేలూ జరగదు. నా జీవితం వేదనామయం. నేనేమీ చేయలేననే మాటనే నిరంతరం జపిస్తుంటే ఎందుకు పనికిరాని వారుగానే మిగులుతారు. నేను దేనినైనా సాధిస్తాను అని భావిస్తే అలానే సాధించగలుగుతారు. మనసును సంసిద్ధం చేయవలసిన పద్ధతి ఇదే.

ఉన్నతమైన జీవితం గడపాలంటే శరీరాన్ని, ఇంద్రియాలను, మనసును తదనుగుణంగా మలచుకోవలసి ఉంటుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న బాబు

- 843వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: తాను అధికారంలో ఉండగా అవినీతి అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిని కప్పిపుచ్చుకునేందుకు వ్యవస్థలను సైతం మేనేజ్ చేసేందుకు వెనుకంజ వేయడం లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో 843వ రోజు బుధవారం పలువురు మాట్లాడారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని బాబు చేస్తున్న గారడీని ప్రజలు గమనిస్తున్నారని, తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కోర్టుల్లో తప్పుడు కేసులు వేయిస్తున్నాడన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న రాజ్యాధికారం సాధించే దిశగా బహుజనులు 843 రోజులుగా హక్కుల కోసం పోరాటం చేస్తుంటే.. కనీసం తొంగి చూడకుండా అమరావతి కావాలంటూ కులవాదులను అడ్డుపెట్టుకుని బాబు రాష్ట్రమంతా ప్రదర్శనలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. అమరావతి పేరుతో ప్యాకేజీలు తీసుకుని వత్తాసు పలుకుతున్న పార్టీలను బంగాళాఖాతంలో కలిపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. అమరావతి పేరుతో బాబు 29 గ్రామాల్లో చేసింది శూన్యమని, కులవాదులకు దోచిపెట్టింది మాత్రం ఘనమనేది జగమెరిగిన బహిరంగ సత్యమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

నిజాం కాలం నాటి బస్సు 'డెక్కన్ క్వీన్'

- విజయవాడ సిటీ బస్టాండ్‌లో ప్రజల సందర్శనార్థం ఏర్పాటు



సాక్షి, అమరావతి: విభజన సమయంలో రాష్ట్రానికి వాటాగా వచ్చిన నిజాం కాలం నాటి తొలి తరం అల్బియాన్(డెక్కన్ క్వీన్) పాసింజర్ బస్సును ప్రజల సందర్శనార్థం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సిటీ బస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. నిజాం స్టేట్ రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థకు చెందిన రెండు బస్సుల్లో ఒకటి హైదరాబాద్‌లోని ఆర్టీసీ ప్రధాన కేంద్రంలో, మరొకటి ఇక్కడ ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం నిజాం యువరాణి జహీరా బేగం ఈ బస్సును తన సొంత నిధులతో కొనుగోలు చేశారని తెలిపారు. అందుకే ఆమె పేరులోని తొలి ఇంగ్లిష్ అక్షరం 'జెడ్'ను ఆర్టీసీ బస్సుల రిజిస్ట్రేషన్ నంబరులో పొందుపరిచారని వివరించారు. తొలితరం బస్సును సందర్శించడం మంచి అనుభూతినిస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న చెప్పారు.

'అనంత' సర్వజనాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- 'తంగారి విధానం' ద్వారా మోచేతికి శస్త్ర చికిత్స
- దక్షిణ భారతదేశంలోనే ప్రథమం


రంజిత్ నాయక్‌కు ఆపరేషన్ చేసిన దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్ : అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్థో విభాగం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా 'తంగారి విధానం' ద్వారా క్షతగాత్రుడికి మోచేతి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఆత్మారాం బుధవారం మీడియాకు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గుంటిపల్లి తండాకు చెందిన రంజిత్‌నాయక్ గత గురువారం బైక్‌పై నుంచి కింద పడటంతో చేతికి తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్పారు. డాక్టర్లు పరీక్షించి రంజిత్‌నాయక్ మోచేతి ఎముకలు మొత్తం విడిపోయినట్లు(బ్యాగ్ ఆఫ్ బోన్స్) గుర్తించారు. ఇటలీకి చెందిన మారియో తంగారి అనే వైద్య శాస్త్రజ్ఞుడు కనిపెట్టిన 'తంగారి సిస్టం' అనే నూతన విధానం ద్వారా సుమారు రూ.70 వేల విలువైన ఆపరేషన్‌ను సోమవారం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశారు. డాక్టర్ ఆత్మారాం నేతృత్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌస్, పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ హరి, ఉదయ్ బృందం విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసింది. రోగి ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు. ఇదిలా ఉండగా, పీజీ విద్యార్థులు డాక్టర్ ఓవైస్, డాక్టర్ ఉదయ్‌లు తంగారి విధానంపై చేసిన ప్రయోగాలకు సంబంధించిన థీసిస్‌ను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి పంపగా, ఆమోదం లభించినట్లు డాక్టర్ ఆత్మారాం వెల్లడించారు.

తెలంగాణ

వార్ రూమ్ కేసులో ప్రధాన నిందితుడిగా మల్లు రవి

ఆయన వాంగ్మూలం నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్ కేసులో ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి ప్రధాన నిందితుడిగా మారనున్నారు. ఇప్పటివరకు జరిగిన విచారణ, నిందితుల విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అభియోగపత్రాలు దాఖలు చేసే సమయంలో ఇదే అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లనున్నారు. మరోపక్క ఈ కేసులో నోటీసులు అందుకున్న మల్లు రవి బుధవారం విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మల్లు రవిని రెండు గంటలపాటు విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని స్పష్టం చేసి పంపారు. వార్‌రూమ్ ఎపిసోడ్ మొదలైన నాటి నుంచి మల్లు రవి తెరపైకి వస్తున్నారు. వార్‌రూమ్‌పై దాడి, సోదాలు జరిగిన సమయంలోనూ అక్కడే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలుకు సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు జారీ చేసినప్పుడూ రవి స్పందించారు. వార్‌రూమ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న తన నుంచి ముందు వాంగ్మూలం నమోదు చేయమంటూ పోలీసులకు లేఖ రాశారు. సునీల్ కనుగోలు విచారణ తర్వాత కేసులో మల్లు రవిని నిందితుడిగా చేర్చిన అధికారులు, ఈ నెల 12న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత వస్తానంటూ సమయం కోరిన మల్లు రవి బుధవారం విచారణకు హాజరయ్యారు. తానే వార్‌రూమ్ ఇన్‌చార్జ్ అంటూ అంగీకరించిన ఆయన, అక్కడి వాళ్లు పోస్టు చేసే ప్రతి అంశంతోనూ తనకు సంబంధం ఉండదని పేర్కొన్నారని తెలిసింది. తాము కేవలం కాన్సెప్ట్ మాత్రమే చెప్తామని, అక్కడి వాళ్లు దానికి అనుగుణంగా వీడియోలు, మీమ్స్ తయారుచేసి పోస్టు చేస్తారని వివరణ ఇచ్చారని సమాచారం.

శ్రీహరికోటలో మరో ఆత్మహత్య!

వికాస్‌సింగ్ మృతిని జీర్ణించుకోలేక భార్య బలవన్మరణం

- గడిచిన మూడు రోజుల్లో మూడు ఆత్మహత్యలు
- వ్యక్తిగత కారణాలతోనే బలవన్మరణాలు
- ప్రశాంతంగా ఉండే షార్ కేంద్రంలో విషాదఛాయలు


తమ ముగ్గురు పిల్లలతో మృతులు వికాస్‌సింగ్-ప్రియాసింగ్ (ఫైల్)

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో గడిచిన రెండు రోజులుగా రెండు మరణాల తర్వాత మళ్లీ సీఐఎస్ఎఫ్ ఎస్ఐ వికాస్‌సింగ్ భార్య ప్రియాసింగ్(29) మంగళవారం రాత్రి నర్మద గెస్ట్‌హౌస్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. షార్ కేంద్రానికి భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బందే ఆత్మహత్యలు చేసుకుని మరణించడం గమనార్హం. ఆదివారం రాత్రి చింతామణి అనే సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ షార్ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగి 24 గంటలు గడవకముందే సోమవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్‌సింగ్ అనే సీఐఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ తన సర్వీస్ రివాల్వర్‌తో షార్ మొదటిగేట్‌కు సమీపంలో మిద్దెపైన పాయింట్ బ్లాంక్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న ప్రియాసింగ్ మంగళవారం ఉత్తరప్రదేశ్ నుంచి తన అన్నను తీసుకుని సూళ్లూరుపేటకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం తన భర్త మృతదేహాన్ని చూశారు. షార్ కేంద్రం వారు ఆమెకు నర్మద గెస్ట్‌హౌస్‌లో రూమ్ కేటాయించారు. రూమ్‌లోకి వెళ్లాక ప్రియాసింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. వికాస్‌సింగ్, ప్రియాసింగ్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీహరికోట ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. ప్రశాంతంగా ఉండే షార్ కేంద్రంలో వరుస మరణాలతో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తిగత కారణాలే..

ఒక దశలో సెలవులు ఇవ్వలేదనే కారణాలతో ఆత్మహత్యలు జరిగాయని ప్రచారం జరిగింది. వారి వ్యక్తిగత కారణాల వల్లే ఈ ముగ్గురు మృతి చెందారని పోలీసుల దర్యాప్తులో తేలింది. షార్‌లోని అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన చింతామణి(29)కి తల్లిదండ్రుల్లేరు. ఇక్కడే బ్యారక్‌లో ఉంటున్నాడు. అయితే అన్నయ్య ఉన్నాడని, ఇతనికి పెళ్లి కాకపోవడంతో తన అన్నయ్య పెళ్లి కుదిర్చారు. ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని, అన్నయ్యను ఎదిరించడం ఇష్టం లేక బలవన్మరణం చెందారని తెలిసింది. అలాగే 2015 బ్యాచ్‌కు చెందిన వికాస్‌సింగ్ ముంబైలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తూ రెండు నెలల కిందటే షార్‌కు బదిలీపై వచ్చారు. ముంబబైలో పనిచేసే సమయంలో ఉద్యోగపరంగా క్రమశిక్షణరాహిత్య చర్యకు గురై విచారణను ఎదుర్కొంటున్నారు. భార్యా పిల్లలకు దూరంగా ఉండడం, అప్పులు ఎక్కువ కావడం వల్ల గత పది రోజులుగా మానసిక ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోగా, భర్త మరణాన్ని జీర్ణించుకోలేకే ప్రియాసింగ్ ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నారు. వికాస్‌సింగ్, ప్రియాసింగ్ దంపతులకు ముగ్గురు పిల్లలు. కుమారుడు ఒకటో తరగతి, కుమార్తె ఎల్‌కేజీ, మరో కుమార్తె చిన్న పాప కావడం విశేషం. వీరిలో ఒక కుమార్తె దివ్యాంగురాలు.

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

ఏయూక్యాంపస్: మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం సాధ్యమవుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు చెప్పారు. విశాఖలోని ఏయూ న్యాయకళాశాల సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా ఆయన మ్యూజింగ్స్ ఆఫ్ మీడియేషన్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ఈ ప్రక్రియలో ఎవరికీ లాభనష్టాలు ఉండవని, రెండుపార్టీల మధ్య సత్సంబంధాలను పునరుద్ధరించడానికి ఇది ఉపకరిస్తుందని చెప్పారు. మధ్యవర్తిత్వం ఎంతో సంక్లిష్టమైనదని, దీనికి ప్రత్యేక నైపుణ్యాలు, శిక్షణ అవసరమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం మన దేశానికి కొత్తకాదని, రాజుల కాలం నుంచి అమలులో ఉందని తెలిపారు. బ్రిటిష్ కాలంలో గ్రామపెద్దలు ఈ బాధ్యతను నిర్వర్తించేవారన్నారు. నేడు దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఐదుకోట్ల వ్యాజ్యాలు ఉన్నాయని, వీటిని పరిష్కరించడానికి తగినంత మంది న్యాయమూర్తులు లేరని చెప్పారు. వివాదాల కారణంగా సమాజంలో సామాజిక సామరస్యం దెబ్బతింటోందన్నారు. మధ్యవర్తిత్వంపై అవగాహన, తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. బంధువుల మధ్య ఆస్తి వివాదాలు, పంపకాలు సంక్లిష్టమైన అంశాలన్నారు. సహనం కోల్పోయిన సందర్భాల్లో పిల్లల నిర్ణయాలకు తల్లిదండ్రులు కొంత తోడ్పాటు ఇవ్వడంతో కొన్ని సందర్భాల్లో వివాహబంధాలు విచ్ఛిన్నం అవుతున్నాయని చెప్పారు. దేశంలో 20 లక్షలమందికిపైగా న్యాయవాదులున్నారని, ఏటా రెండులక్షలమంది న్యాయవాద వృత్తిలోకి వస్తున్నారని తెలిపారు. న్యాయ విద్యార్థులు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న మధ్యవర్తిత్వంపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, న్యాయకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి ప్రసంగించారు. వర్సిటీ తరఫున జస్టిస్ లావు నాగేశ్వరరావును సత్కరించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, న్యాయకళాశాల ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'టిప్పర్' మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

- సీఎం హామీ మేరకు రూ.5లక్షల చొప్పున చెక్కుల పంపిణీ


ధర్మాపురంలో ఓబులేసు కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: వైఎస్సార్ జిల్లాలో ఈ నెల 12వ తేదీ జరిగిన టిప్పర్ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు బాధితుల కుటుంబ సభ్యులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అందించారు. ధర్మాపురం సమీపంలో పొలం పనుల కోసం వెళ్లి అన్నం తింటున్నవారిపై టిప్పర్ దూసుకెళ్లి ధర్మాపురానికి చెందిన తలారి ఓబులేసు, గౌరిగెనూరుకు చెందిన ఎనమల నాగ సుబ్బారెడ్డి.. ఉప్పలపాడుకు చెందిన టిప్పర్ డ్రైవర్ విజయ్‌కుమార్ మరణించిన విషయం విదితమే. బుధవారం ఎమ్మెల్యే ఆయా గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం తరఫున రూ.5లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రమాదం జరిగిన వెంటనే ఆర్థికసహాయం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేశారన్నారు. తాను కూడా పార్టీ తరఫున తక్షణ సాయంగా రూ.లక్ష రూపాయల చొప్పున ప్రమాదం జరిగిన వెంటనే ఇచ్చినట్లు వివరించారు.

అశ్వవాహనంపై మల్లేశ్వరుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం స్వామి వార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. శ్రీశైలంలో ఈ నెల 19న మొదలైన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 74,236 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 27,269 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.19 కోట్లు వేశారు. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేనివారికి 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి రెండు గంటల్లో దర్శనం లభిస్తోంది.

విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని విజయవాడ-విశాఖపట్నం సెక్షన్‌ల మధ్య నెలకొన్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కొన్ని రైళ్లను పూర్తిగా, మరి కొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో కాకినాడ టౌన్-విశాఖపట్నం (17267), విశాఖపట్నం-కాకినాడ టౌన్ (17268) రైళ్లను పూర్తిగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 21, 22 తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం (17239) రైలును సామర్లకోట-విశాఖపట్నం మధ్య, ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం-గుంటూరు (17240) రైలును విశాఖపట్నం-సామర్లకోట మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం (12718)ను తుని-విశాఖపట్నం మధ్య, విశాఖపట్నం-విజయవాడ (12717) రైలును విశాఖపట్నం-తుని మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి సాగుతో రైతుకు నిరంతర ఆదాయం

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్


మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): ఒకే పంట విధానాన్ని పక్కన పెట్టి.. రైతులు ప్రకృతి సాగు విధానంలో వివిధ రకాల పంటలు పండిస్తే నిరంతరం ఆదాయం పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ చెప్పారు. బుధవారం గుంటూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 2023లో తొలకరి చినుకులకు ముందే విత్తనాలు నాటాలని సూచించారు. విత్తన దశ నుంచి విత్తిన దశ వరకు పూర్తిగా ప్రకృతి సాగుకు అవసరమయ్యే కిట్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రామారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలో 10.5 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అందుకే దేశంలోనే ఏపీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుకు మంచి పేరు వచ్చిందని చెప్పారు. సమావేశంలో రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ మురళీధర్, ప్రాంతీయ కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, వెంకట్రావు, కృష్ణారావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వకుళమాత ఆలయంలో చోరీకి యత్నం

- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది
- సొత్తును వదిలి పారిపోయిన దొంగలు


సీసీ కెమెరాల్లో నమోదయిన దొంగ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో ఉన్న టీటీడీ ఆధ్వర్యంలోని వకుళమాత ఆలయంలో భద్రతా లోపాలు బయటపడ్డాయి. మంగళవారం అర్ధరాత్రి 12.05 గంటలకు ఆలయంలోకి ఇద్దరు దొంగలు ప్రవేశించారు. రాడ్‌తో హుండీని పగులగొట్టి.. కానుకలను మూటగట్టుకున్నారు. భద్రతా సిబ్బంది అప్రమత్తం కావడంతో కాజేసిన కానుకలతో ఉన్న మూటను, హుండీని పగులకొట్టేందుకు ఉపయోగించిన రాడ్‌ను అక్కడే వదిలి దొంగలు పారిపోయారు. ఆలయంలో దొంగల వేలిముద్రలు, ఆధారాలను సేకరించేందుకు నిపుణులను పిలిపించారు. క్రైం ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో డీఎస్పీ సురేష్, ఎంఆర్‌పల్లి సీఐ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు దొంగల కోసం గాలిస్తున్నాయి. కాగా, ఆలయంలో భద్రతా లోపం వల్లే దొంగతనానికి తెగబడినట్లు అధికారులు గుర్తించారు. ఆలయానికి వెనుకవైపు ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడం ఈ దుర్ఘటనకు కారణమని తెలుస్తోంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సూచనతో బుధవారం సాయంత్రం టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించారు.

రూ.148.95 కోట్లతో రాజుపాలెం-అమరావతి రోడ్డు విస్తరణ

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాలోని రాజుపాలెం నుంచి అమరావతి వరకు రోడ్డును రూ.148.95 కోట్లతో విస్తరించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాబార్డు నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తారు. ఇందు కోసం రూ.148.95 కోట్లు కేటాయిస్తూ ఆర్అండ్‌బీ శాఖ బుధవారం పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ

పరువు హత్య కేసు కొట్టివేత

- తీర్పు వెలువరించిన భువనగిరి సెషన్స్ కోర్టు
- సరైన సాక్ష్యాధారాలు లేవన్న న్యాయమూర్తి
- 2017లో నరేశ్, స్వాతి హత్యకు గురైనట్లు ఆరోపణలు

ఆత్మకూరు(ఎం): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల పరువు హత్య కేసును యాదాద్రి భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టు కొట్టివేసింది. సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ బుధవారం తుది తీర్పు వెలువరించింది. కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన అంబోజు నరేశ్ ఇదే మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన స్వాతి 2017 మార్చి 25న ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం ముంబైకి వెళ్లిపోయారు. మొదట వీరి వివాహాన్ని స్వాతి తండ్రి శ్రీనివాసరెడ్డి వ్యతిరేకించారు. అయితే తర్వాత ప్రేమ వివాహాన్ని అంగీకరిస్తానని చెప్పి ఇరువురిని స్వగ్రామానికి రప్పించారు. 2017 మే 1న దంపతులు స్వగ్రామానికి వచ్చారు. అయితే అదేరోజు నరేశ్ అదృశ్యమయ్యాడు. మే16న స్వాతి ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతిచెందింది. నరేశ్ కనిపించకపోవడంతో అతడి తల్లిదండ్రులు భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, అదృశ్యమైన నరేశ్ శ్రీనివాసరెడ్డి వ్యవసాయ బావి వద్ద హత్యకు గురయ్యాడని, ఆపై అతడి మృతదేహాన్ని దగ్ధంచేసి ఎముకలను సమీపంలోని మూసీలో కలిపినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. స్వాతి, నరేశ్ పరువు హత్య కేసుపై ఆధారాలు సేకరించిన పోలీసులు శ్రీనివాస్‌రెడ్డిని ఏ-1, ఆయన బంధువు నల్ల సత్తిరెడ్డిని ఏ-2గా చేరుస్తూ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఐదేళ్ల ఎనిమిది నెలలపాటు సాగిన కేసులో కోర్టు 33 మంది సాక్షులను విచారించింది. కేసుపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదనలు ఈ నెల 9వ తేదీన పూర్తి కాగా, కేసును కొట్టివేస్తూ కోర్టు బుధవారం తుది తీర్పు వెలువరించింది. తీర్పుపై స్పందిస్తూ న్యాయం గెలిచిందని స్వాతి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నరేశ్ తండ్రి అంబోజు వెంకటయ్య మాట్లాడుతూ.. న్యాయం కోసం హైకోర్టుకు వెళ్తానన్నారు.

సగం కాలిన కాలే క్లూ

- కారులో వ్యక్తి దహనం కేసును వారంలోనే ఛేదించిన పోలీసులు
- ధర్మానాయక్ సహా కుటుంబ సభ్యులంతా నిందితులే
- మీడియాకు వివరాలు వెల్లడించిన మెదక్ జిల్లా ఎస్పీ

మెదక్ జోన్/మెదక్ మున్సిపాలిటీ/ఖలీల్‌వాడి(నిజామాబాద్): సంచలనం సృష్టించిన కారుతో సహా వ్యక్తి దహనం కేసులో పోలీసులకు లభించిన సగం కాలిన కాలే 'క్లూ'గా పనికొచ్చింది. ప్రధాన నిందితుడైన ధర్మానాయక్ సహా ఇతర నిందితులను పట్టించింది. మెదక్ జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని వెల్లడించిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ పరిధిలోని బీమ్లా తండాకు చెందిన ధర్మానాయక్ హైదరాబాద్‌లోని సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బెట్టింగ్‌ల కోసం దాదాపు రూ.85 లక్షల వరకు అప్పులు చేసిన ధర్మ... వాటి నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యులతో చర్చించాడు. తన పేరిట భారీ మొత్తానికి బీమా చేయించి ఆపై తనలాంటి వ్యక్తిని చంపి బీమా సొమ్ము కొట్టేయాలని స్కెచ్ వేశాడు. ఇందుకోసం రూ.7.4 కోట్లు వచ్చేలా 25 ఎల్ఐసీ పాలసీలను తీసుకొని ప్రీమియం చెల్లించాడు. తనలాంటి వ్యక్తి కోసం గతేడాది నవంబర్ నుంచి నాంపల్లి మెట్రో రైల్వేస్టేషన్ పరిసరాల్లో వెతకడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో తనంత ఎత్తున్న అంజయ్య అనే కూలీని పరిచయం చేసుకున్నాడు. నిజామాబాద్‌లో తనకున్న మామిడి తోటలో పనిచేస్తే నెలకు రూ.15–20 వేలు ఇస్తానని నమ్మబలికాడు.

హత్య కోసమే కారు కొనుగోలు...

గతేడాది డిసెంబర్‌లో హోండా అమేజ్ కారు కొనుగోలు చేసిన ధర్మానాయక్... అంజయ్యను కారులో చంపి తానే చనిపోయినట్లు అందరినీ నమ్మించాలనుకున్నాడు. డిసెంబర్ 6న ధర్మ తన భార్య నీల, పిల్లలను తండాలో వదిలి అక్క కొడుకైన శ్రీనివాస్‌తోపాటు అంజయ్యను తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ముగ్గురూ మద్యం సేవించారు. మద్యం తాగిన వ్యక్తి ప్రమాదంలో చనిపోతే బీమా రాదన్న ఉద్దేశంతో అంజయ్యను ఆ రోజు రాత్రి చంపకుండా వదిలేశారు. ఆ మర్నాడు చంపాలనుకోగా అంజయ్య తప్పించుకొని పారిపోయాడు. అంజయ్య స్థానంలో మరొకరిని ఉంచి తన ప్లాన్ అమలు చేసేందుకు నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్ సమీపంలో అడ్డా కూలీ బాబును ధర్మానాయక్ ఎంచుకున్నాడు. తోటలో పనిచేయాలంటూ నమ్మించి శ్రీనివాస్‌తో కలిసి బాబును బాసరకు తీసుకెళ్లాడు. అక్కడ బాబుకు గుండు గీయించి తన దుస్తులు వేయించాడు. ఈ నెల 8న రాత్రి బాసర నుంచి బయలుదేరి వెంకటాపూర్ చెరువుకట్ట వద్ద కారు నిలిపాడు. బాబుకు కల్లు తాగించి డ్రైవింగ్ సీట్లు కూర్చోమని అడగ్గా అందుకు అతను నిరాకరించడంతో గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం ధర్మ, శ్రీనివాస్‌లు వారి వెంట తెచ్చిన పెట్రోల్‌ను బాబుతోపాటు కారుపై పోసి తగలబెట్టారు. అనంతరం పాపన్నపేట వరకు కాలినడకన వెళ్లి ఆపై ఓ లారీ ఎక్కి పారిపోయారు.

ధర్మానాయక్ కాదన్న అనుమానంతో...

ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులకు చనిపోయింది ధర్మానాయక్ కాదన్న అనుమానం వచ్చింది. ఆఫీసులో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి అరికాలు సాధారణంగా పగుళ్లేవీ లేకుండా నున్నగా ఉంటుందని, కానీ సగం కాలిన కాలు మాత్రం అడ్డా మీద పనిచేసే కూలీకి చెందినదిగా ఉందని భావించి ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. అలాగే ధర్మానాయక్ కుటుంబ సభ్యులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే నిజామాబాద్‌లోని ఓ లాడ్జిలో ధర్మానాయక్ ఉన్నట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి ఈ నెల 17న అదుపులోకి తీసుకున్నారు. అతన్ని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు. బాబును చంపిన కేసులో ధర్మానాయక్ కుటుంబ సభ్యులంతా నిందితులేనని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఈ కేసులో ఏ1గా ధర్మానాయక్, ఏ2గా అతని మేనల్లుడు శ్రీనివాస్, ఏ3గా ధర్మ భార్య నీల, ఏ4గా ధర్మ సోదరి సుంద, ఏ5గా (మైనర్) చేర్చినట్లు చెప్పారు. కాగా, చనిపోయిన నిజామాబాద్‌కు చెందిన బాబు ఎవరన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే మొదటగా తప్పించుకొని పారిపోయిన అంజయ్య వివరాలను కూడా ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా...

అసెంబ్లీలో లంచం డబ్బు

కట్టలను సభలో ప్రదర్శించిన ఆప్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: ఒక కాంట్రాక్టర్ లంచం ఆశజూపి తన నోరు మూయించజూశారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే మొహీందర్ గోయల్ ఆరోపించారు. ఆ డబ్బు ఇదేనంటూ బుధవారం ఢిల్లీ అసెంబ్లీలో కరెన్సీ కట్టలను చూపించారు. ''ఓ ప్రభుత్వాస్పత్రికి సంబంధించి కొత్త కాంట్రాక్టర్ వచ్చాక 80 శాతం పాత కాంట్రాక్ట్ సిబ్బందిని తీసేసి లంచాలు తీసుకుని కొత్తవారిని నియమిస్తున్నాడు. దీనిపై నోరు మెదపకుండా ఉండేందుకు నాకు లంచం ఇవ్వబోయాడు. ఇది 2022 ఫిబ్రవరిలో జరిగింది. వెంటనే ఢిల్లీ పోలీసులకు, ఏసీబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు'' అని ఆరోపించారు. ''నాకు వారి నుంచి ప్రాణ హాని ఉంది. కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్‌చేశారు. ఇది ఉన్నతస్థాయి కుట్ర అని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తీవ్రమైన అంశమని స్పీకర్ రాంనివాస్ అన్నారు. ఇది నిజమే అయితే లంచమిచ్చేటపుడే రెడ్ హ్యాండెడ్‌గా ఎందుకు పట్టుకోలేదని బీజేపీ సభ్యులు ప్రశ్నించారు.

హిమాచల్‌లోకి జోడో యాత్ర

సిమ్లా: షెడ్యూల్లో లేనప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర బుధవారం హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించింది. కాంగ్రా వద్ద సీఎం సుఖ్వీందర్ సుఖు తదితరులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. మానవత్వం, శక్తిసామర్థ్యాల్లో హిమాచల్‌వాసులు పర్వతసమానులని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. రాష్ట్రంలో 18 కిలోమీటర్ల కొనసాగిన అనంతరం యాత్ర మళ్లీ పంజాబ్‌లోకి ప్రవేశించింది.

బీజేపీలోకి మన్‌ప్రీత్ బాదల్

న్యూఢిల్లీ: పంజాబ్‌లో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, పంజాబ్ మాజీ రాష్ట్ర ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ బుధవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 'అంతర్గత కుమ్ములాటలు, ఫ్యాక్షనిజంతో నిండిన కాంగ్రెస్‌లో ఉండలేను. మోదీ సర్కార్ హయాంలో దేశం ప్రపంచంలో దౌత్యపరంగా, ఆర్థికంగా ఎంతో పురోగమించింది' అని బీజేపీలో చేరాక బాదల్ వ్యాఖ్యానించారు. తన రాజీనామా లేఖను రాహుల్ గాంధీకి పంపించారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్ తమ్ముడి కుమారుడైన మన్‌ప్రీత్ బాదల్ తన పీపుల్స్ పార్టీ ఆఫ్ పంజాబ్‌ను కాంగ్రెస్‌లో కలిపేస్తూ ఏడేళ్ల క్రితం ఆ పార్టీలో చేరారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆయన పార్టీని వీడటంపై కాంగ్రెస్ స్పందించింది. 'పార్టీపై కమ్మిన మేఘాలు(బాదల్) తొలగిపోయాయి' అంటూ వ్యాఖ్యానించింది. అధికార దాహంతోనే ఆయన బీజేపీలో చేరారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.



జనాభాలో చైనాను దాటేశాం

డిసెంబర్ 31 నాటికే మన జనాభా 141.7 కోట్లు

చైనా జనాభా 141.2 కోట్లు: డబ్ల్యూపీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: మరో మూడు నెలల తర్వాత జరుగుతుందనుకున్నది కొన్నాళ్ల క్రితమే జరిగిపోయిందా? జనాభాలో మనం చైనాను దాటేశామా? ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువ జనాభా ఉన్న దేశంగా అవతరించామా!! అవుననే అంటోంది వరల్డ్ పాపులేషన్ రివ్యూ (డబ్ల్యూపీఆర్) నివేదిక. గతేడాది చివరి నాటికే భారత జనాభా చైనా కంటే కనీసం 50 లక్షలు ఎక్కువని చెబుతోంది. 2022 డిసెంబర్ 31 నాటికి తమ జనాభా 141.2 కోట్లని చైనా మంగళవారం అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. అదే రోజున భారత్ జనాభా 141.7 కోట్లకు చేరిందని డబ్ల్యూపీఆర్ అంచనా వేసింది. తాజాగా బుధవారం నాటికి 142.3 కోట్లకు ఎగబాకిందని చెప్పుకొచ్చింది. మాక్రోట్రెండ్స్ అనే మరో సంస్థ అంచనాల ప్రకారం బుధవారం నాటికి భారత జనాభా 142.8 కోట్లు. మన జనాభాలో 50 శాతానికి పైగా 30 ఏళ్లలోపు వయసువారే. కనుక దేశ జనాభా పెరుగుదల 2050 దాకా కొనసాగుతూనే ఉంటుందని భావిస్తున్నారు. 1961 తర్వాత తొలిసారిగా 2022లో తమ జనాభాలో తొలిసారిగా 8.5 లక్షల మేరకు తగ్గుదల నమోదైనట్టు చైనా మంగళవారం ప్రకటించడం తెలిసిందే. ఈ ధోరణి ఇలాగే కొనసాగి 2050 కల్లా ఆ దేశ జనాభా 131 కోట్లకు పరిమితం అవుతుందని అంచనా. ఆ సమయానికి భారత జనాభా 166 కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నారు. పదేళ్లకోసారి జరిగే ఆనవాయితీ మేరకు మన దేశంలో 2020లో జరగాల్సిన జనాభా గణన కరోనా కారణంగా వాయిదా పడటం తెలిసిందే. దాంతో మన జనాభాపై అధికారికంగా తాజా గణాంకాలు అందుబాటులో లేవు.

పతనం అంచున పాక్

ప్రపంచదేశాల ముందు చేయి చాస్తున్న వైనం

- ఆర్థిక సాయం కోసం వివిధ దేశాలు, ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు
- 3,300 కోట్ల డాలర్ల రుణం లభిస్తే సంక్షోభం నుంచి బయటపడే ఛాన్స్
- భారత్‌తోనూ స్నేహసంబంధాల కోసం తహతహలాడుతున్న పాక్ ప్రధాని షరీఫ్



"భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. సాధించింది ఏమీ లేదు. దేశంలో మరింత విధ్వంసం జరిగింది. నిరుద్యోగం పేదరికం మీద పడ్డాయి. యుద్ధానికి కారణమైన కశ్మీర్ వంటి అంశాలపై భారత్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నాం"

"అణ్వాయుధాలు కలిగిన మన దేశం అన్నవస్త్రాల కోసం ప్రపంచ దేశాల ముందు దేహి అంటూ చేయి చాపడం నిజంగా సిగ్గు చేటు. అంతర్జాతీయ సంస్థల్ని రుణాలు అడగాలన్నా ఇబ్బందిగా అనిపిస్తోంది. ఇలా ప్రపంచ దేశాలను భిక్షమడిగి దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించడం పరిష్కారం కాదు"

ఈ వ్యాఖ్యలు చేసినది ఎవరో కాదు. సాక్షాత్తూ పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్. రోజు రోజుకీ దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారి పోతూ ఉండడంతో మరో దారి లేక షరీఫ్ శాంతి మంత్రం జపిస్తున్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకుంటే ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కుతామన్న భావనలో పాక్ సర్కార్ ఉంది.

గోధుమల లారీని వెంబడించి..!

పాకిస్తాన్‌లో ప్రధాన ఆహారమైన గోధుమ పిండికి విపరీతమైన కొరత ఏర్పడింది. నిరుపేదలు గోధుమ పిండి కొనుక్కోవడానికి గంటల తరబడి దుకాణాల దగ్గర క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కరాచీలో ఒక గోధుమ పిండి లారీ వెళుతూ ఉంటే దాని వెనక ప్రజలు పరుగులు తీసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ ఒక్క వీడియో చాలు పాక్‌లో ఆహార సంక్షోభం ఏ స్థాయికి చేరుకుంటోందో చెప్పడానికి. బియ్యం, గోధుమలు, కూరగాయలు డిమాండ్‌కు తగ్గ సప్లయి కావడం లేదు. ఇరుగు పొరుగు దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలంటే డాలర్ నిల్వలు తరిగిపోతున్నాయి. కరాచీలో కేజీ గోధుమ పిండి రూ.160 ధర పలుకుతూ ఉండడంతో ప్రజలు కడుపు నింపుకోవడమెలాగ అని ఆందోళన చెందుతున్నారు. కొన్ని రెస్టారెంట్లలో ఒక భోజనం ఖరీదు ఏకంగా రూ.800కి చేరుకుంది. విద్యుత్ సంక్షోభంతో మార్కెట్లను, రెస్టారెంట్లను రాత్రి 8 గంటలకే మూసేస్తూ ఉండడంతో జనం కూడా చేసేదేమి లేక త్వరగా నిద్రపోతున్నారు. దీంతో పాక్‌లో చీకటి పడగానే విద్యుత్ వెలుగులు లేకకారు చీకట్లోకి దేశం వెళ్లిపోతోంది. పెట్రోల్ ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. లీటర్ పెట్రోల్ రూ.200కి పైనే ఉండడంతో సామాన్యులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. మరోవైపు ప్రాణావసరమైన మందులకి కూడా కొరత ఏర్పడడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కరాచీలో ఇన్సులిన్ లభించకపోవడంతో మధుమేహ రోగులు నానా తంటాలు పడుతున్నారు. ఇక సైనికులకి రెండు పూటలా తిండి పెట్టే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. దేశంలో టాప్‌లో ఉన్న 8 తయారీ సంస్థలు ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లేక మూతపడ్డాయి. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడానికి వివిధ దేశాల్లో రాయబార కార్యాలయాలను కూడా పాక్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంతో ఆర్థిక సంక్షోభం పరాకాష్టకు చేరుకున్నట్టయింది.

- పాకిస్తాన్ సెంట్రల్ బ్యాంకులో నిల్వలు నిండుకుంటున్నాయి. స్టేట్ బ్యాంకులో 420 కోట్ల డాలర్లే ఉన్నాయి. ఇవి 25 రోజుల దిగుమతి అవసరాలకు మాత్రమే సరిపోతాయి.
- విదేశీ మారక నిల్వలు 2022 జనవరిలో 1660 కోట్లు ఉంటే ఈ ఏడాది జనవరి నాటికి కాస్త 560 కోట్ల డాలర్లకి పడిపోయాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం జనవరి –మార్చి మధ్య పాకిస్తాన్ 830 కోట్ల డాలర్ల విదేశీ అప్పులు తీర్చవలసి ఉంది.
- 2022–23లో జీడీపీలో 2.8% ఉన్న రక్షణ బడ్జెట్‌ను 2.2శాతానికి తగ్గించారు.
- 2022 ఆకస్మిక వరదలు 3.8 కోట్ల మందిని ప్రభావితం చేశాయి. దేశం విలవిలలాడింది.
- స్టేట్ బ్యాంకు ఆఫ్ పాకిస్తాన్ లెటర్ ఆఫ్ క్రెడిట్స్ ఇవ్వడానికి కూడా ఇష్టపడడం లేదు.
- వాణిజ్య లోటు ఒక్కసారిగా 57% పెరిగిపోయింది. అత్యవసర జాబితాలో లేని లగ్జరీ వస్తువులు 800కి పైగా రకాల వస్తువుల దిగుమతులపై నిషేధం విధించినప్పటికీ వాణిజ్య లోటు పెరిగిపోతూనే ఉంది. ప్రస్తుతం పాక్ వాణిజ్య లోటు 4.866 కోట్ల డాలర్లుగా ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారతే దిక్కా ..?

పాకిస్తాన్‌కు అండదండ అందించే చైనా ఈసారి ఆ దేశాన్ని గట్టెక్కించే పరిస్థితులు కనిపించడం లేదు. పాకిస్తాన్ ప్రాంతంలో చైనా చేపట్టిన చైనా పాకిస్తాన్ ఎకానమిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుకు సంబంధించిన భద్రతాపరమైన ముప్పు కనిపిస్తోంది. ఇప్పటికే ఆ ప్రాజెక్టు కోసం వందల కోట్ల డాలర్లను వెచ్చించిన చైనా ఇంక ఆర్థికంగా ఆదుకుంటుందన్న నమ్మకం లేదు. యూఏఈ, సౌదీ అరేబియాలు ముస్లిం దేశాలు కావడంతో పాక్‌కు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చాయి. యూఏఈ 200 కోట్ల డాలర్ల సాయాన్ని చేయడానికి కూడా అంగీకరించింది. కరోనా విలయం, రష్యా, అమెరికా యుద్ధంతో అన్ని దేశాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ వంటి దేశాలు కూడా సాయం చేసే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే భారత్‌తో బలమైన సంబంధాలు కలిగి ఉంటే ఈ సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చునని పాక్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. మన దేశంతో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరిస్తే నిత్యావసరాలైన బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, మందులు వంటివి తీసుకురావడం అత్యంత సులభంగా మారుతుంది. వాఘా–అట్టారి, ఖోఖర్ పార్–మునాబావో సరిహద్దుల నుంచి నిత్యావసర సామగ్రి తరలించడం సులభతరంగా ఉంటుందని పాక్‌లో ఆర్థిక నిపుణులు ప్రభుత్వానికి హితవు పలుకుతున్నారు.

దక్షిణాసియాలో బలహీనమైన ఆర్థిక వ్యవస్థ

దక్షిణాసియాలో బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం పాకిస్తానేనని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఆ దేశ వృద్ధి రేటు గతంలో వేసిన అంచనాల కంటే 2%' నెమ్మదిస్తుందని తెలిపింది. పాక్ ఆర్థిక వ్యవస్థ కారణంగా దక్షిణాసియా ప్రాంత పురోగతి రేటు కూడా తగ్గిపోతోందని పేర్కొంది. పాకిస్తాన్‌ను గత ఏడాది ముంచెత్తిన వరదలే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషించింది. ఇప్పటికిప్పుడు పాకిస్తాన్‌కు 3,300 కోట్ల డాలర్లు రుణంగా వస్తే తప్ప ఆ దేశం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.


విదేశీ మారకనిల్వలు: 560 కోట్ల డాలర్లు


డాలర్‌తో రూపాయి విలువ రూ.230



పాక్ వాణిజ్య లోటు : 4.866 కోట్ల డాలర్లు


ద్రవ్యోల్బణం రేటు : 19.9%


వరదల నష్టం : 4 వేల కోట్లు


కేజీ గోధుమ పిండి రూ.160

ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలి కన్నుమూత

పారిస్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా గుర్తింపుపొందిన ఫ్రాన్స్ దేశస్తురాలు లూసిలీ ర్యాండమ్(118) తుది శ్వాస విడిచారు. కోవిడ్‌ను జయించిన అత్యంత వృద్ధుల్లో ఒకరిగానూ చరిత్ర సృష్టించిన ఈమెను స్థానికులు సిస్టర్ ఆండ్రీగా పిలుస్తారు. 1904 ఫిబ్రవరి 11న దక్షిణ ఫ్రాన్స్‌లోని ఎలీస్ పట్టణంలో జన్మించిన ఈమె వృత్తిరీత్యా నర్సు. మంగళవారం టౌలూన్ పట్టణంలో ఈమె మరణించారని ఆమె తరఫు ప్రతినిధి వెల్లడించారు. 2021 జనవరిలో ఈమెకు కరోనా సోకింది. అయితే, పెద్దగా అనారోగ్య లక్షణాలేవీ కనిపించకపోవడం విశేషం. కోవిడ్‌ను జయించిన బామ్మగా ప్రాచుర్యం పొందారు. 'కష్టంగా భావించకుండా ఇష్టంగా పనిచేయడమే నా ఆరోగ్య రహస్యం. 108 ఏళ్ల వరకు నా పనులు నేనే చేసుకున్నా. రోజూ ఒక చాక్లెట్ తినడం, ఒక గ్లాస్ వైన్ తాగడం నా అలవాటు' అని ఆండ్రీ గతంలో చెప్పారు. ర్యాండమ్ మృతి తర్వాత స్పెయిన్‌లో నివసిస్తున్న 115 ఏళ్ల అమెరికన్ మరియా బ్రాన్‌యాస్ మొరేరా ప్రపంచంలో అత్యంత వృద్ధ వ్యక్తిగా రికార్డులకెక్కారు.


లూసిలీ ర్యాండమ్


బ్రాన్‌యాస్ మొరేరా

ఆటలపై చిన్న చూపుతో తీరని చేటు: మోదీ

బస్తీ (యూపీ): క్రీడలను అప్రాధాన్య అంశంగా చూడటం వల్ల చాలాకాలం పాటు మన దేశానికి తీరని నష్టం జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ''కొన్ని తరాల పాటు ఆటలను కాలక్షేప సాధనంగా భావించారు. దాంతో అవి అంత ముఖ్యమైనవి కావన్న భావన మనలో వేళ్లూనుకుపోయింది. కొంతకాలంగా ఈ వైఖరి మారుతోంది. క్రీడా రంగంలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు నిరంతర కృషి జరుగుతోంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటుండటం అభినందనీయం'' అన్నారు. యూపీలోని బస్తీలో క్రీడా ప్రాంగణాన్ని ఆయన బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఫిట్‌గా ఉండేందుకు యోగా చేయాలని, చిరు ధాన్యాలను డైట్‌లో భాగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

'వీసా వెయిటింగ్' తగ్గిస్తాం: అమెరికా

వాషింగ్టన్: అమెరికా వీసాల కోసం భారతీయులు వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నామని యూఎస్‌కాన్సులర్ అఫైర్స్ బ్యూరోలో వీసాల జారీ విభాగం ఉన్నతాధికారి జూలీ స్టఫ్ చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కూడా ఈ విషయంలో చొరవ తీసుకుంటున్నారన్నారు. ''గత అక్టోబర్‌లో బిజినెస్(బీ1), పర్యాటక(బీ2) వీసాల వెయిటింగ్ పీరియడ్ మూడేళ్లుంది! వీటిని తగ్గించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. కోవిడ్‌కు ముందునాటి సాధారణ స్థాయికి తేవడంపై దృష్టిసారించాం. హెచ్–1బీ, ఎల్1 వీసాల వెయిటింగ్ పీరియడ్‌ను 18 నెలల నుంచి 60 రోజులకు కుదించగలిగాం'' అని ఆమె చెప్పారు. ''ఇంటర్వ్యూతో పనిలేని సందర్భాల్లో వీసా రెన్యువల్‌కు వేచి ఉండాల్సిన పనిలేదు. ఇండియాతోపాటు జర్మనీ, థాయ్‌లాండ్‌లలోనూ భారతీయుల వీసా జారీ కోసం ఎంబసీలు, కాన్సులేట్‌లకు మరింత మంది సిబ్బందిని పంపుతున్నాం. వారాంతాల్లోనూ ఇంటర్వ్యూలు చేస్తున్నారు'' అని చెప్పారు.

ఉక్రెయిన్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

అంతర్గత వ్యవహారాల మంత్రిసహా 18 మంది దుర్మరణం

బ్రోవరీ(ఉక్రెయిన్): హెలికాప్టర్ కూలిన దుర్ఘటనలో ఉక్రెయిన్ తన అంతర్గత వ్యవహారాల మంత్రిని కోల్పోయింది. బుధవారం ఉదయం రాజధాని కీవ్ సమీపంలోని బ్రోవరీ పట్టణంలో చిన్నారుల పాఠశాల ప్రాంగణంలో అత్యవసర విభాగ హెలికాప్టర్ కుప్పకూలింది. అందులో ప్రయాణిస్తున్న మంత్రి డెనిస్ మోనాస్టిర్‌స్కీ, సహాయమంత్రి హెనిన్, ఆ శాఖ కార్యదర్శిసహా తొమ్మిది మంది మరణించారు. హెలికాప్టర్ కూలడంతో ఆ ప్రాంతంలో ఉన్న మరో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. 15 మంది చిన్నారులుసహా 29 మంది గాయపడ్డారు. ఇది ప్రమాదమా, రష్యా పనా అనే దానిపై స్పష్టత లేదు. ఇది ఘోర దుర్ఘటన అని అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు.

ఈశాన్యాన ఎన్నికల నగారా

2023లో ఏడాది పొడవునా సాగనున్న అసెంబ్లీ ఎన్నికల జాతరకు ఈశాన్యాన నగారా మోగింది. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ రావడంతో రాజకీయ వేడి రాజుకుంది. ఈ మూడు ఈశాన్య రాష్ట్రాలూ బీజేపీ చేతిలోనే ఉండటం విశేషం! త్రిపురలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగా మిగతా రెండు రాష్ట్రాల్లో అధికార సంకీర్ణంలో మైనారిటీ భాగస్వామిగా ఉంది. 2024లో కీలకమైన లోక్‌సభ ఎన్నికలున్నందున ప్రతి అసెంబ్లీ ఎన్నికా పార్టీలన్నింటికీ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగడం ఖాయంగా కన్పిస్తోంది. పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డనుండగా, పశ్చిమబెంగాల్ బయట పట్టు సాధించే యత్నాల్లో భాగంగా మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మూడు రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూలు వచ్చేసింది

త్రిపురలో ఫిబ్రవరి 16న పోలింగ్ ● నాగాలాండ్, మేఘాలయల్లో 27న ● మార్చి 2న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ: త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో 27న పోలింగ్ జరగనుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి. జనవరి 31న నోటిఫికేషన్ రానుంది. ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. మార్చిలో పరీక్షలున్నందున ఫిబ్రవరిలోనే ఎన్నికల ప్రక్రియను ముగించాలని నిర్ణయించినట్టు వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై బీఎస్పీ అధినేత్రి మాయావతి అనుమానాలను ప్రస్తావించగా, గతంలో ఇలా ఆక్షేపించిన పలు పార్టీలు ఆ తర్వాత పలు ఎన్నికల్లో గెలిచాయని ఆయన గుర్తు చేశారు. వాతావరణం, భద్రత తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్షద్వీప్ లోక్‌సభ స్థానంతో పాటు ఐదు రాష్ట్రాల్లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు కూడా ఫిబ్రవరి 27నే ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో మహారాష్ట్రలో 2, అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో ఒక్కో అసెంబ్లీ స్థానం ఉన్నాయి. లక్షద్వీప్ ఎన్సీపీ ఎంపీ మొహమ్మద్ ఫైజల్ క్రిమినల్ కేసులో దోషిగా తేలి అనర్హతకు గురవడంతో ఆ స్థానం ఖాళీ అవడం తెలిసిందే. కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ మరణంతో పంజాబ్‌లోని జలంధర్ లోక్‌సభ స్థానం ఖాళీ అయినా లోక్‌సభ సచివాలయం నుంచి ఈసీకి అధికారికంగా సమాచారం అందలేదు. దాంతో అక్కడ ఉప ఎన్నిక జరగడం లేదు.



త్రిపుర



రాష్ట్రంలో పాతికేళ్ల వామపక్ష పాలనకు బీజేపీ ఎట్టకేలకు 2018లో తెర దించింది. మొత్తం 60 సీట్లకు గాను 33 స్థానాలు నెగ్గి అధికారంలోకి వచ్చింది. సీపీఎంను 15 సీట్లకు పరిమితం చేసింది. బీజేపీ మిత్రపక్షమైన గిరిజన పార్టీ ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) 4, కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ప్రస్తుతం 7 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బిప్లవ్ దేబ్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. పేలవ పనితీరు కారణంగా 2022 మేలో ఆయన్ను తొలగించి డాక్టర్ మాణిక్ సాహాను బీజేపీ అధిష్టానం ముఖ్యమంత్రిని చేసింది. ఆయన కూడా రాష్ట్ర బీజేపీలో అసమ్మతి స్వరాలను శాంతింపజేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఐపీఎఫ్‌టీతోనూ బీజేపీకి ఉప్పూనిప్పుగానే ఉంది. పరిస్థితులను చక్కదిద్దేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవలే రాష్ట్రంలో పర్యటించారు. జన విశ్వాస్ యాత్రకు జెండా ఊపడం ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరోవైపు సీపీఎం గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టుకట్టినా బీజేపీని నిలువరించలేకపోయింది. ఈసారి కూడా వాటి మధ్య పొత్తు పొడిచే అవకాశముంది. ఇక తృణమూల్ ఇక్కడ మాజీ కాంగ్రెస్ నాయకురాలు సుష్మితా దేవ్‌పైనే ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన గిరిజన నేత ప్రద్యుత్ మాణిక్యకు చెందిన తిప్రా మోథా పార్టీ గిరిజన స్థానాల్లో నిర్ణాయకం కాగలనని భావిస్తోంది. ఓ బీజేపీ ఎమ్మెల్యేతో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు కూడా ఇందులో చేరడం విశేషం.

ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
బీజేపీ	33
ఐపీఎఫ్‌టీ	4
సీపీఎం	15
కాంగ్రెస్	1
ఖాళీలు	7

మేఘాలయ



మొత్తం 60 సీట్లకు గాను 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 21 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 20, తృణమూల్ 9, యూడీపీ 8, బీజేపీ 2 సీట్లు గెలుచుకున్నాయి. ఎన్‌పీపీ, యూడీపీ, బీజేపీ కలయికతో మేఘాలయ డెమొక్రటిక్ అలయన్స్ (ఎండీఏ) పేరుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్‌పీపీ నేత కాన్రాడ్ సంగ్మా సీఎం అయ్యారు. అనంతరం డజను మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాజీ సీఎం ముకుల్ సంగ్మా ఎన్సీపీలో చేరడంతో అది ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది! ఎమ్మెల్యేల మూకుమ్మడి రాజీనామాలతో ప్రస్తుతం 18 అసెంబ్లీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు పలువురు ఎన్‌పీపీ ఎమ్మెల్యేలు ఇటీవల బీజేపీలో చేరడంతో అధికార సంకీర్ణంలోనూ లుకలుకలు బయల్దేరాయి! ఒక దశలో ఇకపై తాము ఒంటరిగానే పోటీ చేస్తామని సీఎం సంగ్మా ప్రకటించేదాకా వెళ్లింది! ఈసారి ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్నెస్ట్ మావ్రీ బుధవారం ప్రకటించారు. ఇలా రాష్ట్రంలో రాజకీయం కప్పల తక్కెడను తలపిస్తోంది. టీఎంసీ ఈసారి మరింత గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు.

ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
ఎన్‌పీపీ	20
యూడీపీ	8
టీఎంసీ	8
పీడీఎఫ్	2
బీజేపీ	2
ఎన్సీపీ	1
స్వతంత్రులు	1
ఖాళీలు	18

నాగాలాండ్



యునైటెడ్ డెమొక్రటిక్ అలయన్స్ (యూడీఏ) పేరుతో బీజేపీ, నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. ఎన్‌డీపీపీ నేత నిఫు రియో సీఎంగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో 26 సీట్లతో ఏకైక అతి పెద్ద పార్టీగా నిలిచిన ఎన్‌పీఎఫ్ కూడా సంకీర్ణంలో చేరడంతో రాష్ట్రంలో ప్రతిపక్షమనేది లేకుండా పోయింది! ఎన్‌డీపీపీ 18, బీజేపీ 12, ఎన్‌పీపీ 2 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ ఈసారి 20 సీట్లలో పోటీ చేయాలని భావిస్తోంది.

ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
ఎన్‌డీపీపీ	41
బీజేపీ	12
ఎన్‌పీఎఫ్	4
స్వతంత్రులు	2
ఖాళీలు	1



రాష్ట్రం	పోలింగ్
నాగాలాండ్	ఫిబ్రవరి 27
మేఘాలయ	ఫిబ్రవరి 27
త్రిపుర	ఫిబ్రవరి 16

(ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి - మార్చి 2)

బీజేపీది రెండు నాల్కల వైఖరి: మమత



షిల్లాంగ్: రాష్ట్రాలకు చెల్లించాల్సిన నిధులు, ఇతరత్రా హామీలను ఎన్నికల వేళ ప్రధానంగా ప్రస్తావించే బీజేపీ ఆ తర్వాత మరోలా మాట్లాడుతుందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. మేఘాలయలోని ఉత్తర గారో హిల్స్ జిల్లాలో బుధవారం ఆమె భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ''బీజేపీకి రెండు ముఖాలుంటాయి. ఎన్నికల ముందు హామీలు గుప్పిస్తూ ఒక ముఖం మాట్లాడుతుంది. ఆ తర్వాత మరో ముఖం మరోలా మాట్లాడుతుంది. కాషాయ పార్టీ ఏలుబడిలోని రాష్ట్రాలకే కేంద్ర నిధులు దక్కుతాయి. ఇలాంటి పార్టీకి ఓటేయకండి'' అని పిలుపునిచ్చారు. అస్సాం, త్రిపురలతోపాటు మేఘాలయలోనూ పార్టీని పటిష్టంచేయడంపై మమత దృష్టిసారించారు. మేఘాలయలో 2021 నవంబర్‌లో కాంగ్రెస్‌లోని 17 మంది ఎమ్మెల్యేల్లో ఏకంగా 12 మంది టీఎంసీలో చేరడం విశేషం! గత డిసెంబర్‌లో రాష్ట్రంలో పర్యటించిన మమత.. స్థానిక మహిళలకు ఆర్థిక తోడ్పాటు కోసం ప్రత్యేక పథకాన్ని ప్రారంభించారు. ఈ కొద్దిరోజుల్లోనే 3.14 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు!



అంతరించిపోయే ప్రమాదమున్న అరుదైన కాషాయ రంగు గబ్బిలం ఇది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కంగేర్ లోయ జాతీయవనంలో ఇటీవల ఇది కనిపించిందని నేషనల్ పార్క్ డైరెక్టర్ చెప్పారు. కంగేర్ పార్క్‌లోని సున్నపురాయి గుహలు ఈ గబ్బిలాల ఆవాసానికి అనువైనవి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 19 । జనవరి । 2023

టీచర్ హోదా కోసం అంగన్‌వాడీల పట్టు



శివాజీనగర: బుధవారం నగరంలోని ఫ్రీడంపార్కులో రాష్ట్ర అంగనవాడీ కార్యకర్తలు, సహాయకులు భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రం నలమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో తమకు పాఠశాల ఉపాధ్యాయుల హోదా కల్పించాలని, అంతవరకు విధులకు వెళ్లబోమని తెలిపారు.

న్యూస్‌రీల్

బస్సు ఆపలేదన్న కసితో హత్య

బనశంకరి: ప్రైవేటు బస్సు డ్రైవరును హత్యచేసిన వెంకటేశ్ అనే వ్యక్తిని బుధవారం కామాక్షీపాళ్య పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలు... వెంకటస్వామి 12వ తేదీ అర్ధరాత్రి జీటీ పారిశ్రామికవాడ ఏరియాలో బస్సు నిలిపి నిద్రిస్తుండగా వెంకటేశ్ అనే వ్యక్తి వచ్చాడు. గతంలో తాను బస్సు నిలపమంటే ఎందుకు నిలపకుండా వెళ్లిపోయావని వెంకటస్వామితో ఘర్షణపడ్డాడు. కాలితో తన్ని బస్సులో నుంచి కిందికి తోసేశాడు. బలమైన గాయం కావడంతో వెంకటస్వామి మృతిచెందాడు. మృతదేహాన్ని సుంకదకట్టె సాగర్ టింబర్ డిపో వద్ద డ్రైనేజీలో పడేసి వెంకటేష్ ఉడాయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఎట్టకేలకు నిందితుడు వెంకటేశ్‌ను అరెస్టు చేశారు.

పులి పట్టివేత

శివాజీనగర: కొడగు జిల్లా మడికెరిలో 12 సంవత్సరాల మగ పులి అనారోగ్యంతో సంచరిస్తుండగా అటవీ సిబ్బంది దానిని బుధవారం పట్టుకొని మైసూరు జూకి తరలించారు. విరాజపేట తాలూకా మల్దార గ్రామం వద్ద పులిని గుర్తించి మత్తుమందు ఇచ్చారు. దానిని జూకి తరలించి చికిత్స ప్రారంభించారు.

ఒంటరితనంతో.. వైద్యుడు బలవన్మరణం

మైసూరు: ఉరి వేసుకుని వైద్యుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మైసూరు శ్రీరాంపుర లేఔట్‌లో బుధవారం జరిగింది. డాక్టర్ భాగీరథి (52) హెచ్‌డీ కోటెలోని వివేకా పాలి క్లినిక్‌లో పని చేస్తున్నారు. ఆరేళ్ల క్రితం ఆయన భార్య డాక్టర్ షాజీ మరణించింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటూ మానసికంగా కుంగిపోయాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన కుమార్తె డాక్టర్ అనురాజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అశోకపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి యువకుడు...

యువకుడు రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర తాలూకా బదనగుప్ప సమీపంలో జరిగింది. మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా దాసనూరు గ్రామానికి చెందిన రవికిరణ్ (27) రైలు పట్టాల వద్ద బైక్‌ను నిలిపి రైలు వస్తుండగా తలపెట్టి పడుకున్నాడు. రైలు వెళ్లిన స్పీడుకు తల, మొండెం వేరయ్యాయి. నంజనగూడు రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. యువకుని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కల్బుర్గిలో భూప్రకంపనలు

శివాజీనగర: కల్బుర్గి జిల్లాలో బుధవారం చిన్నపాటి భూకంపం వచ్చింది. ఉదయం 9 గంటల 48 నిమిషాల సమయంలో భూమి కంపించింది. ఐదు సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. కల్బుర్గి జిల్లా సేడం తాలూకా బెనకనహళ్లి, చుట్టుపక్కల గ్రామాల్లో భూకంపం రాగా ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. భూ ప్రకంపనలు నిజమేనని జాతీయ భూకంప కేంద్రం ట్విట్టర్లో తెలిపింది.

జేడీఎస్ గెలవకపోతే పార్టీని వీడతా: కుమార

రాయచూరు రూరల్: ఈసారి ఎన్నికల్లో జేడీఎస్ అధికారంలోకి రాకపోతే పార్టీని వీడతానని మాజీ సీఎం కుమారస్వామి చెప్పారు. ఆయన బుధవారం విజయపుర జిల్లా సింధగిలో పాత్రికేయులతో మాట్లాడారు. ఈ ఏడాది జేడీఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ప్రజలు కట్టిన పన్నులను బీజేపీ సర్కారు లూటీ చేసిందని, కాంగ్రెస్, బీజేపీలు రైతులకు సంక్షేమ పథకాలను ప్రకటించలేదని అన్నారు. 2018 తర్వాత ప్రజల వద్దకు వెళ్లి తాము ఓటు అడగకపోవడం వల్ల ఓటమి చెందామన్నారు.

బెంగళూరులో మిస్సింగ్, తిరుపతిలో ప్రత్యక్షం

తిరుపతి అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ ప్రేమజంట తిరుమలలో పెళ్లిచేసుకుని.. తిరుగు ప్రయాణంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో బుధవారం అనంతపురం వెళ్లేందుకు ప్లాట్‌ఫాం వద్ద ఉండగా ఆర్టీసీ సెక్యూరిటీకి అనుమానంగా కనిపించింది. దీంతో వారు ఆ జంటను విచారించారు. తాము వివాహం చేసుకున్నట్లు చెప్పడంతో వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలిక తల్లిదండ్రులు బెంగళూరు సిటీలోని కోణనకుంటె పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టినట్లు తెలుసుకున్నారు. బాలిక వయస్సు 15, యువకుని వయస్సు 21గా వెల్లడించారు. ఈస్ట్ పోలీసులు ఆ జంటను అదుపులోకి తీసుకున్నారు.


స్కూటరిస్టును బలిగొన్న సిటీ బస్

బనశంకరి: స్కూటర్‌ను బీఎంటీసీ బస్ ఢీకొనగా స్కూటరిస్టు మరణించాడు. ఈ ఘటన కామాక్షిపాళ్య ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. విజయనగర నివాసి కులదీప్ బగరేచా (31) మధ్యాహ్నం 12.30 సమయంలో స్కూటర్‌లో సుమనహళ్లి బ్రిడ్జి వద్ద వెళుతుండగా వెనుకనుంచి బీఎంటీసీ బస్ ఢీకొట్టింది. కిందపడిన కులదీప్ బగరేచా తలకు తీవ్రగాయం కాగా అతడి చేతిపై బస్సు చక్రం దూసుకెళ్లింది. క్షతగాత్రున్ని స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు బీఎంటీసీ డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

వలపు వలలో గిజగిజ

సైబర్ నేరగాళ్లు ఇట్టే డబ్బు సంపాదనకు దారుణాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మార్గాల్లో వీడియో కాల్ చేసి వల వేయడం, ఆ వీడియోలను అడ్డుపెట్టుకుని భారీగా డబ్బులు గుంజడం చాపకింద నీరులా సాగిపోతోంది. పరువు పోతుందని, కుటుంబ సమస్యలు వస్తాయనే భయంతో ఎక్కువమంది బాధితులు మౌనంగా ఉండిపోవడం వల్ల నేరగాళ్లు మరింతగా చెలరేగే ప్రమాదముంది. ఐటీ సిటీలో ఏటేటా పెరుగుతున్న హనీ ట్రాప్ నేరాలే ఇందుకు నిదర్శనం. సోషల్ మీడియాలో గాలిస్తూ అమాయకులను గుర్తిస్తారు, మహిళలతో కాల్ చేయించి ట్రాప్ చేస్తారు. ఈ వలలో ఇరుక్కుపోకుండా ఉండాలంటే అప్రమత్తతే ముఖ్యం.

- అశ్లీల ఫొటోలు, వీడియోలు పంపి స్క్రీన్‌షాట్‌తో రికార్డింగ్
- వాటిని సామాజిక మాధ్యమాల్లో ఉంచుతామని బ్లాక్‌మెయిలింగ్
- సిలికాన్ సిటీలో పెరుగుతున్న వంచన కేసులు



బనశంకరి: అశ్లీల వీడియో, ఫొటోలు చూపించి వలపు వల విసిరి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఘటనలు సిలికాన్‌సిటీ లో హెచ్చుమీరుతున్నాయి. వంచనకు గురైన బాధితులు పరువు పోతుందని భయపడి బయటకు చెప్పడం లేదు. లక్షలాది రూపాయలు ముట్టజెప్పి మిన్నకుండిపోతున్నారు. ఇదే అదనుగా బ్లాక్‌మెయిలర్లు రెచ్చిపోతున్నారు. మొదటగా అపరిచితులకు ఫోన్లు చేసి తీయని మాటలతో ఆకట్టుకుంటారు. ఆ తర్వాత సెల్‌ఫోన్లకు అశ్లీల ఫొటోలు, వీడియోలు పంపుతారు. వాటిని చూసే సమయంలో స్క్రీన్‌షాట్ తీసుకోవడం లేదా వీడియో రికార్డ్ చేస్తారు. లక్షల్లో డబ్బు డిమాండ్ చేస్తారు. ఇవ్వకపోతే ఈ దృశ్యాలను బంధువులు, స్నేహితులు, లేదా సామాజిక మాధ్యమాల్లో ఉంచుతామని బెదిరిస్తారు. దీంతో వారు చెప్పినంత సమర్పించుకుంటున్నారు. సమాజంలో పెద్ద హోదాలో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వంచకులు ఇలాంటి అకృత్యాలకు తెరతీస్తున్నారు. కొందరు బాధితులు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. బ్లాక్‌మెయిలింగ్‌పై 2021లో 175 కేసులు, 2022లో 185 కేసులు నమోదయ్యాయి. సైబర్‌క్రైం లేదా వంచన, బ్లాక్‌మెయిల్‌కు సంబంధించి రోజూ 220 కిపైగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయి.

5 ఏళ్లలో నమోదైన కేసులు

ఏడాది	కేసులు
2018	21
2019	51
2020	130
2021	175
2022	185



112కు ఫోన్ చేయొచ్చు

అశ్లీల వీడియోలు, ఫొటోలు పంపి నగదు కోసం బెదిరింపులకు పాల్పడుతున్నవారిపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, పోలీసులు నిత్యం బాధితుల సహాయానికి అందుబాటులో ఉంటారని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

బళ్లారి ఉత్సవాలు



బళ్లారి నగరంలో జిల్లా ఉత్సవాల కోలాహలం నెలకొంది. గాలిపటాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న బాలలు



కల్బుర్గి, యాదగిరికి నేడు మోదీ

- ఇళ్ల హక్కుపత్రాల పంపిణీ



కన్నడనాట ప్రధాని మోదీ ముమ్మర యాత్రలు

బనశంకరి/ శివాజీనగర: ప్రధాని నరేంద్ర మోదీ నేడు గురువారం కల్బుర్గి, యాదగిరిలో పర్యటించనున్నారు. వేలాది పేదలకు ఇళ్ల హక్కు పట్టాలను మోదీ స్వయంగా అందజేస్తారు. ఆర్టీసీ బస్సుల ద్వారా వేలాది మందిని తరలించాల్సి ఉన్నందున వివిధ మార్గాల్లో బస్సుల సంచారంలో తారతమ్యం నెలకొంటుందని ఆర్టీఈ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలకు ఇళ్ల హక్కు పట్టాల లబ్ధిదారులను తీసుకొచ్చేందుకు 2,382 బస్సులను ఏర్పాటు చేశారు. ఇక భద్రతగా 2 వేలకు పైగా పోలీసులను మోహరించారు.

దూకుడుగా బీజేపీ ఎన్నికల కార్యక్రమాలు

రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల వ్యూహాలపై చర్చించడానికి శుక్రవారం బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ భేటీలో రాష్ట్ర ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్, సీఎం బొమ్మై సహా సీనియర్ నాయకులు పాల్గొంటారు. అలాగే ఈ నెల 28 తేదీన పాత మైసూరు లేదా మంగళూరు ప్రాంతంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. త్వరలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు రాష్ట్రంలో పర్యటించి బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయబోతున్నారు. ఫిబ్రవరి 13 న యలహంక లో ఎయిర్‌షో ను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. అదేరోజు బెంగళూరులో బృహత్ బహిరంగ సభను నిర్వహిస్తారు. ఇక ముమ్మరంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో ఉండడానికి ప్రణాళికలు రూపొందించారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు

బనశంకరి: నగరంలో విద్యారణ్యపుర పోలీసులు నలుగురు డ్రగ్స్ విక్రేతలను అరెస్ట్‌చేశారు. సింగాపుర, కాన్షీరామ్ నగర చెరువు పక్కన ఇంట్లో డ్రగ్స్ నిల్వచేసినట్లు తెలిసి దాడులు జరిపారు. షేక్‌అలీ, షేక్ సల్మాన్, ముజామిల్ పాషా, వినోద్‌కుమార్ అనే నలుగురిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 2 కిలోల 380 గ్రాముల గంజాయి, 56 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, రూ.2.39 లక్షల నగదు, స్కూటర్, బుల్లెట్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

18 ఏళ్లకు మద్యం ఉత్తర్వులు రద్దు

బనశంకరి: మద్యం కొనడానికి వయసును తగ్గించడంపై సర్కారు వెనక్కి తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం కొనాలంటే కనీసం 21 ఏళ్ల వయసు ఉండాలి. దీనిని 18 ఏళ్లకి తగ్గిస్తున్నట్లు సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎక్సైజ్‌లైసెన్సు నిబంధనలు–1967ను సవరించనున్నట్లు తెలిపింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

క్షణికావేశం.. తీసింది ప్రాణం

- విజయనగర జిల్లాలో తల్లి, ఇద్దరు కూతుళ్లు..
- మరోచోట ప్రేమజంట ఆత్మహత్య

సాక్షి బెంగళూరు: రాష్ట్రంలో పలుచోట్ల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. ఓ చోట తల్లీకూతుర్లు, మరోచోట ప్రేమజంట తనువు చాలించారు.విజయనగర జిల్లాలో తన ఇద్దరు కూతుళ్లతో కలసి తల్లి ఆత్మహత్య చేసుకుంది. హరపనహళ్లి తాలూకా నీలగుందలో ఈ ఘటన జరిగింది. వీరి ఆత్మహత్యకు ఇంకా కారణాలు తెలియరాలేదు. తల్లి భవ్య (36), కూతుళ్లు కావ్య (14), అమూల్య (10) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కాగా మూడు రోజుల నుంచి భర్త వీరేశ్ ఇంటికి రాలేదు. వీరేశ్ ఇంట్లో లేని సమయంలో వీరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాలతో విరక్తి చెంది ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు.



విజయనగర జిల్లాలో ప్రేమికులు..

ప్రేమికుల జంట ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన విజయపుర జిల్లా జైనాపురలో జరిగింది. జైనాపురలోని ఒక తోటలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించారు. రాకేశ్ అంగడి (23), సావిత్రి అంబలి (19) రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో వీరి పెళ్లికి అంగీకరించకపోవడం వల్లే ప్రాణాలు తీసుకుని ఉంటారని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈ జంట ఇంటి నుంచి బయటకు వచ్చారు. బసవనబాగేవాడి పోలీసులు విచారణ చేపట్టారు.

భక్తిమార్గమే గొప్పదని..



ముముక్ష



సన్యాసం తీసుకున్న ముముక్ష

- సన్యాస దీక్ష స్వీకరించిన యువతి

హొసపేటె: ఆడిపాడే వయసులో ఓ యువతి ఇహలోక అంశాలను త్యజించి సన్యాసదీక్ష తీసుకుంది. హొసపేటె నగరంలో నివాసముంటున్న వ్యాపారి దివంగత కాంతిలాల్ జిరావర్, రేఖా దేవి దంపతుల నలుగురు కుమార్తెల్లో మూడో కుమార్తె ముముక్ష బుధవారం జైన మత సంప్రదాయాల ప్రకారం సన్యాసదీక్ష స్వీకరించింది. స్థానిక హోటల్ ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జైనమునులు ఆమెకు సన్యాస దీక్ష ఇచ్చారు.

ఆధ్యాత్మిక ప్రపంచమే మిన్న

19 ఏళ్ల ముముక్ష మాట్లాడుతూ తన నాలుగేళ్ల వయస్సులో తండ్రి ఓ ప్రమాదంలో మృతి చెందారు. అన్ని కష్టాలను అధిగమించి తాను 10వ తరగతిలో 95.8 శాతం, పీయూసీలో 99 శాతం మార్కులతో పాసైనట్లు తెలిపింది. లౌకిక ప్రపంచం కన్నా తనకు ఆధ్యాత్మిక ప్రపంచమే మిన్నగా భావించి ఈరోజు జైన సన్యాసాన్ని స్వీకరించానని తెలిపింది. ఈ సందర్భంగా బంధుమిత్రులు ఆమెను భారమైన హృదయాలతో అభినందించారు.

సహకార బ్యాంకుల స్కాంపై సీబీఐ దర్యాప్తు

శివాజీనగర: శ్రీ గురు రాఘవేంద్ర కో–ఆపరేటివ్ సొసైటీతో పాటు మూడు కో– ఆపరేటివ్ బ్యాంకుల్లో ఆర్థిక మోసాల కేసులను రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మూడు కో–ఆపరేటివ్ బ్యాంకుల్లో కలిసి సుమారు రూ. 1800 కోట్ల వరకూ వంచన జరిగినట్లు ఆరోపణలున్నాయి. డిపాజిటర్లు దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదులు చేశారు. నకిలీ ఆధారాలను సృష్టించి ఖాతాదారులకు, డిపాజిట్‌దారులకు ఈ మూడు సహకార బ్యాంకులు శఠగోపం పెట్టాయి. గురురాఘవేంద్ర కో– ఆపరేటివ్ సొసైటీ, వశిష్ఠ కో– ఆపరేటివ్ సొసైటీ, గురురాఘవేంద్ర సౌహార్ద సొసైటీలో ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయి. సహకార శాఖ మంత్రి ఎస్.టీ.సోమశేఖర్ బుధవారం మాట్లాడుతూ వీటిపై విచారణను సీబీఐకి అప్పగించనున్నట్లు తెలిపారు.



బుధవారం చిక్కమగళూరులో జిల్లా ఉత్సవాలు ఆరంభమైన దృశ్యం. జిల్లా సంస్కృతికి అద్దంపట్టే వేడుకలను నిర్వహిస్తారు

యాసిడ్ దాడి భయంతో బెయిలుకు నో

శివాజీనగర: మైనర్ బాలికను వేధించి అరెస్టయిన నిందితునికి హైకోర్టు బెయిలు నిరాకరించింది. ప్రేమించాలని ఆ యువకుడు 14 సంవత్సరాల బాలిక వెంటబడ్డాడు. బాలిక నిరాకరించడంతో యాసిడ్ దాడి చేస్తానని ఆమెను బెదిరించాడు. దీంతో బాలిక ఆ గత జూన్‌లో పోకిరీపై ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్టు చేశారు. బెయిలు కావాలని అతడు హైకోర్టులో అర్జీ వేశాడు. అతనికి బెయిలు ఇస్తే తనపై యాసిడ్‌తో దాడి చేసే ప్రమాదముందని బాలిక ఆందోళన వ్యక్తం చేయడంతో హైకోర్టు బెయిలుకు నిరాకరించింది.

త్వరలోనే మంత్రివర్గ విస్తరణ

- హైకమాండ్‌తో చర్చించా: సీఎం

శివాజీనగర: మంత్రిమండలి విస్తరణకు అధిష్టానం త్వరలో అనుమతి ఇస్తుందని, ఆ వెంటనే ప్రక్రియ పూర్తవుతుందని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తెలిపారు. మంత్రివర్గ విస్తరణ గురించి అధిష్టానంతో చర్చించానన్నారు. బుధవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ పెద్దలతో ఎక్కువసేపు మాట్లాడేందుకు సమయం లభించలేదు. మంత్రివర్గ విస్తరణ గురించి మాట్లాడాను. వీలైనంత త్వరలో ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు అని చెప్పారు. హైకమాండ్ చెప్పినట్లుగా మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్నారు. త్వరగానే మంత్రి పదవుల పంపిణీ జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్‌వారు నిరాశలో ఉన్నందున ప్రజలను తప్పుదారి పట్టించే ఉచిత ప్రకటనలను చేస్తున్నారని సీఎం విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2 వేలు ఇస్తామంటున్నారు, మరి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ పథకాలను అమలు చేయలేదని ప్రశ్నించారు.

రాజకీయం సవాళ్లమయం

కష్టాల్లో ఉన్నవారికి రాజకీయ నేతగా సాయం చేయవచ్చు, రాజకీయం చాలావరకు సవాళ్లతో కూడిన వృత్తి అయినా కూడా తృప్తినిచ్చిందని సీఎం అన్నారు. యువ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యుత్తమమైనదని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదని తెలిపారు.

ఛాయాచిత్ర పండుగ

- రేపటి నుంచి సలాన్ ప్రదర్శన

బనశంకరి: ప్రపంచవ్యాప్తంగా ఆశ్చర్యంగొలిపే దృశ్యాలను ఒక్కచోటే తిలకించవచ్చు. సలాన్ ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను మంత్రముగ్ధులను చేయనుంది. ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు చిత్రకళాపరిషత్‌లో వైవిధ్యభరిత ఛాయాచిత్రాలు కొలువుతీరనున్నాయి. కలర్, మోనోక్రోమ్, నేచర్, ట్రావెల్ నాలుగు విభాగాల్లో ప్రముఖ ఫోటోగ్రాఫర్లు కెమెరాల్లో బంధించిన విభిన్న ఛాయాచిత్రాలు ప్రదర్శనలో ఉంచుతారు. ప్రపంచమంతటా పర్యటించిన తీసిన ప్రత్యేకమైన ఫోటోలకే ఇక్కడ అవకాశం ఉంటుంది. వన్య జీవులు, ప్రకృతి దృశ్యాల ఫోటోలు చూపు తిప్పుకోనివ్వవని సలాన్ నిర్వాహకులు తెలిపారు.



మనోహరమైన ఒక ల్యాండ్ స్కేప్ ఛాయాచిత్రం



స్నేహమేరా జీవితం.. బాలల స్నేహగీతం



ఎంత పెద్ద సింహమైనా పిల్లకు లోకువే

క్లుప్తంగా

నేడు యాదగిరికి ప్రధాని రాక



మాట్లాడుతున్న ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

రాయచూరు రూరల్ : యాదగిరి జిల్లాలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తారని ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. సురపుర తాలూకా హుణసిగి, కొడేకల్‌ల మధ్య విశాలమైన మైదానంలో నారాయణపుర ఎడమ కాలువ విస్తరణ, ఆధునీకరణ, కలబుర్గి, విజయపుర, యాదగిరి జిల్లాల్లో 560 గ్రామాల పరిధిలో 3.34 లక్షల మంది రైతులకు నీటిపారుదల సౌకర్యం కల్పించే పనులను ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, నగరసభ అధ్యక్షురాలు లలిత, ఏపీఎంసీ అధ్యక్షుడు అచ్యుత్ రెడ్డి, రామచంద్ర, పాటిల్, శంకర్ రెడ్డిలున్నారు.

పింఛన్ల తాత్కాలిక నిలిపివేత

గంగావతి: వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు గ్రేడ్-2 తహసీల్దార్ హొరపేటె ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారు తాజాగా ఆధార్‌కార్డు, పింఛన్ మంజూరు పత్రం, బ్యాంక్ ఖాతాను నగరంలోని బసవన్న సర్కిల్‌లోని రెవెన్యూ శాఖ కార్యాలయంలో ఈనెల 25 లోగా అందజేయాలని, వాటిని మరోసారి పరిశీలించి పింఛన్లను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: నగరాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన బుధవారం 23, 24, 25వ వార్డుల్లో రూ.4.70 కోట్లతో సీసీ రోడ్లు, మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు లలిత, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులున్నారు.

శ్మశానంలో సౌకర్యాలేవీ?

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా కుర్డిలోని శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్‌డీపీఐ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షులు హుసేన్ బాషా మాట్లాడారు. అంతిమ సంస్కారాలకు ముందు నమాజుకు నీటి సదుపాయం లేదని, కూర్చోడానికి స్థలం తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జల్సాల కోసం బైక్ చోరీలు

• నిందితుడు అరెస్టు

గుంతకల్లు టౌన్: చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు ధనార్జనకు ద్విచక్రవాహనాలను దొంగిలించడం వృత్తిగా ఎంచుకున్నాడు. వాటిని అమ్మి జల్సాలు చేశాడు. గుంతకల్లు పట్టణంలో ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న గౌని నరేంద్ర రెడ్డి అనే యువకుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని నుండి రూ.6 లక్షలు విలువ చేసే 13 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఆయన కేసు వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం స్థానిక హనుమాన్‌సర్కిల్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బళ్లారికి వెళ్తున్న గౌని నరేంద్రరెడ్డిని పోలీసులు బైక్ రికార్డులు చూపించాలని అడిగారు. బైక్‌ను వదిలేసి తప్పించుకుందామని యత్నించిన అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా గుట్టు రట్టయింది. నిందితుడు పట్టణంలో దొంగలించి వేర్వేరు ప్రదేశాల్లో దాచిపెట్టిన 13 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో బళ్లారిలో కూడా బైక్ చోరీలు చేసి జైలుశిక్ష అనుభవించినట్లు సీఐ చెప్పారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం



జ్యోతి వెలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోసురాజు

రాయచూరు రూరల్ : క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి క్రీడలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే బోసురాజు పేర్కొన్నారు. ఆయన బుధవారం జిల్లా బ్యాడ్మింటన్ క్రీడా మైదానంలో ఐదు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, ముజుబుద్దీన్, సాజిద్ సమీర్, నాగరాజ్‌లున్నారు.

సిరిధాన్యం..ఆరోగ్యానికి సోపానం

• పూర్వీకుల ఆహార అలవాట్లను అలవర్చుకోవాలి
• మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



ప్లకార్డులతో జాతాను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు మారిపోవడం వల్ల పలు అనారోగ్య సమస్యలు దరిచేరుతున్నాయని, అందువల్ల మన పూర్వీకుల ఆహారపు అలవాట్లను మనం అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీ.శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. వారు బుధవారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో సిరిధాన్యాల గొప్పదనంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. సిరిధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి నిత్యం ఆహారంలో సిరిధాన్యాలు భాగం కావాలన్నారు. నేటి యువత సిరిధాన్యాల గురించి అవగాహన పెంచుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిరిధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయంటూ ప్లకార్డులు పట్టుకుని నగరంలో మ్యారథాన్ చేపట్టారు. మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, జవళి నిగమ రాష్ట్ర అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, కలెక్టర్ పవన్‌కుమార్, బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, ఎస్పీ రంజిత్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

తుంగభద్రా నదిపై కొత్త వంతెన నిర్మించండి

కంప్లి: తుంగభద్రా నదిపై కొత్త వంతెన నిర్మించాలని కంప్లి-గంగావతి తుంగభద్రా నది వంతెన పోరాట సమితి కార్యదర్శి ఇటిగి విరుపాక్షి ఒత్తిడి చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీరాములు బుధవారం కంప్లి మీదుగా కారటగికి వెళ్తుండగా పాతబస్టాండ్ వద్ద కొంతసేపు కార్యకర్తలను కలిసిన సందర్భంగా పోరాట సమితి సభ్యులు, ప్రజలు ఆయనకు వినతిపత్రం అందించారు. ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుందని, కొత్త వంతెన నిర్మాణానికి చొరవ చూపాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య, కే.హేమయ్యస్వామి, అయోధి వెంకటేష్, డాక్టర్.వెంకటేష్ భర్మక్కనవర్, బీ.సిద్ధప్ప, కే.మనోహర్, హుగార్ రమేష్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సీ కాలువలోకి బైక్ పల్టీ

• బళ్లారి వాసి గల్లంతు



కాలువ వద్ద గాదిలింగ కోసం గాలిస్తున్న దృశ్యం.(ఇన్‌సెట్‌లో) గల్లంతైన గాదిలింగ(ఫైల్)

కణేకల్లు: తుంగభద్ర హెచ్చెల్సీ కాలువలోకి బైక్ దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి గల్లంతు కాగా మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటన కణేకల్లు మండలంలోని అంబాపురం గ్రామంలో మంగళవారం రాత్రి 10.30 గంటలకు చోటు చేసుకొంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. బళ్లారి రూరల్ ప్రాంతం చెరకుంటెకు చెందిన గాదిలింగ (22) సంజీవరాయనకోటెకు చెందిన సిద్ద (23)లు బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్టలో జరిగిన ఉరిదేవరకు వచ్చారు. అక్కడి నుంచి మంగళవారం రాత్రి అంబాపురం గ్రామంలో జరిగే జాతరకు బైక్‌లో వచ్చారు. రాత్రి 10.30 గంటలకు శ్రీధరఘట్టకు తిరుగు ప్రయాణం కాగా హెచ్చెల్సీ కాలువ వద్ద అదుపుతప్పి నేరుగా కాలువలోకి దూసుకెళ్లిపోయారు. సిద్ద ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకొన్నాడు. గాదిలింగ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. గాదిలింగ తండ్రి సుంకప్ప, బంధువులు, స్నేహితులు గాదిలింగ కోసం కాలువలో గాలించారు. పోలీసులు ఈతగాళ్లను కాలువలో దింపి వెతికినా జాడ దొరకలేదు.

21 నుంచి విజయ సంకల్ప అభియాన్



మాట్లాడుతున్న మురారిగౌడ తదితరులు

బళ్లారిటౌన్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 29 వరకు విజయ సంకల్ప అభియాన్ చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మురారిగౌడ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా విజయపుర జిల్లా సింధగిలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం బసవరాజ్ బొమ్మై, నేత యడియూరప్ప తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ అభియాన్ ద్వారా తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ఇంటింటికీ తెలియజేస్తున్నట్లు తెలిపారు. జనార్దనరెడ్డి స్థాపించిన కొత్త పార్టీతో తమ పార్టీకి నష్టమేం లేదన్నారు. తన తుదిశ్వాస వరకు తాను బీజేపీలోనే ఉంటానని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రెండు రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని వాజ్‌పేయి లేఔట్‌లో నిర్మించిన నూతన కార్యాలయానికి తరలిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు ఓబళేసు, హనుమంతప్ప, ఎర్రంగళి తిమ్మారెడ్డి, బీకే సుందర్, శివారెడ్డి, సుగుణమ్మ పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: కంప్లి ఉత్సవం సమీపిస్తున్నందున అన్ని రోడ్ల మరమ్మతు, అభివృద్ధి చేస్తామని, రూ.కోటి ఖర్చుతో బళ్లాపుర- నెల్లుడి రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే జేఎన్.గణేష్ తెలిపారు. బుధవారం ఆయన తాలూకాలోని హళే నెల్లుడిలో రూ.90 లక్షలతో కురుగోడు ప్రధాన రోడ్డు నుంచి హళే నెల్లుడి వరకు అభివృద్ధి పనులు, ఎమ్మిగనూరులోని కేపీఎస్ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ఓపీఎస్ ఏర్పాటుపై గళమెత్తుతానన్నారు. కంప్లిలో బస్ డిపో ఏర్పాటుతో పాటు తాలూకాకు ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని బస్సుల కేటాయింపునకు రవాణా శాఖ మంత్రి చొరవ చూపాలన్నారు. నెల్లుడి పంచాయతీ అధ్యక్షులు ఎల్.శ్రీనివాసులు, పీడీఓ బసప్ప, పన్ను వసూలు సిబ్బంది రాజాసాబ్ పాల్గొన్నారు.

లైసెన్స్ రెన్యువల్‌కు వేధింపులు



మాట్లాడుతున్న పాఠశాల చైర్‌పర్సన్ పద్మావతి

బళ్లారిటౌన్: 30 ఏళ్ల క్రితం తమ పాఠశాలను ప్రారంభించినా స్థానిక విద్యాశాఖ అధికారులు లంచాల కోసం వేధిస్తూ తనకు లైసెన్స్ రెన్యువల్ చేయడం లేదని గుగ్గరహట్టి సమీపంలోని గురుకుల పాఠశాల చైర్‌పర్సన్ పద్మావతి ఆరోపించారు. ఆమె బుధవారం పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. గత 2017-18 నుంచి తమ పాఠశాల లైసెన్స్ రెన్యువల్ కోసం కాలయాపన చేస్తూ చివరకు రికార్డులు మిస్ అయ్యాయని తూర్పు బ్లాక్ బీఈఓ చెప్పడంతో గత కొన్నేళ్లుగా తాము పదో తరగతి విద్యార్థులను తమ పాఠశాల నుంచి నేరుగా పరీక్షలకు కూర్చోబెట్టలేక పోతున్నామన్నారు. తమ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్య కల్పించాలనే ఆసక్తితో ఎలాంటి డొనేషన్, బిల్డింగ్ ఫండ్ లేకుండా తక్కువ ఫీజులతో ఇంతవరకు నడిపామన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ పాఠశాల తరపున పూర్తిగా నష్టాన్ని ఎదుర్కొన్నామన్నారు. తాము పాఠశాలను మూసివేసినా ఫర్వాలేదు, లంచం మాత్రం ఇవ్వబోమన్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా న్యాయం చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

కేఆర్‌పీపీతో బీజేపీకే నష్టం

• మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప



మాట్లాడుతున్న ఉగ్రప్ప తదితరులు

బళ్లారిటౌన్: గాలి జనార్దనరెడ్డి కొత్తగా ప్రారంభించిన కేఆర్‌పీపీ పార్టీ వల్ల బీజేపీకే నష్టం కాని కాంగ్రెస్‌కు కాదని ఆ పార్టీ మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప పేర్కొన్నారు. బుధవారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 150 స్థానాల్లో తమ పార్టీ సునాయాసంగా గెలుస్తుందన్నారు. పావగడ వద్ద తమ ప్రభుత్వ అవధిలో ప్రపంచంలోనే పేరొందిన, చరిత్రలో మిగిలి పోయేలా సోలార్ విద్యుత్ యూనిట్‌ను నిర్మించామన్నారు. దీనివల్ల రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. తమ పాలనలో చేపట్టిన పనులన్నీ శాశ్వతంగా నిలిచి ఉండేవేనని గుర్తు చేశారు. సమావేశంలో నేతలు తాయప్ప, సతీష్, సురేష్, విల్సన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మాబాబా ఆరాధనోత్సవం

కంప్లి: ప్రతి ఒక్కరూ నిరాకారి, నిర్వికారి, నిరహంకారి తత్వాలు కావాలంటే రాజయోగ శిక్షణ అవసరమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సంచాలకురాలు సకలేశ్వరి తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయ సంస్థాపకులు బ్రహ్మాబాబా 54వ ఆరాధనోత్సవంలో ఆమె మాట్లాడారు. రాజయోగ శిక్షణ కోసం బ్రహ్మాబాబా 150 దేశాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించి శాంతి, ఒత్తిడి రహిత మనస్సు నిర్వహణ, ప్రజల్లో సామరస్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. విద్యార్థులు అచ్చప్ప, శరణప్ప, ఎం.వెంకటస్వామి రెడ్డి, రామణ్ణలు పాల్గొన్నారు.

సమీక్షలకు డుమ్మా కొడితే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథస్వామి

సిరుగుప్ప: జయంతుల నిర్వహణపై సమీక్షా సమావేశాలకు తాలూకా అధికారులు డుమ్మాకొట్టి కింది స్థాయి సహాయక అధికారులు లేదా సిబ్బందిని పంపించి తప్పించుకోవడం సరికాదని, ప్రతి కార్యాలయంలో ప్రభుత్వం తరపున జయంతిని ఆచరించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్, జయంతి ఆచరణ, పండుగల సమితి అధ్యక్షుడు ఎస్.ఆర్.మంజునాథ స్వామి హెచ్చరించారు. ఆయన బుధవారం నగరంలోని టీపీ సభాంగణంలో ఏర్పాటు చేసిన వేమన జయంతి, అంబిగర చౌడయ్య జయంతులపై సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26న తాలూకా ఎమ్మెల్యే నేతృత్వంలో జరిగే గణరాజ్యోత్సవంలో తాలూకా అధికారులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. టీపీ ఈఓ ఎం.బసప్పతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

లేఔట్లలో సౌకర్యాలు కల్పించండి

రాయచూరు రూరల్ : నగరంలో పెరుగుతున్న లేఔట్లలో మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ఐడీఎస్ఎంటీలో నూతన ఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆర్డీఏ అధ్యక్షుడు తిమ్మప్ప నాడగౌడ ఏడు నెలల్లో రూ.10 కోట్లతో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. శాంత మల్ల శివాచార్య, అభినవ రాచోటి శివాచార్య, నిజానంద, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, నగరసభ అధ్యక్షురాలు లలిత, ఏపీఎంసీ అధ్యక్షుడు అచ్యుత్‌రెడ్డి, శంకర్ రెడ్డి, నరసారెడ్డి, రవీంద్ర జాలదార్, హరీష్ నాడగౌడలున్నారు.

అలరించిన యక్షగాన ప్రదర్శన

హుబ్లీ: హుబ్లీలోని సవాయి గంధర్వ హాల్‌లో ధర్మాంగియ దిగ్విజయ అనే యక్షగాన ప్రదర్శనను కామాక్షి మహిళా మండలి సభ్యులు వినూత్నంగా ప్రదర్శించారు. మహా భారతంలోని సన్నివేశాలను వేదికపై కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించి మహిళా కళాకారులు తమ ప్రతిభను చాటారు. అశోసిన నరసింహశాస్త్రి రచించిన ఈ యక్షగానంలో 9 మంది పాత్రదారులు అమోఘంగా నటించి అందరిని అలరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ మాట్లాడుతూ జానపద కళ యక్షగానాన్ని ఇటీవల కాలంలో మహిళలే స్వయంగా ప్రదర్శించడం విశేషమని ప్రశంసించారు.

కలుషిత నీటి సమస్యను అరికట్టండి

•నగరసభ అధికారిపై కౌన్సిలర్ల ధ్వజం



మాట్లాడుతున్న నగరసభ అధికారి రమేష్

హొసపేటె: నగరంలోని వార్డులకు మంచినీటి కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్న కలుషిత నీటి సమస్యను వెంటనే అరికట్టాలని వార్డు సభ్యులు ముక్త కంఠంతో అధికారి రమేష్‌పై ధ్వజమెత్తారు. బుధవారం నగరసభ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన విశేష సామాన్య సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాణిపేట 5వ వార్డులో మంచినీటిని తాగిన ఓ మహిళ మృతి చెందగా, మరో 50 మందికి పైగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారన్నారు. మంచినీటి పైప్‌లైన్‌లో యూజీడీ మురుగు నీరు చేరడంతో నీరు కలుషితం అయిందన్నారు. ఈ నీటిని తాగిన వార్డు ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి సమావేశంలో మంచినీరు కలుషితంపై చర్యలు చేపట్టాలని చెబుతున్నా ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నేడు ఈ ఘటన జరిగేందుకు కారణమైందని సభ్యులు తెలిపారు. ఈ విషయంపై అధికారి రమేష్ బదులిస్తూ యూజీడీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టిన గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల నీరు కలుషితం అయిందన్నారు. మురుగునీరు చేరుతున్న పైప్‌లైన్‌ను గుర్తించామని, కలుషిత నీటి సరఫరాని అరికట్టేందుకు యంత్రాంగం నడుం బిగించిందని తెలిపారు. నగరసభ అధ్యక్షుడు తారిహళ్లి జంబయ్య, వివిధ వార్డుల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

డా.రాజ్ ఆదర్శాలు అనుసరణీయం



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : డాక్టర్ రాజ్‌కుమార్ ఆదర్శాలు యువతకు మార్గదర్శనం అని డాక్టర్ రాజ్‌కుమార్ సేవా సమితి తాలూకా అధ్యక్షుడు స్వస్తిక్ శివు తెలిపారు. బుధవారం బంగారుపేటలోని మణికంఠ మినీ సభాంగణంలో నిర్వహించిన డాక్టర్ రాజ్‌కుమార్ క్యాలెండర్ విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నడ సినీ రంగంలో రాజ్‌కుమార్ అనితర సాధ్యం కాని సాధన చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్, పద్మ విభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులతో సత్కరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ డాక్టరేట్‌తో పాటు కర్ణాటక రత్న అవార్డును అందించిందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.దయానంద, కన్నడ సంఘం అధ్యక్షుడు పల్లవి మణి, పదాధికారులు మునిస్వామి, రాజుశెట్టి పాల్గొన్నారు.

యువ ఆరోగ్యాధికారి ఆత్మహత్య

మాలూరు : ప్రభుత్వ సముదాయ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఓ యువ అధికారి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మాస్తి ప్రభుత్వ వసతిగృహంలో జరిగింది. బెళగావి జిల్లా సవదత్తి తాలూకా ఇంచల గ్రామానికి చెందిన శివానంద జక్కణ్ణనవర్(24) అనే యువకుడు మాస్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాళగానహళ్లి గ్రామంలోని సముదాయ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యాధికారిగా గత 8 నెలలుగా పని చేస్తున్నాడు. ఈయన గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ వసతి గృహంలో నివాసం ఉంటున్నాడు. అయితే బుధవారం విధులు హాజరు కాలేదు. తాను నివాసం ఉంటున్న వసతి గృహంలోనే ఉరి వేసుకున్నాడు. మధ్యాహ్నం స్నేహితులు గదికి భోజనానికి వచ్చిన సమయంలో తలుపులు తెరచి ఉండడం గమనించి లోనికి వెళ్లి చూస్తే శివానంద ఉరి వేసుకున్న విషయం తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మాస్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. కాగా శివానంద ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

దళితుల సంక్షేమానికి పెద్దపీట

మైసూరు: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దూరదృష్టి ద్వారా సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ మంత్రంతో దళితులకు పెద్దపీట వేస్తోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి ఎ.నారాయణ స్వామి తెలిపారు. బుధవారం మైసూరులోని లలిత్ మహల్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో రాష్ట్రంలోని వివిధ శాఖలు దళిత ప్రజలకు మంచి సౌలభ్యాలు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈడ్చుకెళ్లిన కేసులో నిందితునికి కస్టడీ

బనశంకరి: బెంగళూరులో ఒక వ్యక్తిని స్కూటర్‌తో ఈడ్చుకెళ్లిన ఘటనలో నిందితుడు షాహిల్‌కు నగర 34వ ఎంసీఎంఎం కోర్టు కస్టడీ విధించింది. బుధవారం విజయనగర పోలీసులు అతన్ని కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల పాటు కస్టడీకి ఆదేశించారు. దీంతో పోలీసులు షాహిల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మరోవైపు ఈడ్చుకెళ్లడంతో గాయపడిన బొలెరో వాహనదారు ముత్తప్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

11న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శుక్లాక్ష పాలన్

కోలారు : జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార అధ్యక్షుడు శుక్లాక్ష పాలన్ తెలిపారు. బుధవారం నగరంలోని న్యాయవాదుల సంఘం సభాంగణంలో లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో ఉభయ కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొని తమ కేసులను రాజీ చేసుకుంటే డబ్బు, సమయం ఎంతో ఆదా అవుతుందన్నారు. సమావేశంలో న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీధర్, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్ హొసమని, ప్రొబెషనరి ఐఏఎస్ అధికారి వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చోటే సిద్ధరామయ్య పోటీ: డీకే శివకుమార్

సాక్షి,బళ్లారి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎల్పీ నేత సిద్ధరామయ్య ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని, ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయబోరని, కార్యకర్తల్లో ఎలాంటి గందరగోళం అవసరం లేదని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆయన బుధవారం బాగల్‌కోటెలో విలేకరులతో మాట్లాడారు. ఆయన ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఒకే దరఖాస్తు ఇచ్చారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజలు కూడా తమ వైపు ఉన్నారన్నారు. బీజేపీ పాలనపై విసిగిపోయిన జనం కాంగ్రెస్‌కు ఓటు వేస్తారన్నారు.

నా మాటలు బాధిస్తే క్షమించండి

లైంగిక కార్యకర్తల పట్ల తనకు అపార గౌరవం ఉందని, తన మాటలు వారిని బాధించి ఉంటే క్షమాపణలు కోరుతున్నానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీ.కే హరిప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం బాగల్‌కోటెలో విలేకరులతో మాట్లాడారు. హొసపేటెలో బీజేపీ ఎమ్మెల్యేల గురించి తాను మాట్లాడిన మాటల్లో లైంగిక కార్యకర్తలకు బాధ కలిగించి ఉంటే తనను క్షమించాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

• చిన్నారులకు గాలిపటం పోటీలు



గాలిపటాన్ని ఎగరవేస్తున్న ఎమ్మెల్యే నాగేంద్ర, ఎస్పీ

సాక్షి,బళ్లారి: తాను కూడా బాల్యంలో ఎంతో ఉత్సాహంగా గాలిపటం ఎగరవేసే పోటీల్లో పాల్గొనేవాడినని ఎమ్మెల్యే నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన బుధవారం బళ్లారి ఉత్సవాల్లో భాగంగా ముందుగా గాలిపటం ఎగరవేత పోటీలను జిల్లా క్రీడా మైదానంలో మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, ఎస్పీ రంజిత్ కుమార్ బండారి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, చిన్నారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బళ్లారి ఉత్సవాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలన్నారు. మొదటిసారి ఉత్సవాన్ని ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. మన సంస్కృతి వారసత్వాలను ఎన్నటికీ మరవకూడదన్నారు. ఈ పోటీలు చిన్నారుల్లో నూతనోత్సాహం నింపాయన్నారు. ఉపమేయర్ మాలాన్‌బీ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీ సస్పెండ్‌కు డిమాండ్

రాయచూరు రూరల్: జాయింట్ కలెక్టర్(జేసీ) రజనీకాంత్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు భానురాజ్ మాట్లాడారు. హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారిపై చర్యలు చేపట్టా లని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందించారు.

విమానంలో తల్లి పుట్టినరోజు

బనశంకరి: ఓ కానిస్టేబుల్ అమ్మ 63వ పుట్టినరోజును విమానంలో నిర్వహించి తల్లికి సంతోషం పంచాడు. బ్యాడగి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే హనుమంతప్ప సుంకద తల్లి పార్వతవ్వ పుట్టినరోజు కావడంతో తల్లిదండ్రులతో కలిసి బుధవారం హుబ్లీ నుంచి విమానంలో బెంగళూరుకు బయలుదేరారు. మధ్యలో విమానంలో 2 కేజీల కేక్‌ను తల్లి చేత కట్ చేయించి పుట్టినరోజు జరిపారు. సహ ప్రయాణికులు వారికి శుభాభినందనలు తెలిపారు.

దురలవాట్లకు బానిస కావద్దు

శ్రీనివాసపురం : విద్యార్థులు దురలవాట్లకు బానిస కావద్దని బీఆర్సీ కేసీ వసంత పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో వివిధ క్రీడల్లో పాల్గొనే విద్యార్థుల ఎంపికలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం ద్వారా జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అథ్లెటిక్ కోచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతియేటా ప్రతిభ ఆధారంగా క్రీడా శాలలకు, వసతి నిలయాలకు రాష్ట్రంలోని 35 జిల్లాల్లో ఈ ఎంపికను నిర్వహిస్తుందన్నారు. యువ సబలీకరణ, క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీఎం శశికళ, ఫుట్‌బాల్ కోచ్ నాసిర్ బాషా పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అవసరం

కేజీఎఫ్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని జైన్ కళాశాల ట్రస్టీ మహేంద్ర జైన్ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన ఆఖరి సంవత్సర డిగ్రీ విద్యార్థులకు ప్రమాణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవితంలో సంపాదించిన ఆస్తి కరిగి పోవచ్చు కానీ నేర్చుకున్న విద్య ఎన్నటికి తరిగి పోదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రేఖా సేథి మాట్లాడుతూ నిరంతర అధ్యయనంతోనే ఉత్తమ సాధన సాధ్యమన్నారు. ఇదే సమయంలో విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఆదేశాలను వెనక్కు తీసుకోండి

శ్రీనివాసపురం : మద్యం ఖరీదు చేసే వయో నిర్బంధాన్ని 21 నుంచి 18 ఏళ్లకు తగ్గిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం ముళబాగిలు తాలూకా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారి సుబ్రమణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ఆ ఆదేశాలను వెనక్కు తీసుకోకుంటే తీవ్ర ఆందోళన చేయాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు యలవళ్లి ప్రభాకర్, బంగారి మంజు పాల్గొన్నారు.

కనకభవన్‌కు రూ.లక్ష విరాళం

గంగావతి: తాలూకాలోని ముక్కుంపి గ్రామంలో కనక భవన్‌కు అవసరమైన స్థలం ఖరీదు కోసం మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కురుబ సమాజం వారు అనేక సంవత్సరాలుగా కనక భవనాన్ని నిర్మించాలని తలంచి నేడు ఓ స్థలాన్ని ఖరీదు చేస్తుండగా తన వంతుగా రూ.లక్ష విరాళాన్ని అందజేశానన్నారు. ఈ భవన నిర్మాణం కోసం కూడా తన వంతు సహకారం అందిస్తానని శ్రీనాథ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కురుబ సమాజ ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడిపోయిన భర్త

● కాపాడేందుకు వెళ్లిన భార్య కూడా మృతి

తుమకూరు: భర్తను రక్షించే క్రమంలో భార్య కూడా జల సమాధి అయ్యింది. తుమకూరు తాలూకా మాయసంద్ర హోబళి ముగళూరు గొల్లరహట్టిలో నివాసం ఉంటున్న జుంజేగౌడ (29), శివలింగమ్మ (25)లకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. దంపతులు తమ గేదెలు, గొర్రెలకు నీరు తాగించేందుకు బుధవారం చెరువు వద్దకు తీసుకెళ్లారు. ఈక్రమంలో జుంజేగౌడ కాలు జారి నీటిలో మునిగాడు. గమనించిన శివలింగమ్మ భర్తను రక్షించేందుకు నీటిలో దూకింది. చివరకు ఇద్దరూ మృత్యువాత పడ్డారు.

యువకుడి హత్య

సాక్షి బెంగళూరు: యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన హాసన్ జిల్లా ఆలూరు తాలూకాలో జరిగింది. భరత్ (27) అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా దుండగులు అడ్డుకొని కడుపు భాగంలో కత్తితో పొడిచి ఉడాయించారు. తీవ్ర రక్తస్రావంతో భరత్ అక్కడికక్కడే మరణించాడు. హంతకుల ఆచూకీ కోసం ఎస్పీ హరిరామ శంకర్ ప్రత్యేకంగా రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఆలూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

గస్తీలో పోలీసులపై దాడి

తుమకూరు: కుణిగల్ పట్టణంలో గస్తీ పోలీసులపై దాడి జరిగింది. కానిస్టేబుళ్లు మిథున్, సుమన్ మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో హౌసింగ్ కాలనీలో గస్తీ కాస్తున్నారు. స్టెల్లా మేరీ పాఠశాల రోడ్డులో మోదీకేర్ దుకాణం ఎదుట సెల్ఫీ తీసుకుంటుండగా గ్రామ లెక్కాధికారి వెంకటేశ్, రామచంద్రలు కానిస్టేబుళ్లపై దాడి చేశారు. పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని దాడికి పాల్పడిన ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

పట్టాలపై మహిళ మృతదేహం

మైసూరు: మైసూరు రైల్వే స్టేషన్, అశోకపురం రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై మహిళ మృతదేహం కనిపించింది. మైసూరు రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు కలిగిన ఆమె తెలుపు రంగు చీర ధరించినట్లు గుర్తించారు. వివరాలు తెలిసిన వారు మైసూరు రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ప్రజల్లోకి బీజేపీ వైఫల్యాలు

తుమకూరు: కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ల వైఫల్యాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ జి.పరమేశ్వర సూచించారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జిల్లాలో జరిగే ప్రజా ధ్వని బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మానవీయ విలువలతో బోధన

తుమకూరు: మానవీయ విలువలు నేర్పించేలా విద్యా బోధన ఉండాలని స్ఫటికపురి మహాసంస్థాన మఠాధీశుడు నంజావధూత స్వామీజీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శిరా తాలూకా పట్టనాయకనహళ్లి జాతర మహోత్సవం సందర్భంగా వస్తుప్రదర్శన వేదిక వద్ద విద్యా శాఖ ఏర్పాటు చేసిన విజ్ఞాన మేళాను స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు.

భక్తులకు ఉచిత బస్సు

కృష్ణరాజపురం: తమిళనాడులోని ఓం శక్తి దేవాలయానికి వెళ్తున్న భక్తులకు నగరాభివృద్ధి శాఖ మంత్రి బీఏ బసవరాజు దేవసంద్ర వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ ద్వారా ఉచిత బస్సు సదుపాయం కల్పించారు.

విషాహారం తిని గొర్రెలు మృతి

సాక్షి బెంగళూరు: విషపూరిత ఆహారం తిని 11 గొర్రెలు మరణించాయి. ఈ ఘటన హావేరి జిల్లాలో జరిగింది. జిల్లాలోని అజ్జయ్య దేవస్థానం వద్ద ఈ నెల 6,7,8వ తేదీల్లో కన్నడ సాహిత్య సమ్మేళనం జరిగింది. రొట్టెలు, అన్నం, చపాతీలు, ఇతర మిగిలిన పదార్థాలు అక్కడే వదిలేసి వెళ్లారు. ఒక వృద్ధురాలికి చెందిన గొర్రెలు పాడైపోయిన ఆ ఆహారాన్ని తిని మరణించాయి. ఘటనపై హావేరి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

చెరువులో అనుమానితుడి మృతదేహం లభ్యం


సాక్షి బెంగళూరు: విరాజపేట తాలూకా నాంగాల గ్రామంలో ఆదివారం జరిగిన ఆరతి (24) హత్య కేసులో అనుమానిత నిందితుడిగా ఉన్న తిమ్మయ్య కోసం గాలిస్తుండగా అతని మృతదేహం లభ్యమైంది. తిమ్మయ్యకు చెందిన హెల్మెట్, చెప్పులు, మొబైల్, మద్యం బాటిల్, విషం బాటిల్ ఆరతి హత్య జరిగిన స్థలం వద్ద చెరువు గట్టుపై లభించిన విషయం తెలిసిందే. చెరువులోని నీటిని ఖాళీ చేయగా మంగళవారం అర్ధరాత్రి తిమ్మయ్య మృతదేహం కనిపించింది. ఆరతి హత్యకు, తిమ్మయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఆర్ఏఎఫ్ బలగాల కవాతు



శివమొగ్గ: విధానసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో సున్నిత ప్రాంతాల్లో భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఆర్ఏఎఫ్ బలగాలు బుధవారం తుంగా నగర నుంచి కోటె పోలీసు స్టేషన్ వరకు కవాతు నిర్వహించాయి. ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండర్ నవీన్, శివమొగ్గ డీఎస్పీ బాలరాజ్ పాల్గొన్నారు.

ఒకనాటి మేకప్‌మ్యాన్ చోరీల బాట







పట్టుబడిన నవాజ్ షరీఫ్

● 25 ఏళ్లుగా దొంగతనాలే వృత్తి

బనశంకరి: గతంలో ఓ ప్రముఖ నటికి మేకప్‌మ్యాన్‌గా పనిచేసి, తరువాత దొంగగా మారాడు. తాళం వేసిన ఇళ్లను చూసుకుని లూటీ చేసే నవాజ్ షరీఫ్ (53)ను బుధవారం బేగూరు పోలీసులు అరెస్ట్‌చేశారు. అతడి వద్ద నుంచి 350 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

గతంలో అనేకసార్లు జైలుకు

చోరీలు చేయడం, పట్టుబడడం ఇతనికి కొత్త కాదు. సుమారు 25 ఏళ్లుగా నేరకార్యకలాపాల్లో భాగస్వామిగా ఉంటూ పలుమార్లు జైలుకెళ్లినప్పటికీ ప్రతిసారి జామీను తీసుకుని బయటికి వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడేవాడు. బేగూరుతో పాటు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 27 చోరీ కేసులు ఇతనిపై ఉన్నాయి. గత ఆరునెలల క్రితం కామాక్షీపాళ్య పోలీసులు చోరీకేసులో నవాజ్‌షరీఫ్‌ను అరెస్టుచేసి జైలుకు పంపించారు. రెండు నెలలక్రితం బెయిల్‌పై బయటికి వచ్చిన నవాజ్‌షరీఫ్ మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. దొంగసొత్తును అమ్మి ఆ డబ్బుతో పేకాట, మద్యంతో మజా చేసేవాడు. పోలీసుల దర్యాప్తులో 25 ఏళ్ల క్రితం కన్నడనటి మాలాశ్రీకి మేకప్‌మ్యాన్‌గా పనిచేశాడని తెలిసింది. అయితే ఆ ఆదాయం సరిపోక మేకప్‌మ్యాన్ వృత్తిని వదిలేసి నేరాల వైపు వెళ్లాడు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

● ప్రేమ వ్యవహారమే కారణం

కృష్ణరాజపురం: హొసకోటెలోని చెరువులో ఈ నెల 6వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. 30 ఏళ్ల వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ఇక్కడ చెరువులో పడేశారని పోలీసులు గంటల్లో కనుగొన్నారు. హతుడు నందిని లేఔట్‌కు చెందిన గోపాల అనే వ్యక్తిగా గుర్తించారు. జనవరి 1న బయటకు వెళ్లిన గోపాల ఆ తర్వాత ఆరేడు రోజులు అయినప్పటికీ ఇంటికి రాలేదు. ఇదే సమయంలో అవలహళ్లి పోలీసులు ఒక గుర్తు తెలియని శవాన్ని చెరువులో గుర్తించారు. ఎడమ చేతిపై అమ్మ, సార అని, కుడి చేతిపై యశు అని పచ్చబొట్లు ఉన్నాయి. అలాగే వేళ్లపై రాధే అనే పేరుంది. ఈ హత్య వెనుక ప్రేమ వ్యవహారం ఉన్నట్లు అనుమానించారు. ఈ కేసులో నిందితుడు మునియాగా దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. గత నాలుగేళ్లుగా గోపాల ప్రేమించిన యువతినే మునియా కూడా ప్రేమిస్తున్నాడు. యువతి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. జనవరి 1న పనికి వెళ్లిన గోపాలను మునియా, అతని మిత్రులు పార్టీ ఉందని తీసుకెళ్లారు. రాత్రి బాగా తాగించి మునియా, మరో ముగ్గురితో కలిసి మారణాయుధాలతో గోపాలను హత్య చేశారు. మృతదేహాన్ని హొసకోటె చెరువులో పడేసి వెళ్లి పోయారు. మునియాతో పాటు అతని ముగ్గురు స్నేహితులను ఆవలహళ్లి పోలీసులు అరెస్టు చేశారు.

జైల్లో జన్మదినం... ఐదు మందిపై కేసు

యశవంతపుర: రామనగర జిల్లా జైల్లో జన్మదినం ఆచరించిన ఐదుమంది ఖైదీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ కిరణ్ అలియాస్ తమట జన్మదినం సందర్భంగా కారాగారంలో కేక్ కట్ చేశారు. ఆ దృశ్యాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. ఇది వైరల్ కావడంతో రామనగర ఎస్పీ సంతోష్‌బాబు బుధవారం జైలును సందర్శించారు. రౌడీషీటర్ కిరణ్‌తోసహా ఐదు మందిపై కేసు నమోదు చేశారు. జైలులోకి కేక్ ఎవరు తీసుకెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

రోడ్డెక్కిన కాంట్రాక్టర్లు

శివాజీనగర: బకాయిపడ్డ రూ.25 వేల కోట్లు విడుదల చేయడంతోపాటు వివిధ డిమాండ్ల సాధనకు కాంట్రాక్టర్లు రోడ్డెక్కారు. రాష్ట్రమంతటా పనులను స్తంభింపజేసిన కాంట్రాక్టర్లు ఫ్రీడం పార్క్ మైదానంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు డీ.కెంపణ్ణ, ప్రధాన కార్యదర్శి జీ.ఎం.రవీంద్ర, కార్యాధ్యక్షుడు ఆర్.మంజునాథ్ మాట్లాడుతూ బకాయిల విడుదలతోపాటు జీఎస్టీ వివాదం, ఇతర తమ డిమాండ్ల పరిష్కారంపై ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులకు గతంలో వందలాది లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. తమ పోరాటానికి స్పందించకపోతే రాష్ట్రమంతటా జిల్లా కేంద్రాలు, తాలూకా కేంద్రాల్లోనూ ధర్నాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

అధికారంలోకి వస్తే కృషిబంధు పథకం : కుమార

గౌరిబిదనూరు: వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణ తరహాలో కృషిబంధు పథకం అమలు చేస్తామని మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలోని దుర్గాగ్రాండ్ సభాభవనంలో ఆన్‌లైన్ ద్వారా రైతులతో మాట్లాడారు. రైతులు ఆర్థికంగా బలోపేతం చేయాలన్నది తమ పార్టీ విధానమన్నారు. పర్యావరణ రక్షకుడు చౌడప్ప మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్లాపురం జిల్లాలకు కృష్ణ మిగులు జలాలు అందించాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు.

మానవత్వం చాటిన భజరంగదళ్ కార్యకర్తలు



తుమకూరు: అనాథ మహిళకు భజరంగదళ్ కార్యకర్తలు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. తుమకూరు తాలూకా గొల్లహళ్లి జనతా కాలనీకి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో మరణించింది. ఆమె సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో భజరంగదళ కార్యకర్తలు వెళ్లి హిందూ ధార్మిక విధి విధానాల్లో అంత్యక్రియలు చేపట్టారు.

బీఈవో డ్రైవర్‌పై కేసు

తుమకూరు: కుల దూషణపై బీఈఓ జీపు డ్రైవర్ దేవరాజుపై తుమకూరు నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. తుమకూరు తాలూకా బీఈవో కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన ఉపాధ్యాయుడు పద్మరాజ్‌ను దేవరాజు కులం పేరిట దూషించాడు. పద్మరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దేవరాజ్‌పై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో జేబుదొంగల చేతివాటం

యశవంతపుర: ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. దావణగెరె జిల్లా జగళూరులో బుధవారం ఎమ్మెల్యే ఎస్‌వీ రామచంద్రప్ప జన్మదిన వేడుకలు జరిగాయి. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈక్రమంలో సంతోష్ జేబులో రూ.50 వేలు, పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు విశాలాక్షి భర్త ఓబలేశ్ జేబులో రూ.50 వేలు చోరీకి గురయ్యాయి. దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్న దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డు అయ్యాయి.

బిడ్డలకు పురుగుల మందు తాపి తల్లి ఆత్మహత్య

యశవంతపుర: కుటుంబ కలహాలు నిండుకుటుంబాన్ని బలి తీసుకున్నాయి. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి అనంతరం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన బీదర్ జిల్లా భాల్కి తాలూకా నీలమ్మనహళ్లి తండాలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మీరాబాయి(25)కి నచ్చుబాయి(3), గోలుబాయి(2) అనే చిన్నారులు ఉన్నారు. కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో బుధవారం వేకువజామున ఇద్దరు పిల్లలకు పురుగుల మందు తాపింది. అనంతరం ఆమె కూడా మందు తాగింది. ఉదయం పక్కింటి వారు గమనించగా ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు. భాల్కి గ్రామాంతర పోలీసులు వచ్చి మృతదేహాలను ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కార్ల దొంగ పట్టివేత

కృష్ణరాజపురం: కార్లను దొంగతనం చేసి నంబర్ ప్లేట్లను మార్చి అమ్మే దొంగను పులకేశి నగర పోలీసులు అరెస్టు చేశారు. మహమ్మద్ ఫైరోజ్ అనే నిందితుడి వద్ద నుంచి రూ. 20 లక్షల విలువైన రెండు కార్లు, మినీ టెంపోను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల కార్లను దొంగతనం చేసి నంబర్ ప్లేట్లను మార్చి వాటిని మరో రాష్ట్రంలో విక్రయించేవాడు. ఇటీవల వసంత్ అనే వ్యక్తికి చెందిన ఇన్నోవా క్రిస్టా కారును దొంగిలించి దాన్ని ఇతరులకు విక్రయించాడు. ఈ విషయంపై పులకేశీ నగర పోలీసు స్టేషన్‌లో వసంత్ కుమార్ ఫిర్యాదు చేశారు. నిందితున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

సీఎంచే సన్మానం



అచ్యుత్‌గౌడ్‌కు మెమెంటో అందిస్తున్న సీఎం బొమ్మై

బనశంకరి: బెంగళూరు జేపీనగర ఆర్‌వీ డెంటల్ కాలేజీలో బుధవారం నిర్వహించిన యువ సంభాషణ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురిని సన్మానించారు. పారిశ్రామిక రంగంలో సేవలకు ఫెడిలిటిస్ కార్ప్స్ సంస్థాపకుడు అచ్యుత్‌గౌడకు సీఎం బసవరాజ బొమ్మై మొమెంటోను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ పురస్కారగ్రహీత పంకజ్‌అద్వాని, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏనుగుల మంద హల్‌చల్



శ్యానమావు అటవీ ప్రాంతంలో ఏనుగుల మంద సంచారం

హోసూరు: హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతంలో 40 ఏనుగుల మంద స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. కొన్ని వారాల కిందట బెంగళూరు బన్నేరుఘట్ట నుంచి వలస వచ్చిన వందకు పైగా ఏనుగులు గుంపులు, గుంపులుగా విడిపోయి జవళగిరి, డెంకణీకోట, బేవనత్తం, అయ్యూరు తదితర అటవీ ప్రాంతాల్లో మకాం వేసి రైతుల పంటలను తొక్కి ధ్వంసం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి 40 ఏనుగుల మంద శ్యానమావు అటవీ ప్రాంతానికి వచ్చింది. పోడూరు, ఆళియాళం, రామాపురం, పాతకోట తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతులు పండిస్తున్న పంటలను తొక్కి ధ్వంసం చేస్తున్నాయి. అటవీశాఖాధికార్లు శ్యానమావు అటవీ ప్రాంతానికి చేరుకొని ఏనుగుల సంచారంపై నిఘా పెట్టారు. అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రైతులు, పశువుల కాపర్లు రాత్రివేళ అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

హోసూరు వార్తలు..

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైసూరు: మైసూరు రైల్వే స్టేషన్ సెక్టార్ 3 వద్ద సుమారు 60–65 ఏళ్ల వ్యక్తి అస్వస్థతకు గురై కుప్పకూలాడు. అతన్ని కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. సదరు వ్యక్తి వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని మైసూరు రైల్వే పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

హోసూరు: మద్యం అలవాటును మానుకోమన్నందుకు యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు తాలూకా బాగలూరు ప్రాంతానికి చెందిన కూలికార్మికుడు ఆనంద్ (26). ఇతనికి తాగుడు అలవాటుండేది. మంగళవారం మద్యం తాగి ఇంటికెళ్లిన ఇతన్ని తల్లిదండ్రులు దండించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆనంద్ పురుగుల మందు తాగడంతో ప్రాణాలు పోయాయి. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేరికె పోలీసులు మంగళవారం సాయంత్రం బేరికె– తీర్థం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక బైకిస్టును అడ్డగించి తనిఖీ చేయగా గోనె సంచిలో గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు బేరికె సమీపంలోని అత్తిముగం గ్రామానికి చెందిన రాజగోపాల్(62)ను అరెస్టు చేశారు.

బాలికల సంక్షేమానికి ప్రతిజ్ఞ



కలెక్టర్ కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

హోసూరు: సామాజిక సంక్షేమ శాఖ, మహిళా హక్కుల చట్టం ద్వారా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్త్రీ విద్యను ప్రోత్సహిస్తాం అని జిల్లా కలెక్టర్ జయచంద్రభాను రెడ్డి కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ, శిశు హత్యలను నిర్మూలించాలని, స్త్రీలను విద్యావంతులను చేయాలని, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని, మహిళలకు ఎదురైయ్యే సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వేడియప్పన్, విజయలక్ష్మి, కుమరేషన్, యువరాజ్, భాగ్యలక్ష్మి, శివగామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో మరణించింది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని పనందోప్పు గ్రామానికి చెందిన చిత్ర (35). గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. స్వస్థత కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మంగళవారం రాత్రి మృతి చెందింది. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

యశవంతపుర: రహదారులు రక్తమోడాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఓ ఇంజినీర్, ఇద్దరు విద్యార్థుల సహా ఐదుగురు దుర్మరణం చెందారు. గదగ్ జిల్లా రోణ తాలూకా బాదామి రోడ్డులో బుధవారం వేకువజామున ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ రోడ్డు పక్కన కాలువలో పడింది. బైక్‌లో ప్రయాణిస్తున్న అమరేగౌడ బసనగౌడ(30), ముత్తప్ప జాళిహాళ్(27) మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. రోణ పోలీసులు మృతదేహాలను రోణ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు

కళాశాలకు వెళ్తుండగా ఇద్దరు విద్యార్థులు..

ఉడుపి జాతీయ రహదారి 66లో బ్రహ్మవర మంజునాథ్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాలిగ్రామానికి చెందిన సుమిత్‌కుమార్ ఎంజీ(19), వాగీశ్ కెద్లాయ(19) అనే విద్యార్థులు మృతి చెందారు. వీరు బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది.

లారీ ఢీకొని ఇంజినీర్...

బనశంకరి: నరేగా ఇంజినీర్ దుర్మరణం చెందిన ఘటన దావణగెరె విద్యానగర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దావణగెరె తాలూకా హొసనాయకనహళ్లి గ్రామానికి చెందిన మిథున్(34) జగళూరు తాలూకాలో నరేగా ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.బుధవారం స్నేహితుడి వివాహానికి హాజరై బైకులో ఇంటికి వెళ్తుండగా దావణగెరె జాతీయ రహదారి 45లో లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో మిథున్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రేమోన్మాది ఘాతుకం

● ప్రేమించాలని డిగ్రీ విద్యార్థినికి వేధింపులు
● నిరాకరించడంతో గొంతు కోసి హత్య

బనశంకరి: ప్రేమించాలని యువతిని వేధించి చివరకు ఆమె గొంతు కోసి హత్య చేశాడు ఓ ప్రేమోన్మాది. యలహంక పరిధిలోని దిబ్బూరులో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన శానుబోగనహళ్లి రాశి(19) డిగ్రీకాలేజీలో బీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడేళ్లక్రితం తోట పనులకు వెళ్లే సమయంలో టెంపో డ్రైవర్ మధుచంద్ర పరిచయం అయ్యాడు. తనను ప్రేమించాలని వెంటపడేవాడు. మధుచంద్రకు అప్పటికే వివాహమైందని తెలిసి అతన్ని దూరం పెట్టింది. మంగళవారం సాయంత్రం రాశి తోటపనికి వెళ్తుండగా మధుచంద్ర అడ్డుకొని కత్తితో గొంతు కోసి ఉడాయించాడు. బాధితురాలు తీవ్ర గాయాలతో మృతి చెందింది. రాజానుకుంటెపోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.



నిందితుడు మధుచంద్ర

హత్య చేస్తానని నెల రోజుల క్రితమే హెచ్చరికలు

వెంకటాచలయ్య సుశీలమ్మ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. రాశి చిన్నకుమార్తె. తండ్రి వెంకటాచలయ్య మృతితో కుటుంబ బాధ్యతలను రాశి నెత్తినవేసుకుంది. పీయూసీ చదువుతూనే తోటపనులకు వెళ్లి కుటుంబానికి ఆసరాగా ఉండేది. డిగ్రీ పూర్తిచేసి కుటుంబానికి మరింత అండగా ఉండాలనే ఆశయంతో ఉండేది. ఒకటిన్నర నెల క్రితం మధుచంద్ర రాశి ఇంటికి వచ్చి హత్యచేస్తానని బెదిరించాడని, ఇంత ఘాతుకానికి పాల్పడుతాడని ఊహించలేకపోయామని మృతురాలి చిన్నాన్న నారాయణప్ప వాపోయాడు.

కంప్రెసర్ పేలి కార్మికుడి మృతి

యశవంతపుర: ఎయిర్ కంప్రెసర్ పేలి కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా ఉప్పినంగడిలోని గాంధీ పార్క్ సమీపంలో టైర్ పంఛర్ దుకాణం ఉంది. బుధవారం ఉదయం దుకాణంలోని ఎయిర్ కంప్రెసర్ పేలడంతో అక్కడ పని చేస్తున్న అలంకారుకు చెందిన రాజేశ్‌పూజారి(43) మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహేతర సంబంధంతోనే హత్య

యశవంతపుర: విశ్వేశ్వరయ్య లేఔట్‌లో ఈ నెల 16న చోటు చేసుకున్న సతీశ్ అనే వ్యక్తి హత్యోదంతాన్ని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధంతో హత్య జరిగినట్లు తేల్చారు. ఈమేరకు వెంకటేశ్ అనే నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలు.. హతుడు సతీష్... వెంకటేశ్ చెల్లెలితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల సతీశ్‌తో ఆమె గొడవ పడింది. నా వద్దకు రావద్దని హెచ్చరించింది. అయినప్పటికీ పద్ధతి మార్చుకోలేదు. దీంతో వెంకటేశ్ కెంగేరి ఉపనగర వద్దకు సతీశ్‌ను పిలిపించాడు. విశ్వేశ్వరయ్య లేఔట్ సమీపంలోకి తీసుకెళ్లి నా చెల్లి సంసారంలో రాళ్లు వేయవద్దని బుద్ధి మాటలు చెప్పాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంలో ఉన్న వెంకటేశ్ ఆటోలో ఉన్న గొడుగుతో సతీశ్‌ను పొడిచి హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

మిన్నంటిన రైతుల నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు



ఆందోళనకారులతో చర్చిస్తున్న అధికారులు

● సిఫ్‌కాట్–5పై ఆగ్రహం

క్రిష్ణగిరి: ఉద్దనపల్లి దగ్గర 5వ సిఫ్‌కాట్ ఏర్పాటుకు 3,800 ఎకరాల భూమిని సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత రైతులు, ప్రజలు గత 14 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తమ భూములను, స్థలాలను లాక్కోవద్దని కోరుతున్నారు. సంక్రాంతి పండుగను కూడా బహిష్కరించారు. ఉద్దనపల్లి సమీపంలోని ఉద్దనపల్లి, అయర్నపల్లి, నాగమంగలం పంచాయతీల్లో పరిశ్రమల ఏర్పాటుకు 3,800 ఎకరాల భూమిని సేకరిస్తామని ప్రభుత్వం రైతులకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం కొంతమంది రైతులు ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోని సెల్‌ఫోన్ టవర్‌పై ఎక్కి నల్లజెండాలతో ఆందోళన చేపట్టారు. ఎంపీ సెల్లకుమార్ ఆందోళనకారులకు మద్దతు తెలుపుతూ వారితోపాటు రోడ్డుపై బైఠాయించారు. జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య, డీఎస్పీ మురళి, సూళగిరి తహసీల్దార్ అనిత, పోలీసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించినా ధర్నా వీడలేదు. రైతు సంఘ నాయకులు, రైతులు , స్థానిక ప్రజలు ఆందోళన కొనసాగిస్తున్నారు. హోసూరు–రాయకోట మధ్య వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

లారీ చక్రాల కింద నలిగి మృతి

హోసూరు: మద్యం మత్తులో లారీ కింద నిద్రిస్తున్న కూలి కార్మికున్ని గమనించక డ్రైవర్ లారీని నడపడంతో మృతి చెందిన ఘటన ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ఉద్దనపల్లి సమీపంలోని అగరం గ్రామానికి చెందిన వడివేల్ కొడుకు సూర్య (20) కూలిపనులు చేస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో అగరం మురుగన్ ఆలయం వద్ద నిలిపి ఉన్న లారీ కింద నిద్రపోయాడు. అది గమనించక స్థానిక లారీ డ్రైవర్ కార్తీక్ లారీని నడపడంతో చక్రం కింద నలిగి మరణించాడు. ఈ ఘటనపై ఉద్దనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రత్యంగిరా దేవికి విశేష పూజలు



ఆవును ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లిలో వెలసిన అధర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా బుధవారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గ్రామదేవత అమ్మవారిని విశేషంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. పశువులను అలంకరించి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. పశువులపై నాణేలు, నోట్లను చల్లారు. ఆ నాణేలను, నోట్లను ఇళ్లకు తీసుకెళ్లితే మంచి జరుగుతుందని నమ్మకం. భక్తులు పోటీలు పడి నోట్ల, నాణేలను ఏరుకున్నారు.

ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్

బనశంకరి: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యలహంక బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ ముందస్తు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బుధవారం రాజానుకుంటె పటాలమ్మ ఆలయంలో కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రచారరథంలో రాజానుకుంటె, అరికెరె పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులే తనను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతుసేవాసహకార బ్యాంకు అధ్యక్షురాలు వాణిశ్రీవిశ్వనాథ్, అలోక్‌విశ్వనాథ్, బీజేపీ నేతలు జయన్న, వెంకటేశ్, వై.రామిరెడ్డి, ఎస్ఎస్.రాజన్న, ఎం.కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి,రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

యశవంతపుర: హైటెన్షన్ వైర్లు బాలుడిని బలిగొన్నాయి. ఆర్‌టీనగరలోని చాముండినగర సమీపంలోని చింగమ్ ఫ్యాక్టరీ వద్ద ఈ ఘటన జరిగింది. ఇక్కడ హైటెన్షన్ వైర్లు ఇంటి మిద్దెలపై వెళ్లాయి. ఈక్రమంలో అబూబకర్(11) అనే బాలుడు సోమవారం గాలిపటం ఎగురవేస్తుండగా దారం వైర్లకు తగిలింది. దారాన్ని తీసుకొనే క్రమంలో వైర్లు తగిలి బాలుడు గాయపడ్డాడు. విక్టోరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాగా ఈ ప్రాంతంలో గతంలో ఇదే వైర్లకు నలుగురు చిన్నారులు మృతి చెందారని స్థానికులు తెలిపారు.



తూర్పు గోదావరి జిల్లా గౌరిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 32వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

గడప గడపకు మన ప్రభుత్వం



వైఎస్సార్ జిల్లా ముతుకూరులో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



తిరుపతి సుభాష్‌నగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష తదితరులు

బోగస్ ఓట్లతోనే బాబు గెలుపు

- ఇప్పటికీ లెక్క తేలని 36 వేల ఓట్లు
- కుప్పంలో బోగస్ ఓట్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ మిథున్‌రెడ్డి



కుప్పం(చిత్తూరు జిల్లా): మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న కుప్పం నియోజకవర్గంలోని బోగస్ ఓట్లతోనే చంద్రబాబు గెలుస్తున్నారని రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కుప్పం ప్రాంత వాసులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న సంబంధాలతో బోగస్ ఓట్లు అధికంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో రెండు లక్షల పైచిలుకు ఓట్లుండగా, ప్రభుత్వం సంక్షేమ పథకాలు, వివిధ రకాలుగా ఆధార్ కార్డులతో లింక్ అయిన వారు 1.83 లక్షల మంది ఓటర్లే ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 17 శాతం అంటే.. ఇంకా 36 వేల ఓటర్లను గుర్తించడం కష్టంగా మారిందని, ఈ ఓటర్లు ఎక్కడి వారో, ఎక్కడ ఉన్నారో తేల్చలేకపోతున్నారని చెప్పారు. రామకుప్పం మండలం విజలాపురంలో కుమార్ అనే వ్యక్తికి విజలాపురంలో ఓటు హక్కు ఉందని, ఇతను పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రం వాణియంబాడిలోనూ ఓటు వినియోగించుకుంటున్నాడని మిథున్‌రెడ్డి చెప్పారు. కంగుంది గ్రామానికి చెందిన అమ్మణ్ణమ్మ కంగుందిలో, పక్కనే ఉన్న విజలాపురం పంచాయతీలోనూ ఓటు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి బోగస్ ఓట్లతో చంద్రబాబు ఏళ్ల తరబడిగా కుప్పంలో గెలుస్తున్నారని.. కుప్పంలోని బోగస్ ఓట్లపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్ తదితరులున్నారు.

చంద్రబాబు ఆపడంతోనే ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేకపోయా

టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు(కర్నూలు): టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఆపటం వల్లే ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేకపోయానని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి వర్గీయులు వేర్వేరుగా నిర్వహించడం పార్టీలోని విభేదాలను బయటపెట్టాయి.

బాబు.. దావోస్.. అబద్ధపు రాతలు

గత ప్రభుత్వ హయాంలో దావోస్ పర్యటనకు రూ.50.43 కోట్లు వ్యయం

- వాస్తవరూపం దాల్చని ఒక్క రూపాయి పెట్టుబడి
- అయినా బాబు దావోస్ పర్యటనతో పెట్టుబడుల వెల్లువంటూ అసత్య ప్రచారం
- 2022లో సీఎం జగన్ దావోస్ పర్యటన వ్యయం రూ.12.90 కోట్లు
- రూ.1.26 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: ఒక తప్పు చేసి అడ్డంగా దొరికిపోతే.. వెంటనే అటువంటి తప్పు మరోసారి చేయడానికి ఎవరూ సాహసించరు. కానీ, పచ్చ పత్రికలు చేస్తాయి. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై అవి రాస్తున్న విషపు రాతలే ఇందుకు నిదర్శనం. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఆహ్వానం రాలేదంటూ పచ్చ మీడియా అబద్ధపు ప్రచారం చేసింది. అయితే, ఆ సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆహ్వానిస్తూ నవంబర్ 25నే లేఖ వచ్చిందన్న విషయం సాక్ష్యాధారాలతో బట్టబయలు కావడంతో కంగుతిన్న ఆ మీడియా మరో తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దావోస్ పర్యటన ద్వారా లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. ఇది కూడా శుద్ధ తప్పు అని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. 2016 నుంచి 2019 మధ్య చంద్రబాబు దావోస్ పర్యటనకు రూ.50.43 కోట్లు ఖర్చు చేయగా కనీసం ఆ మొత్తం కూడా పెట్టుబడిగా రాలేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. 2018లో ఆర్‌టీజీఎస్‌లో ఈ గవర్నెన్స్ అమలుకు సంబంధించి హిటాచీ ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పందం అమల్లోకి రాలేదు. అలాగే సిస్టర్ కాంటన్ ఆఫ్ జురిచ్‌తో కుదుర్చుకున్న సిస్టర్ సిటీ ఒప్పందం కూడా వాస్తవ రూపం దాల్చలేదు. 2019లో ఫిన్‌టెక్ ఎకో సిస్టమ్ గురించి సీఐఐతో, హిటాచీతో ఏపీఈడీబీ కుదుర్చుకున్న ఒప్పందాలు, ఏఎంటీజెడ్‌లో టెక్నాలజీ సేవలు అందించే యూరో ఫైనాన్స్ ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. అంటే చంద్రబాబు దావోస్ పర్యటనల వల్ల ఒక్క రూపాయి పెట్టుబడి కూడా వాస్తవ రూపం దాల్చలేదన్నది స్పష్టమవుతోంది.

రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడులు

కోవిడ్ కారణంగా తొలి రెండు సంవత్సరాలు దావోస్ పర్యటనకు వెళ్లలేకపోయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2022లో తొలిసారి ఆ సమావేశాలకు హాజరయ్యారు. ఈ పర్యటన కోసం రూ.12.90 కోట్లు ఖర్చయింది. అక్కడ గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.1.26 లక్షల కోట్ల విలువైన నాలుగు పెట్టుబడుల ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. అదానీ గ్రీన్ ఎనర్జీ, అరబిందో రియల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్‌కో గ్రూపు, ఏస్ అర్బన్ డెవలపర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలు అమలు దశలో ఉన్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇది వాస్తవం. ఇవేవీ పట్టని ఆ పత్రికలు నిత్యం ఉషోదయంతో విషం చిమ్ముతూనే ఉన్నాయి.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ప్యానల్ సభ్యులు

- అధ్యక్ష, కార్యదర్శులుగా బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి
- విజయవాడ ఎన్జీవో హోమ్‌లో ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం విజయవాడ ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. ముందుగా రాష్ట్ర కార్యవర్గానికి అధ్యక్ష, కార్యదర్శులుగా బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ప్యానల్ అభ్యర్థులు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులతో కలిసి ఏలూరు రోడ్డు పాత బస్టాండ్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఎన్జీవో హోమ్‌కు చేరుకుని.. ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కార్యవర్గంలో ఒక్కో పదవికి ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ఎన్నికల అధికారి జి.రామకృష్ణారెడ్డి ప్రకటించారు.

నూతన కార్యవర్గం..

ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీ శివారెడ్డి, సహాధ్యక్షులుగా సీహెచ్ పురుషోత్తం నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.జగదీశ్వరరావు, కోశాధికారిగా ఎ.రంగారావు, ఉపాధ్యక్షులుగా డీవీ రమణ, వై.ప్రసాద్, పి.శ్రీనివాస్, వి.దస్తగిరిరెడ్డి, జె.మాధవ్, ఎ.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసులు, ఎస్‌కే నాగూర్ షరీఫ్, ప్రచార కార్యదర్శిగా బి.జానకి, కార్యదర్శులుగా వి.సుబ్బారెడ్డి, ఎస్‌బీవీ రాంప్రసాద్, రంజిత్‌కుమార్‌నాయుడు, ఎంవీ కృష్ణారెడ్డి, పి.శివప్రసాద్, మహిళా కార్యదర్శిగా పి.తులశీరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జింఖానా మైదానంలో జరిగిన సభలో అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

వలంటీర్లపై రామోజీ విషపు రాతలు

బాబు పాలనలో జన్మభూమి కమిటీల దోపిడీ కనిపించలేదా?

- నిత్యం ఎల్లో మీడియాలో విషపు రాతలు
- ఈనాడు, రామోజీరావుపై మంత్రి వేణు ఫైర్



సాక్షి, రాజమహేంద్రవరం: నిస్వార్థ సేవకులైన గ్రామ, వార్డు వలంటీర్లపై ఈనాడు రామోజీరావు విషపు రాతలు రాస్తున్నారని సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల దోపిడీ రామోజీ కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు. పింఛన్లు, ఇళ్ల మంజూరు హక్కును జన్మభూమి కమిటీలకు ఇచ్చారని, ఆ మేరకు జీవోలు కూడా జారీ చేశారని గుర్తు చేశారు. 'అప్పట్లో ప్రతి పథకానికీ రేటు పెట్టిమరీ వసూళ్లకు పాల్పడ్డారని, అవేమీ మీ కళ్లకు కనిపించలేదా రామోజీ. నిస్వార్థ సేవకులైన వలంటీర్లపై అంత అక్కసు ఎందుకు వెళ్లగక్కుతున్నారు' అని ప్రశ్నించారు. చంద్రబాబును జాకీలతో ఎత్తేందుకు ఈనాడు, రామోజీ ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ ఆశ నెరవేరదని తేల్చి చెప్పారు.

వారిపై ఎందుకంత అక్కసు

'ఈనాడులో వలంటీర్లపై విషం చిమ్ముతూ కథనం రాశారు. వలంటీర్లు అంత నిస్వార్థంగా పని చేస్తుంటే.. రామోజీరావుకు ఎందుకంత అక్కసు. పెన్షన్ లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత జన్మభూమి కమిటీలకు అప్పగిస్తూ చంద్రబాబు ప్రభుత్వం 2017 సెప్టెంబర్ 17న జీవో 135 జారీ చేస్తే రామోజీకి అది కనిపించలేదా. అది తప్పనిపించలేదా. హౌసింగ్ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత కూడా జన్మభూమి కమిటీలకు ఇస్తూ జీవో 36 జారీ చేశారు. అవేవీ రామోజీరావుకు తప్పుగా కనిపించలేదు. ఆ కమిటీలు ఎంత అవినీతికి పాల్పడినా పట్టించుకోలేదు' అని వేణు ధ్వజమెత్తారు. నిజం చెప్పాలంటే వలంటీర్లు నిరుపేదల పాలిట దేవుళ్ల మాదిరిగా ఉన్నారన్నారు.

డోర్ డెలివరీపై ఏనాడైనా రాశారా

ప్రతినెలా కచ్చితంగా 1వ తేదీన ఆదివారం అయినా.. సెలవు రోజైనా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను లబ్ధిదారుల చేతిలో పెడుతున్న విషయాన్ని మంత్రి వేణు గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇంత గొప్ప కార్యక్రమం జరుగుతుంటే.. ఒక్క రోజైనా రాశారా అని నిలదీశారు. అలాంటివి రాయరని, ఎందుకంటే రామోజీకి కావాల్సిన వ్యక్తి సీఎం పదవిలో లేరని ఎద్దేవా చేశారు. వలంటీర్లు జన్మభూమి కమిటీల మాదిరిగా అవినీతికి పాల్పడే వారు కాదని, కాబట్టి వలంటీర్లు ఎలా ఉండాలో తెలుగుదేశం పార్టీ వలంటీర్లయిన రామోజీ, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు చెప్పడం మానేస్తే మర్యాదగా ఉంటుందని హితవు పలికారు.

తిరుపతిలో అతిపెద్ద మురుగునీటి శుద్ధి ప్లాంట్

ప్రారంభించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలో నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ దేశంలోనే అతిపెద్దది కావడం నగరానికి గర్వకారణమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. నగరంలోని వినాయకసాగర్ సమీపంలో తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని మేయర్ శిరీషతో కలసి ఎమ్మెల్యే భూమన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.14.95 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్.. బయోకెమికల్ ఆక్సిలేషన్ పద్ధతిలో మురుగునీటిని శుద్ధి చేసి వినాయకసాగర్‌లోకి విడుదల చేస్తుందన్నారు. ఢిల్లీలో 3 ఎంఎల్‌డీ, హైదరాబాద్, ముంబై నగరాల్లో 2 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ప్లాంట్‌లుండగా.. తిరుపతిలో 5ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించామన్నారు. ఎలాంటి కెమికల్స్ కలపకుండా, దుర్వాసనకు తావులేకుండా.. మురుగు నీటిని శుద్ధి చేయడం ఈ ప్లాంట్ ప్రత్యేకత అని చెప్పారు. వినాయకసాగర్‌ను శుద్ధి చేసిన నీటితోనే నింపుతామని.. రూ.40 కోట్ల వ్యయంతో వినాయకసాగర్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్, ఎస్ఈ మోహన్, డీఈఈ విజయకుమార్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోత కాన్పులు చేసే ఆస్పత్రులపై దృష్టిపెట్టండి

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో గర్భిణులకు యోగాపై అవగాహన కల్పించండి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రజిని

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధికంగా కోత కాన్పులు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేకదృష్టి సారించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల్లో నిబంధనల మేరకు కాన్పులు చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కార్యక్రమాలపై బుధవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతి వైద్య పరికరం పనిచేయాలని, వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వరంగంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం సీఎం జగన్ రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)ల ద్వారా గర్భిణీలకు యోగాసనాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఎం కింద అమలవుతున్న కార్యక్రమాలకు సంబంధించిన రాష్ట్రస్థాయి నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కౌమారదశలోని బాలికల్లో హిమోగ్లోబిన్ స్థాయిలపై మూడునెలలకు ఒకసారి పరీక్షలు నిర్వహించాలని, తక్కువ హిమోగ్లోబిన్ ఉన్నవారి విషయంలో ప్రత్యేకశ్రద్ధ పెట్టి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల కరపత్రాలు వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ప్రత్యేకంగా నమోదవుతున్న రోగాలపై డీఎంహెచ్‌వోలు నివేదికలు పంపాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర సౌకర్యాలను పీపీపీ పద్ధతిన సమకూర్చే అవకాశాన్ని పరిశీలించాలని, ఈ సేవలకు ఆరోగ్యశ్రీ ద్వారా నిధులందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టణ ప్రజలకు వైద్యసేవలను వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా చేరువ చేసినట్లు ఆమె తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబసంక్షేమ కమిషనర్ జె.నివాస్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, రాష్ట్రస్థాయి నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రామోజీని కోర్టుకు రప్పిస్తా

నాపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారు

- ఉన్నం ఉదయ భాస్కర్ కొన్న భూమికి రైతులకు డబ్బు ఇవ్వలేదు
- రైతులు వేరే వారికి అమ్ముకున్నారు.. అది నేరమా?
- జగనన్న కాలనీ కోసం కురాకులతోటలో 5 ఎకరాలు గుర్తించారు
- వాటికి ఇంకా ధర నిర్ణయించలేదు
- ఈనాడు, ఉన్నం మారుతి చౌదరి ఎలా ధర నిర్ణయిస్తారు?
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉదయ్ భాస్కర్ చౌదరికి భూమి అమ్మిన రైతులను చూపుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: బీసీనైన తనకు ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేక ఈనాడులో తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న రామోజీరావుని కోర్టుకు రప్పిస్తానని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ చెప్పారు. మంత్రి బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. తాము జగనన్న సారథ్యంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందిస్తున్నా అవి చూపడంలేదు కానీ, వెనుక నుంచి తమపై బురద చల్లుతున్నాయని అన్నారు. తాను రైతులను బెదిరించి బినామీల పేరుతో భూములు తీసుకున్నట్లు నిరూపించగలరా అని ప్రశ్నించారు. సర్వే నంబర్ 232–1లో 5.60 ఎకరాలు, 247–2లో 2.75 ఎకరాలు, 248లో 1.25 ఎకరాలు.. మొత్తం 9.60 ఎకరాలు టీడీపీ హయాంలోనే టిడ్కో ఇళ్లకు కేటాయించిందని చెప్పారు. ఈ భూములను టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం ఉదయ్‌భాస్కర్ చౌదరి రైతులతో కొనుగోలు చేసి అడ్వాన్స్ రూ.10 లక్షలు ఇచ్చారని చెప్పారు. రైతులకు గడువులోపు డబ్బు చెల్లించకపోవడంతో వారు మరొకరికి అమ్మారని, ఇది నేరమవుతుందా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీ కోసం అధికారులు కళ్యాణదుర్గం కురాకులతోటలో సర్వే నంబర్లు 232–1డీ1ఏలో 2.64 ఎకరాలు, 232–1డీ2ఏలో 1.40 ఎకరాలు, 248–2ఏలో 0.96 ఎకరాలు మొత్తం ఐదెకరాలను గుర్తించి, ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారన్నారు. ఈ భూములకు ఇంకా ధర కూడా నిర్ణయించలేదన్నారు. అలాంటప్పుడు ఈనాడు, ఉన్నం మారుతి చౌదరి ఎలా ధర నిర్ణయిస్తారని ప్రశ్నించారు. తప్పులన్నీ టీడీపీ వారు చేసి ఇప్పుడు తనపై నిందలు మోపుతున్నారని అన్నారు. టిడ్కోకు కేటాయించిన భూముల్లో ఉన్నం సోదరుల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ

ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27 వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ ఘాట్‌కు విచ్చేసిన నారా భువనేశ్వరి, నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, సుహాసిని, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ తదితరులు ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కుమారుడిగా పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో...

తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ సజీవంగా ఉంటారని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరంతో పాటుగా బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సంచార క్యాన్సర్ నిర్ధారణ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాట్రగడ్డ ప్రసూన, టీటీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నిజమైన వారసుడిని నేనే

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- వెన్నుపోటు పొడిచిన వాళ్లు వారసులుగా చెప్పుకోవడం సిగ్గుచేటు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: తనకు రాజకీయ భిక్ష పెట్టిన నందమూరి తారక రామారావును తానెప్పటికీ రాజకీయ గురువుగానే చెప్పుకుంటానని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా గుడివాడ పట్టణ ప్రజలకు స్టేడియంను కానుకగా ఇచ్చారన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు స్టేడియం కమిటీ సభ్యులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాని మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను దొంగలు, 420 గాళ్లు వెన్నుపోటు పొడిచి వైస్రాయ్ హోటల్‌లో పదవిని లాక్కుని చెప్పులు వేయించారన్నారు.

ఎన్టీఆర్‌కు దండ వేసే అర్హత చంద్రబాబుకు ఉందా

మాజీ మంత్రి పేర్ని నాని



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): స్వర్గీయ ఎన్టీఆర్‌ను పదవి కోసం దుర్మార్గంగా, అనైతికంగా వెన్నుపోటు పొడిచి.. టీడీపీని లాక్కున్న వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. గుంటూరు జీజీహెచ్‌కు పలు పనుల నిమిత్తం వచ్చిన ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవసరం కోసం ఏదైనా చేయటం సహజ గుణమన్నారు. ఎన్టీఆర్‌ను చంపితే ఎదుగుతానని చంపేయటం, అవసరమైతే ఆయన చిత్రపటానికి దండ వేయడం చంద్రబాబుకు పరిపాటేనన్నారు. ఎన్టీఆర్‌కు దండ వేసే హక్కు చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు.

ప్రతి కుటుంబంలో ఒకరు రాజకీయాల్లోకి రావాలి

ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: ప్రతి కుటుంబం నుంచి ఒకరు రాజకీయాల్లోకి రావాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ పిలుపు ఇస్తున్నట్లు చెప్పారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ కూడా తనకెందుకు రాజకీయం అనుకుని ఉంటే ఏమయ్యేదని, ప్రజలంతా ఆలోచించి రాజకీయాల్లోకి రావాలని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకునే వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు. ఈ ఏడాది తెలుగుదేశం 40 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. అతిపెద్ద సంస్కరణవాది అయిన ఎన్టీఆర్ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. 72 శాతం పూర్తిచేసిన పోలవరాన్ని సీఎం గోదావరిలో కలిపేశాడని విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న పాఠశాలల విలీనం నిర్ణయం వల్ల నాలుగు లక్షలమంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యారని ఆరోపించారు. తమ సమావేశాలకు ఎందుకు పోలీసుల భద్రత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కందుకూరులో అంతమంది జనం వస్తే పోలీసులు బందోబస్తు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో జనం తమ సభలకు తరలివస్తున్నారని చెప్పారు. అందుకే జీవో నంబర్ 1 తెచ్చి తమను అడ్డుకుంటున్నారని విమర్శించారు. నాణ్యతలేని మద్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నా జగన్‌కు పట్టడంలేదన్నారు. రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం కనీసం జీతాలు కూడా ఇవ్వలేకపోతోందని చెప్పారు.

తెలంగాణ

భారత జాతి విముక్తి కోసమే బీఆర్ఎస్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. బీఆర్ఎస్ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ఖమ్మంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ''రాజకీయాల్లో ఎన్నో జరుగుతుంటాయి. ఎందరో గెలిచారు. ఎందరో ఓడారు. ఇది పెద్ద విషయం కాదు. కానీ ఈరోజు మన దేశం, సమాజం లక్ష్యం ఏమిటి? దేశం దారి తప్పిందా? తన లక్ష్యాన్ని కోల్పోయిందా? ఏం జరుగుతోంది ఈ దేశంలో..? అనే ప్రశ్నలు నా అంతరాత్మను అనేక రోజులుగా కలచివేస్తున్నాయి. ఏ విదేశీయుల సాయం తీసుకోవాల్సిన అవసరం లేని సహజ సంపద మన దేశ ప్రజల సొత్తు. లక్షల కోట్ల ఆస్తి ఉంది. అదంతా ఏమవుతోంది?' అని ప్రశ్నించారు.

దేశమంతా రైతులకు ఉచిత కరెంటు ఇస్తాం

'రేపు బీఆర్ఎస్ గవర్నమెంట్, లేదా ప్రతిపాదించే గవర్నమెంట్ వస్తే దేశంలో మొత్తం రైతులకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తాం. తెలంగాణ రైతుబంధు వంటి స్కీమ్ దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నదే బీఆర్ఎస్ నినాదం. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్‌ను బీఆర్ఎస్ ప్రతిపాదిస్తోంది. మిషన్ భగీరథ తరహాలో దేశమంతా ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీళ్లు ఇస్తాం. నిరుద్యోగ సమస్యను నివారించడానికి ఐటీ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహిస్తాం. అగ్నిపథ్‌ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే సైన్యంలో నియామకాలు కొనసాగిస్తాం. అయ్యా ప్రధాని మోదీ గారూ.. మీ పాలసీ ప్రైవేటైజేషన్.. మా పాలసీ నేషనలైజేషన్.. రైళ్లు పోయినై.. విమానాలు పోయినై.. చివరకు వ్యవసాయాన్ని కూడా ప్రైవేట్ చేస్తరట. మన భూములను కార్పొరేట్ గద్దలకు ఇచ్చి.. మనమే వారి వద్ద జీతాలు తీసుకునే పరిస్థితికి తెస్తున్నారు. రూ.48 లక్షల కోట్ల ఆస్తులున్న ఎల్ఐసీని షావుకార్లకు అమ్ముదామని చూస్తున్నావు. నువ్వు అమ్మినా గ్యారెంటీగా మళ్లీ ఎల్ఐసీని వాపస్ చేసుకుంటాం. పబ్లిక్ సెక్టార్‌లోనే కొనసాగిస్తాం. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మీరు అమ్మేస్తే, మేం మళ్లీ పబ్లిక్ సెక్టార్‌లోకి తెస్తాం. విద్యుత్ రంగాన్ని కూడా ప్రభుత్వ పరిధిలోనే ఉంచుతాం. 2024 తర్వాత నువ్వు ఇంటికి.. మేము ఢిల్లీకి. 'కేజ్రీవాల్, భగవంత్‌సింగ్‌మాన్, అఖిలేశ్ యాదవ్, విజయన్, రాజా, ఇతర నేతలు మాకు సంఘీభావాన్ని, ఎంతో బలాన్ని ఇచ్చారు. మా పాలసీపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, మాజీ సుప్రీంకోర్టు జడ్జీలు 100 మంది దాకా పనిచేస్తున్నారు. ఫైనల్ డ్రాఫ్టింగ్ జరుగుతోంది. కొద్ది రోజుల్లోనే బీఆర్ఎస్ పాలసీని ప్రజల ముందు చర్చకు పెడతాం. సీపీఎం, సీపీఐ వంటి ప్రగతిశీల పార్టీలతో దేశ వ్యాప్తంగా కలసి పనిచేస్తాం' అని స్పష్టం చేశారు.

దేశం మార్పు కోరుతోంది

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని తరిమికొట్టాలి. దేశం మార్పు కోరుతోంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి గవర్నర్ల ద్వారా ఆడిస్తున్నారు. ఇక్కడ మేము దేశాభివృద్ధిపై చర్చించాం.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

దేశంలో రాజ్యాంగ సంక్షోభం

దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు జాతీయ సంపదను కొల్లగొట్టి, పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నాయి. జాతీయ విధానానికి స్వస్తి పలికి ప్రైవేట్ శక్తులను పెంచి పోషిస్తున్నాయి. దేశంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొంది. బీఆర్ఎస్ ఏర్పాటుతో భావసారూప్యత కలిగిన పార్టీలు ఒక్కటయ్యే అవకాశం వచ్చింది. – పినరయి విజయన్, కేరళ సీఎం

బీజేపీ దేశాన్ని అమ్మేస్తోంది

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. భారతీయ అబద్ధాల పార్టీగా మారిపోయింది. గుట్టలు, నదులు, ఫ్యాక్టరీలు, ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వే, ఎల్ఐసీ ఇలా దేశం మొత్తాన్ని బీజేపీ ప్రభుత్వం అమ్మేస్తోంది. – భగవంత్‌మాన్, పంజాబ్ సీఎం

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
గురువారం ॥ 19-1-2023

చిందర వందరగా ఉన్న ఇల్లు
చిందర వందరగా ఉన్న
మనసుకు కారణం.
సర్దుకున్న ఇల్లు
సేదతీరిన మనసుకు సూచన.
ఎలా పడితే అలా ఉండి
పనికిమాలిన వస్తువులతో నిండి
కుదురుగా కనిపించని
ఇంట్లో నివాసం
స్త్రీల మానసిక ఆరోగ్యాన్ని
దెబ్బ తీస్తుంది.
ఎందుకంటే స్త్రీలు ఎక్కువ సమయం
గడిపే చోటు ఇల్లు గనుక.
స్త్రీలు తమ పరిసరాలను సర్దుకోవడం,
అందంగా మార్చుకోవడం వల్ల
మీ మానసిక ఆరోగ్యం బాగుంటుంది
అంటున్నారు నిపుణులు.

మానసిక ఆరోగ్యం

మీ గదే మీ మది



కేస్ స్టడీ 1:

సురేఖ వంటగదిలో ఎప్పుడూ చిరాగ్గా కోపంగా ఉంటుంది. పిల్లలు వెళితే కసురుతూ ఉంటుంది. ఆమె వంట చేస్తున్నప్పుడు ఆ సమయానికి పనిమనిషి ఇంకా రాకపోవడం వల్ల సింక్ నిండుగా ఉంటుంది. కావలిసిన వంట పాత్రలు వెంటనే దొరకవు. సరుకుల డబ్బాలను కుదురుగా పెట్టుకోవడాన్ని సురేఖ ఏనాడూ పట్టించుకోదు. కిచెన్ ప్లాట్‌ఫామ్ నీట్‌గా ఉండదు. తను శుభ్రంగా ఉన్నా, ఇంట్లో ఇతరత్రా ఏ సమస్యలు లేకపోయినా ఆ సమయంలో బయట వాతావరణం బాగున్నా వంట గదిలో సురేఖ మానసిక స్థితి మాత్రం ప్రశాంతంగా ఉండదు. అదే ఆమె వంట గదిని సరిగ్గా సర్దుకుని ఉంటే, వంట మొదలెట్టే సమయం కంటే ముందే వచ్చి పాత్రలు శుభ్రం చేసి వెళ్లే పని మనిషిని పెట్టుకుని ఉంటే, వంట గదిలో అనవసరమైన పాత గిన్నెలు, బూజు పట్టిన గంగాళాలు వదిలించుకుని ఉంటే ఆమె ప్రతి పూట హాయిగా వంట చేసుకుని ఉండేది.

కేస్ స్టడీ 2:

రాజేశ్వరి ఆఫీస్ నుంచి ఇల్లు చేరుకోగానే ఆమె చిరాకు నషాళానికి ఎక్కుతుంది. అప్పటికి పిల్లలిద్దరూ స్కూళ్ల నుంచి ఇంటికి వచ్చి ఉంటారు. చిప్స్ తిని రేపర్లు సోఫాలో పడేసి ఉంటారు. టవళ్లు కుర్చీలో పడేసి ఉంటారు. యూనిఫామ్ బట్టలు ఎలాగంటే అలా పడేసి ఉంటారు. పొద్దున చదివిన న్యూస్‌పేపర్లు చిందర వందరగా ఉంటాయి. తాళం కప్ప ఒక చోట, దాని తాళం ఇంకో చోట. పుస్తకాల సంచుల్ని టీవీ స్టాండ్ దగ్గర పడేసి ఉంటారు. వచ్చిన వెంటనే ఆమెకు ఇల్లు సర్దుకునే ఓపిక ఉండదు. హాల్లో కూచుందామంటే ఈ చిందర వందర అంతా ఆమెకు హాయినివ్వదు. పిల్లలు ఎన్నిసార్లు చెప్పినా వినరు. తాను ఇంటికి వచ్చే సరికి ఇల్లు శుభ్రంగా, కుదురుగా కనిపిస్తే వచ్చి హుషారుగా పలకరిద్దామని ఉంటుంది. కాని ఆ స్థితి లేకపోవడం వల్ల రోజూ రావడంతోటే పిల్లల్ని కసరడం, దాని వల్ల తాను బాధ పడటంతో మూడ్ ఆఫ్. ఇలా రోజు జరగడం అవసరమా?

రోడ్డు మీద వెళుతున్నప్పుడు చెత్త చెదారం కంట పడగానే మనసుకు ఒక రకమైన ఏహ్యాభావం కలుగుతుంది. అలాగే మనం నివసించే ఇల్లు, గదులు కూడా చిందర వందరగా ఉంటే మనసుకు ఉల్లాసం పోతుంది. మనం నివాసం ఉండే ఇల్లుగాని, పని చేసే ఆఫీస్‌గాని సర్వకాల సర్వ వేళల్లో శుభ్రంగా ఉండాలని ఆశించడం కుదరదు. కాని వీలున్నంత మటుకు ఎప్పటికప్పుడు సర్దుకోవడం వల్ల వస్తువుల అపసవ్యత దృష్టికి రాకుండా చూసుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం బాగుంటుందని, సరైన కెమికల్స్ విడుదలయ్యి ఒక ప్రశాంతత ఉంటుందని, ఫోకస్డ్‌గా పని చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. కౌటుంబిక, ఆర్థిక సమస్యలు లేకపోయినా శుభ్రత లేని పరిసరాలు మీ నైపుణ్యాన్ని తగ్గిస్తాయి. మనసును చికాకు పెడతాయి. పరిసరాలు మనసును ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే ఇవి చేయాలి.

1. ఇల్లు మీ కార్యక్షేత్రంగా ఉందా లేదా చూసుకోవాలి. ప్రతి వస్తువుకు ఒక స్థలం ఉంటుంది. ఉండాలి. లేకపోతే కేటాయించుకోవాలి. చిన్న ఇల్లు అని వంక పెట్టవద్దు. చిన్న ఇల్లు కూడా చాలా నీట్‌గా సర్దుకోవచ్చు.
2. లాండ్రీ, గిన్నెలు, చెత్త పారేయడం... ఈ మూడు పనులు మీరు చేసుకున్నా పని మనిషి చేసినా పర్‌ఫెక్ట్‌గా ప్రతిరోజూ జరిగేలా చూసుకుంటే మనసుకు సగం ప్రశాంతత.
3. ఇల్లు శుభ్రంగా ఉంచుకోవాలంటే పాతవి, అక్కర్లేనివి, కంటికి ఇబ్బంది కలిగించేవి నిర్దాక్షిణ్యంగా పారేయాలి. అతి తక్కువ వస్తువులతో జీవించాలని దీని అర్థం కాదు. మీకు అవసరమైన వస్తువులు మాత్రమే ఉంటే బాగుంటుంది.
4. ఇల్లు సర్దుకోవడానికి రోజులో కొంత సమయం కేటాయించాలి. ఇంటి సభ్యులందరూ ఏదో ఒక టైమ్‌లో ఇల్లు సర్దడానికి పది నిమిషాలు ఇవ్వాలి. నెలకోసారి సర్వ ప్రక్షాళన అనేది తప్పు భావన. కొద్ది కొద్దిగా నీట్‌గా చేసుకుంటూ రావడమే మంచిది.
5. పొందిగ్గా సర్దబడి, చక్కటి మొక్కలు ఉండి, గాలి వెలుతురు తగినంతగా వస్తూ ఉన్న ఇల్లు మీదైతే మీ మానసిక ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉండటానికి పూర్తి అవకాశం ఉంది.

కేస్ స్టడీ 3:

సంధ్య వాళ్ల ఇల్లు ఎప్పుడూ శుభ్రంగా ఉండదు. ఇంటికి వచ్చిన వాళ్లు ఈ ఇంట్లో వాళ్లకు ఇల్లు సర్దుకోవడం, ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం రాదు అని ఒక్క నిమిషంలో తెలిసిపోతుంది. వాళ్లు ఎక్కువ సేపు కూచోరు. సంధ్యకు ఇల్లు సర్దుకోవాలని ఉంటుందిగాని దానికి ఏదో ముహూర్తం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఆదివారం సర్దుదామనుకుంటుంది... ఆ రోజు ఏదో పని పడుతుంది. హ్యాంగర్లకు మాసిన బట్టలు, కుర్చీల్లో ఉతికిన బట్టలు, వారం అయినా మంచాల మీద మారని దుప్పట్లు... సంధ్యకు ఏ పని చేయాలన్నా మనసు రాదు. ఐదు నిమిషాల పని పది నిమిషాలు పడుతుంటుంది. ఉండి ఉండి ఆందోళనగా అనిపిస్తుంటుంది. ఏదో ఇష్టం లేని ప్లేస్‌లో చిక్కుకుపోయినట్టుగా అనిపిస్తుంటుంది. శుభ్రమైన గదే శుభ్రమైన మదికి సాయం చేస్తుందని ఆమెకు ఎప్పటికి తెలుస్తుందో.

ఆన్‌లైన్‌లో మీరు పోస్ట్ చేసినదాని వాల్యూని లైక్స్, కామెంట్స్, రివ్యూస్ ద్వారా కొలుస్తారు. మిమ్మల్ని తప్పుదారి పట్టించే, హాని కలిగించే కంటెంట్, పుకార్లు, ఫొటోలు, రివ్యూలు లేదా సమస్యాత్మకమైన సైట్‌ల నుండి తెలియని పోస్ట్‌లు సోషల్ మీడియా సెర్చింగ్‌లో కనిపిస్తే ఏం జరుగుతుంది?!

మీ బ్రాండ్ కాపాడుకోండి..

సైబర్ టాక్



తమకు కావల్సిన వారి వివరాలను సేకరించడానికి సోషల్ మీడియా ప్రొఫైల్‌లను తనిఖీ చేయడం అనేది ఈ రోజుల్లో రొటీన్‌గా మారింది కాబట్టి ఎవరికి వారు జాగ్రత్తగా ఉండటం అవసరం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఏదైనా బ్రాండ్ లేదా సెలబ్రిటీల విషయాలను బయటకు తీసుకు రావడానికి తప్పనిసరిగా కొంత టైమ్, కృషిని పెట్టుబడిగా పెడతారు. సోషల్ ప్లాట్‌ఫామ్‌లను వినోదం లేదా సామాజిక నెట్‌వర్క్ కోసం ఉపయోగించడంలో తప్పు లేదు కానీ బ్రాండ్, సెలబ్రిటీల విషయాలను ఆన్‌లైన్‌లో సరిగ్గా నిర్వహించడంలో అవగాహన మాత్రం తప్పనిసరి.

నోటిఫికేషన్ నిర్వహణ

● సోషల్ మీడియా గెయిన్ గ్రూప్‌లు, కమ్యూనిటీలలో భాగం కావాలి. ఇన్‌ఫ్లుయెన్సర్లు /ఫ్యాన్స్/పోటీదారులు మిమ్మల్ని అనుసరిస్తున్నారో లేదో చెక్ చేస్తుండాలి. మీ ఫ్రెండ్స్ జాబితాలో ఎలాంటి వ్యక్తులు ఉన్నారో చెక్ చేసుకోవాలి. అలాగే, కంటెంట్ షేర్ చేయడంలో, పోస్ట్ చేయడంలో చురుగ్గా ఉండాలి. ● ప్రతికూల కంటెంట్‌ను సమర్థంగా అణిచివేయగలగాలి. విశ్లేషించడం, ప్రచారం చేయడం, ప్రతికూల పోస్ట్‌ల కారణంగా జరిగిన నష్టాన్ని సవరించుకోవాలి. ● కంటెంట్ నియంత్రణకు డూప్లికేట్, కాపీరైట్ ఉల్లంఘన, ఇతర విషయాల జాడలను తొలగించాలి. ● మీ డిజిటల్ బ్రాండ్ గుర్తింపు, విజిబిలిటీ, విశ్వసనీయతను సరిగ్గా నిర్వహించడం ద్వారా ఆన్‌లైన్‌లో బ్రాండ్ లేదా సెలబ్రిటీగా నిలబెడుతుంది. పోటీ నుండి వేరు చేస్తుంది. ● మీ ఆన్‌లైన్ బ్రాండ్‌ను సెట్ చేయడానికి అన్ని సోషల్ మీడియా ఛానెల్‌లలో స్థిరమైన, పాజిటివ్ కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నారని నిర్ధారించుకోండి. ● మీ ఆన్‌లైన్ ప్రేక్షకులను పెంచడంలో మీకు సహాయపడే సానుకూల కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి కొత్త సైట్‌లు, సమూహాలను కనుక్కోండి. ● ఇంటర్నెట్‌లో మీ ప్రతిష్ఠను దెబ్బతీయకుండా ఉండాలంటే ప్రతికూల వ్యాఖ్యలు, పోస్ట్‌లకు త్వరగా ప్రతిస్పందించాలి. ● మీ ఫోన్, ఇతర పరికరాల జీపీఎస్ నుండి మీకు అనుకూలమైన ప్రకటనల ప్రచారాలు, ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన సమాచారాన్ని అందించడానికి కంపెనీలు మీరున్న ప్లేస్‌ను ట్రాక్ చేస్తాయి. అందుకని, గోప్యతా సెట్టింగ్స్ చేసుకోండి.

ఆన్‌లైన్‌లో దాడి

● ఫాలోవర్స్ నుండి అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ఆరోపణలు, పరువు నష్టం కలిగించే తప్పుడు ప్రకటనలు, మీ బ్రాండ్ లేదా సెలబ్రిటీ ఆన్‌లైన్ ఇమేజ్ అవమానపరిచేలా వెబ్ పేజీలు సెటప్ చేసి ఉంటాయి.

మంచి మార్గం

● సోషల్ మీడియాలో మీ కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి ముందు వార్తాపత్రికలు, వార్తా సైట్‌లు, పరిశోధన పత్రాలు, రేడియో, టెలివిజన్ ప్రకటనలు, పత్రికా ప్రకటనల నుంచి సమాచారం సేకరించుకోవాలి.

ఉనికికి చిట్కాలు

● మీ పోస్ట్‌లను షెడ్యూల్ చేయడానికి క్యాలెండర్‌ను సృష్టించండి. ● ప్రసిద్ధ హ్యాష్‌ట్యాగ్‌లను గుర్తించండి. ● ఇంటర్వ్యూల కోసం ప్రెస్, ఏజెన్సీల మద్దతు తీసుకోండి. ఇంటర్నెట్ ఎప్పటికీ మరచిపోదు, మీరు పోస్ట్ చేసిన వాటిని తిరిగి మీకు చూపుతుంది. Locobuzz, Reputology, Mention, Reputation Defender వంటి ప్రసిద్ధ ORM టూల్స్ ఉపయోగించండి. మీ బ్రాండ్ ఇమేజ్‌ని లోతుగా సెర్చ్ చేసి, మీ డిజిటల్ ఆస్తులతో పాటు నష్టాలు ఏమున్నాయో చెక్ చేయండి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

సినిమా



● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఆర్ఆర్ఆర్ ఫైట్స్‌కి అవార్డ్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ జాబితాలో మరో అవార్డు చేరింది. సియాటెల్ ఫిలిం క్రిటిక్స్ సొసైటీ అవార్డ్స్‌లో బెస్ట్ యాక్షన్ కొరియోగ్రఫీ కేటగిరీలో అవార్డు దక్కించుకుంది. ఈ విషయాన్ని సదరు సొసైటీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. విక్కీ ఆరోరా, ఇవాన్ కోస్టాడినోవ్, నిక్ పావెల్, రాయిచో వాసిలెవ్ స్టంట్స్ కో ఆర్డినేటర్లుగా చేయగా, ప్రేమ్ రక్షిత్, దినేశ్ కృష్ణన్ స్టంట్స్ కొరియోగ్రఫీ చేశారు. హాలీవుడ్ చిత్రాలు 'అవతార్: ది వే ఆఫ్ వాటర్, ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ అట్ ఒన్స్, ది నార్త్‌మేన్, టాప్ గన్: మ్యావరిక్'లతో పోటీపడి 'ఆర్ఆర్ ఆర్' అవార్డు దక్కించుకోవడం విశేషం.

ఫిబ్రవరిలో టీఎఫ్‌పీసీ ఎన్నికలు

- టీఎఫ్‌పీసీ నుంచి ఇద్దరు నిర్మాతల బహిష్కరణ
- సి. కల్యాణ్



''తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి (టీఎఫ్‌పీసీ) ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని కొందరు సభ్యులు రాద్ధాంతం చేస్తున్నారు. దీనిపై టీఎఫ్‌పీసీ కమిటీ చర్చించి, ఫిబ్రవరి 19న ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం'' అని టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు సి. కల్యాణ్ అన్నారు. తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి బుధవారం సమావేశం అయింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మీడియాకి సి. కల్యాణ్ వెల్లడించారు.

● కొద్దిరోజులుగా తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలిపై కొందరు బురద జల్లుతున్నారు. కొందరు నిర్మాతలు ఛాంబర్ వద్ద టెంట్ వేసి అపనిందలు వేశారు. టీఎఫ్‌పీసీలో 1200మంది సభ్యులున్నారు. వారిలో 10 శాతం మంది కూడా టెంట్ వేసి పోరాడుతున్న వారిలో లేరు. సంస్థకి చెడ్డపేరు తెచ్చేలా మాట్లాడిన నిర్మాత కె. సురేష్ కుమార్‌ని మూడేళ్ల 'టీఎఫ్‌పీసీ' నుంచి సస్పెండ్ చేశాం. అయితే ఆయన సినిమాలు తీసుకోవడానికి అభ్యంతరం లేదు. అలాగే మరో నిర్మాత యలమంచి రవికుమార్‌ని శాశ్వతంగా బహిష్కరిస్తున్నాం.

● టీఎఫ్‌పీసీలో నిధుల దుర్వినియోగం, వృథా జరగలేదు. ప్రస్తుతం 9 కోట్ల ఫండ్ ఉంది. ఇంత భారీ ఫండ్ రావడానికి కారణం దాసరి నారాయణరావుగారే. టీఎఫ్‌పీసీకి తిరుపతిలో బిల్డింగ్ ఉంది. మూవీ టవర్స్‌లో 2 కోట్ల 40 లక్షలు పెట్టుబడి పెడితే 10 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ 31 వరకు అకౌంట్స్ ఈసీలో పాస్ అయ్యాయి.. ఎవరికైనా అభ్యంతరాలుంటే ప్రశ్నించవచ్చు.

● నంది (ఆంధ్రప్రదేశ్), సింహ (తెలంగాణ) అవార్డుల గురించి ఇద్దరు ముఖ్యమంత్రులను (వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కేసీఆర్) కలిసి మాట్లాడనున్నాం. అలాగే ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా 'సౌత్ ఇండియా ఫిలిం ఛాంబర్' ఉంది. దానికి అనుబంధంగా తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఉన్నాయి. అంతేకానీ ఆంధ్ర ఫిలిం ఛాంబర్, ఆంధ్ర ఫిల్మ్ ఫెడరేషన్ వంటి సంస్థలకు మాకు సంబంధం లేదు.

● ఎన్నికలకు ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకు నామినేషన్స్ ప్రక్రియ కొనసాగుతుంది. కె. దుర్గా ప్రసాద్ ఎన్నికల అధికారిగా కొనసాగుతారు. నామినేషన్లు వేసిన వారు 13వ తేదీ వరకు విత్ డ్రా చేసుకోవచ్చు.. స్క్రూటినీ తర్వాత ఫైనల్ లిస్ట్‌ను నోటీస్ బోర్డ్‌లో ఉంచుతాం. 19నే విజేతలను ప్రకటిస్తాం'' అన్నారు. ఈ సమావేశంలో టీఎఫ్‌పీసీ సభ్యులు టి. ప్రసన్న కుమార్, వైవీఎస్ చౌదరి, రామసత్యనారాయణ పాల్గొన్నారు.



● మహేశ్‌బాబు

ఆన్ యాక్షన్

ఇటీవలే ఫ్యామిలీతో హాలిడే ట్రిప్‌కి వెళ్లి రిలాక్స్ అయిన మహేశ్‌బాబు ఇప్పుడు రిస్కీ ఫైట్స్ చేస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా సూర్యదేవర నాగవంశీ ఓ సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. మహేశ్‌బాబు, కొందరు ఫైటర్స్ పాల్గొనగా స్టంట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ ఆధ్వర్యంలో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. మహేశ్ సరసన పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. ఆగస్ట్ 11న ఈ చిత్రం విడుదల కానుంది.

అంతకుమించి సాధించేది ఏముంటుంది


- వంశీ పైడిపల్లి



''వారసుడు' సినిమా క్లయిమాక్స్‌లో తండ్రీకొడుకుల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు మా మనసులను హత్తుకున్నాయి అంటూ ప్రతి రోజూ నాకు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. మా నాన్న కూడా 'వారసుడు' చూసి భావోద్వేగానికి లోనై ఇన్నేళ్లలో తొలి సారి నన్ను హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతకుమించి నేను సాధించేది ఏముంటుంది?'' అని డైరెక్టర్ వంశీ పైడిపల్లి అన్నారు. విజయ్, రష్మికా మందన్న జంటగా నటించిన తమిళ చిత్రం 'వారీసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'వారసుడు' పేరుతో తెలుగులో డబ్ చేసి, ఈ నెల 14న రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వంశీ పైడిపల్లి పంచుకున్న విశేషాలు.

● 'ఊపిరి'ని తెలుగు, తమిళ భాషల్లో తీశాం. 'వారీసు'ని తమిళంలో తీసి, తెలుగులోకి డబ్ చేశాం. తమిళంలో నేను తీసిన తొలి సినిమా 'వారీసు' పెద్ద హిట్ కావడం హ్యాపీ. తెలుగులోనూ ఈ సినిమా త్వరలో 'మాస్టర్' (విజయ్ హీరోగా నటించారు) కలెక్షన్లను బీట్ చేయబోతోంది. 'దిల్' రాజుగారికి ఈ సినిమా డబ్బుతో పాటు గౌరవం తెచ్చి పెట్టింది. మౌత్ టాక్ వల్ల ఈ చిత్రానికి ఆదరణ పెరుగుతోంది. సినిమా చూసిన యువకులు తమ అవ్వ, తాతలు, ఇతర కుటుంబ సభ్యులకు ఈ చిత్రాన్ని చూడమని చెప్తున్నారు. హిందీలో కూడా మా సినిమాకి ఆదరణ పెరుగుతోంది. ● నేను ఓ లైన్ సిద్ధం చేసుకుని హీరోలకు వినిపిస్తాను.. వారు ఓకే అన్న తర్వాత వారి ఇమేజ్‌కి తగినట్టుగా సన్నివేశాలను రూపొందిస్తాను. ప్రతిసారీ మమ్మల్ని మేము నిరూపించుకోవాలి. అందుకే నా ప్రతి చిత్రాన్ని ఛాలెంజ్‌గా స్వీకరిస్తుంటాను. 2020లో మహేశ్‌బాబుగారితో ఓ సినిమా చేయాల్సింది. కొన్ని కారణాల వల్ల కుదరలేదు. పెద్ద స్టార్స్‌తో కమర్షియల్ సినిమాలు చేయడానికే నేను ఇండస్ట్రీకి వచ్చాను. నా తర్వాతి ప్రాజెక్ట్ కోసం ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి.

కస్టడీలో రేవతి



● కృతీ శెట్టి

ఇక్కడున్న ఫొటో చూశారుగా... చెమర్చిన కళ్లతో, విషణ్ణ వదనంతో కనబడుతున్నారు కస్టడీలో ఉన్న కృతీ శెట్టి. నాగచైతన్య సరసన నటిస్తున్న 'కస్టడీ' చిత్రంలో కృతీ శెట్టి లుక్ ఇది. బుధవారం కృతీ లుక్ రిలీజ్ చేసి, ఆమె పోషిస్తున్న పాత్ర పేరు రేవతి అని ప్రకటించింది చిత్ర యూనిట్. వెంకట్ ప్రభు దర్శకత్వంలో పవనకుమార్ సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుగుతోంది. మే 12న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

అర్జునే పరిష్కరించాలి



● భరత్, శ్రీకాంత్, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా మహేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హంట్'. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో ప్రభాస్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'ఏ కేసును అయితే అర్జున్ మొదలుపెట్టి సాల్వ్ చేయలేక పోయాడో.. అదే కేసును ఇప్పుడు ఈ అర్జున్ సాల్వ్ చేయాలి' అంటూ నటుడు శ్రీకాంత్ చెప్పే డైలాగుతో ట్రైలర్ స్టార్ట్ అయ్యింది. ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ– ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. టీజర్, ట్రైలర్‌లో యాక్షన్ సీక్వెన్సులు బావున్నాయని చెబుతుండటం హ్యాపీ'' అన్నారు. శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: అరుల్ విన్సెంట్, సంగీతం: జిబ్రాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.

ఏడి నా ఏలిక



● సమంత

మహాకవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. శకుంతల పాత్రలో సమంత, దుష్యంతుడి పాత్రలో దేవ్ మోహన్ నటించారు. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'మల్లికా మల్లికా మాలతీ మాలికా.. చూడవా చూడవా ఏడి నా ఏలిక' అంటూ సాగే పాటను బుధవారం విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ పాటను రమ్య బెహ్రా పాడారు. ఈ చిత్రం ఫిబ్రవరి 17న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.


ఆమె సవాల్



● రుహానీ, నాని

'**చి**లసౌ' చిత్రంతో తెలుగుకు పరిచయమైన రుహానీ శర్మ 'హిట్'లో ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా చేసి, ఆకట్టుకున్నారు. తాజాగా 'హర్' (ఆమె) అనే చిత్రంలో పోలీసాఫీసర్ పాత్ర చేశారామె. ఈ చిత్రం టీజర్‌ని హీరో నాని బుధవారం విడుదల చేశారు. సస్పెన్షన్ తర్వాత ఓ హత్య కేసును ఛేదించడానికి తిరిగి ఖాకీ డ్రెస్ ధరించిన రుహానీ శర్మ సీన్‌తో ఈ టీజర్ ఆరంభమవుతుంది. శ్రీధర్ స్వరగావ్ దర్శకత్వంలో రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించిన ఈ చిత్రాన్ని డబుల్ అప్ మీడియాస్ సంస్థ రిలీజ్ చేయనుంది. ''ఇందులో రుహానీది చాలెంజింగ్ రోల్'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆనందరావు సాహసాలు




● సుహాస్

'**సు**హాస్ హీరోగా రామ్ పసుపులేటి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆనందరావు అడ్వెంచర్స్'. ఉదయ్ కోలా, విజయ్ శేఖర్ అన్నే, సురేష్ కోతింటి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభమైంది. 'ఆనందరావు అడ్వెంచర్స్' టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో రానా రిలీజ్ చేయగా, దర్శకుడు క్రిష్ స్క్రిప్ట్‌ను టీమ్‌కి అందించారు. ''చిల్డ్రన్ ఫ్యాంటసీ కథతో తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు రామ్ పసుపులేటి. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, కెమెరా: రాకేష్ ఎస్. నారాయణ్, సహ నిర్మాతలు: సుహాసిని రాహుల్, మురళీ జంపన.

వాటివల్లే గుర్తింపు

- అర్జున్ దాస్



''**బు**ట్టబొమ్మ' తమిళ్ రీమేక్ అయినా తెలుగుకి తగ్గట్టు మార్పులు చేశారు. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా కొత్త అనుభూతిని ఇస్తుందని నాగవంశీగారు నమ్మారు'' అని నటుడు అర్జున్ దాస్ అన్నారు. అనికా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. ఎస్.నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలకానుంది. అర్జున్ దాస్ మాట్లాడుతూ– ''ఖైదీ, అంధకారం, మాస్టర్' సినిమాల వల్లే నాకు ఇంత మంచి గుర్తింపు వచ్చింది. అందరూ నా వాయిస్ గురించి మాట్లాడుతుంటారు. 'బుట్టబొమ్మ' ఒప్పుకునే ముందు వంశీగారు కూడా డబ్బింగ్ చెప్పాలని షరతు పెట్టడంతో చెప్పాను'' అన్నారు.



5 వన్డేల్లో సచిన్, సెహ్వాగ్, రోహిత్ శర్మ (3 సార్లు), ఇషాన్ కిషన్ తర్వాత డబుల్ సెంచరీ సాధించిన ఐదో భారత ఆటగాడిగా గిల్ నిలిచాడు. మరో ముగ్గురు గేల్, గప్టిల్, ఫఖర్ జమాన్ మాత్రమే వన్డేల్లో డబుల్ సెంచరీలు చేశారు. ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా (23 ఏళ్ల 132 రోజులు) కూడా గిల్ గుర్తింపు పొందాడు.

1 న్యూజిలాండ్‌పై భారత బ్యాటర్ అత్యధిక స్కోరు ఇదే (208). గతంలో సచిన్ టెండూల్కర్ (1999లో : హైదరాబాద్‌లోనే) ఎల్బీ స్టేడియంలో 186 పరుగులు సాధించాడు.

గిల్ హల్‌చల్

ఎవరన్నారు వన్డేలకు కాలం చెల్లిందని... ఎవరన్నారు 100 ఓవర్లు చూడటమంటే బోరింగ్, సమయం వృథా అని... హైదరాబాద్ స్టేడియంలో బుధవారం మ్యాచ్ చూసిన తర్వాత అలాంటి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాల్సిందే... భారీగా పరుగులు, సిక్సర్ల వరద, రికార్డులు, ఉత్కంఠ, ఉద్వేగం... ఒక్కటేమిటి అన్ని భావాలు ఉప్పల్ మైదానంలో కనిపించాయి. అతి సునాయాస విజయం అనుకున్నది కాస్తా ఆఖరి ఓవర్ వరకు వెళ్లింది.

శుబ్‌మన్ గిల్ సూపర్ బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ సాధించి అరుదైన ఆటగాళ్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకొని తొలి సగం ఆటలో హైలైట్‌గా నిలిచాడు. అయితే భారత్ భారీ స్కోరు చేయగానే గెలుపు ఖాయం కాలేదు. 21.2 ఓవర్లలో ఏకంగా 219 పరుగులు చేయాల్సిన సుదూర లక్ష్యం ముందుండగా... న్యూజిలాండ్ టి20 తరహాలో మెరుపు షాట్లతో పోరాడింది. మైకేల్ బ్రేస్‌వెల్ వీర బాదుడుకు భారత శిబిరంలో అలజడి రేగింది. ఒకదశలో టీమిండియా ఓటమి దిశగా కూడా వెళుతున్నట్లు అనిపించింది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా... రెండో బంతికి ఆఖరి వికెట్ తీసి భారత్ ఊపిరి పీల్చుకుంది. మొత్తంగా అభిమానులకు ఫుల్ వినోదం అందింది.

- భారత ఓపెనర్ డబుల్ సెంచరీ
- తొలి వన్డేలో 12 పరుగులతో టీమిండియా విజయం
- బ్రేస్‌వెల్ వీరోచిత శతకం వృథా
- పోరాడి ఓడిన న్యూజిలాండ్

సాక్షి, హైదరాబాద్: హోరాహోరీ సమరంలో పైచేయి సాధించిన భారత్ వన్డే సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. బుధవారం చివరి ఓవర్ వరకు ఉప్పల్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 12 పరుగుల స్వల్ప తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (149 బంతుల్లో 208; 19 ఫోర్లు, 9 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో చెలరేగాడు. అనంతరం న్యూజిలాండ్ 49.2 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. మైకేల్ బ్రేస్‌వెల్ (78 బంతుల్లో 140; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా, మిచెల్ సాన్‌ట్నర్ (45 బంతుల్లో 57; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 17 ఓవర్లలోనే 162 పరుగులు జోడించడం విశేషం. సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన పేసర్ మొహమ్మద్ సిరాజ్ 4 కీలక వికెట్లు పడగొట్టాడు. సిరీస్‌లోని రెండో వన్డే ఈనెల 21న రాయ్‌పూర్‌లో జరుగుతుంది.


బ్రేస్‌వెల్


సిరాజ్

కోహ్లి విఫలం...

భారత్‌కు రోహిత్ శర్మ (38 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గిల్ మరోసారి శుభారంభం అందించారు. వీరిద్దరు చక్కటి షాట్లతో పరుగులు సాధించడంతో తొలి 10 ఓవర్లలో భారత్ 52 పరుగులు చేసింది. అయితే తక్కువ వ్యవధిలో రోహిత్, కోహ్లి (8), ఇషాన్ కిషన్ (5)లను అవుట్ చేసి న్యూజిలాండ్ ఆధిక్యం ప్రదర్శించింది. మరోవైపు గిల్ మాత్రం పట్టుదలగా నిలబడ్డాడు. అతనికి సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 31; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (38 బంతుల్లో 28; 3 ఫోర్లు) తగిన సహకారం అందించారు. గిల్ నాలుగో వికెట్‌కు సూర్యతో 65 పరుగులు, ఐదో వికెట్‌కు హార్దిక్‌తో 74 పరుగులు జోడించాడు. కవర్స్‌లో సులువైన క్యాచ్ ఇచ్చి సూర్య వెనుదిరగ్గా... వివాదాస్పద రీతిలో హార్దిక్ అవుటయ్యాడు. బంతి హార్దిక్ బ్యాట్‌ను తాకకుండానే కీపర్ చేతుల్లోకి వెళ్లినట్లుగా, కీపర్ చేతులతోనే బెయిల్స్ కదిలినట్లుగా టీవీ రీప్లేలో కనిపించింది. అయితే దీనిపై స్పష్టత లేకపోగా, హార్దిక్‌ను అంపైర్ బౌల్డ్‌గా ప్రకటించాడు. 40 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 251 పరుగులకు చేరింది. అయితే కివీస్ బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు రావడం కష్టంగా మారింది. ఒక దశలో 40-47 ఓవర్ల మధ్య ఒక ఫోర్, ఒక సిక్స్ మాత్రమే వచ్చాయి. అయితే చివర్లో గిల్ సునామీ బ్యాటింగ్ ఒక్కసారిగా ఆటను మార్చేసింది. చివరి 10 ఓవర్లలో భారత్ 98 పరుగులు సాధించింది.

ఆ క్యాచ్‌లు పట్టి ఉంటే...

గిల్‌కు కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. 45 పరుగుల వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసిన కీపర్ లాథమ్, అదే బంతికి స్టంపింగ్ చేసే సునాయాస అవకాశాన్ని కూడా చేజార్చాడు. ఆ తర్వాత షిప్లీ తన బౌలింగ్‌లోనే రిటర్న్ క్యాచ్ వదిలేసినప్పుడు గిల్ స్కోరు 122 పరుగులు.

మెరుపు భాగస్వామ్యం....

భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ మొదటి నుంచీ తడబడింది. ఏ దశలోనూ టీమ్ గెలుపు దిశగా సాగుతున్నట్లు అనిపించలేదు. ఆరంభంలోనే ఒకదశలో వరుసగా 23 బంతుల పాటు కివీస్ పరుగు తీయలేకపోయింది. ఫిన్ అలెన్ (39 బంతుల్లో 40; 7 ఫోర్లు, 1 సిక్స్) మాత్రం స్వేచ్ఛగా ఆడుతూ హార్దిక్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు, సిక్స్ కొట్టడం విశేషం. అనంతరం మిడిలార్డర్‌లో 19 పరుగుల వ్యవధిలో జట్టు 3 కీలక వికెట్లు కోల్పోయింది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ టామ్ లాథమ్ (24) కూడా ప్రభావం చూపలేకపోయాడు. స్కోరు 131/6కు చేరడంతో కివీస్ కుప్పకూలేందుకు ఎంతో సమయం లేదనిపించింది. అయితే ఈ దశలో బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్ భారత బౌలర్లను ఆడుకున్నారు. కొరకరాని కొయ్యలుగా మారిపోయిన వీరిద్దరు చక్కటి షాట్లతో, సమన్వయంతో దూసుకుపోయారు. ఈ జోడీని విడదీసేందుకు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. సాన్‌ట్నర్ 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, 57 బంతుల్లోనే బ్రేస్‌వెల్ శతకం అందుకున్నాడు. ఎట్టకేలకు 17 ఓవర్ల భాగస్వామ్యం తర్వాత సాన్‌ట్నర్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో భారత్ ఊరట చెందింది. అయితే మరో ఎండ్‌లో పోరాటం కొనసాగించిన బ్రేస్‌వెల్ విజయానికి చేరువగా తీసుకు రాగలిగాడు.


శుబ్‌మన్ గిల్

బంతులు **149**
పరుగులు **208**
ఫోర్లు **19** సిక్స్‌లు **9**

'శుబ్' ఘడియలు వచ్చేశాయి....

'ప్రతీ షాట్ అంతకంటే ముందు ఆడిన షాట్‌కంటే అందంగా కనిపించింది'... శుబ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ గురించి ఏక వాక్య ప్రశంస ఇది. అందమే కాదు అద్భుతం అనిపించే షాట్లు కూడా అతను ఆడాడు. లేదంటే 182 పరుగుల స్కోరు నుంచి వరుసగా మూడు సిక్సర్లతో 'డబుల్ సెంచరీ'కి చేరాలంటే ఎంత సాహసం ఉండాలి. బుధవారం హైదరాబాద్‌లో గిల్ దానిని చేసి చూపించాడు. శ్రీలంకతో సిరీస్ తొలి వన్డేలో గిల్ ఓపెనింగ్ చేస్తాడని... అంతకుముందు మ్యాచ్‌లో 'డబుల్ సెంచరీ' చేసిన ఇషాన్ కిషన్‌కు చోటు లేదని రోహిత్ చెప్పడంతో ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు శుబ్‌మన్ వాటన్నింటినీ పటాపంచలు చేశాడు. తన ఆటలో ఉండే వాడి ఏమిటో కూడా ప్రదర్శించి వన్డేల్లో తాను ఎందుకు సరైనవాడినో నిరూపించుకున్నాడు.

గత మ్యాచ్‌లో సెంచరీ సాధించిన అతను ఈసారి డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లో అతను కవర్స్ దిశగా కొట్టిన మొదటి ఫోర్ నిజంగా సూపర్. అలా మొదలైన పరుగుల లెక్క ఆపై జోరు అందుకొని ప్రవాహంలా మారింది. ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో అతని పుల్ షాట్‌లు, ఎక్స్‌ట్రా కవర్ మీదుగా డ్రైవ్‌లు, బ్యాక్ ఫుట్ పంచ్‌లు అత్యుత్తమ రీతిలో సాగాయి. బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ సిక్స్‌తో 52 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. కివీస్ బౌలర్లలో ఎవరినీ వదలకుండా అతను చితక్కొట్టాడు. 87 బంతుల్లో అతని సెంచరీ పూర్తయినప్పుడు ఆనందం కనిపించింది కానీ... ముమ్ముందు మరింత విధ్వంసం సృష్టించబోతున్నట్లు తనూ ఊహించి ఉండడు. ఒకవైపు సహచరులు వెనుదిరుగుతున్నా, తను మాత్రం పట్టుదలగా నిలబడి స్వేచ్ఛగా పరుగులు సాధిస్తూ పోయాడు. 150 పరుగుల మైలురాయి కూడా సిక్సర్‌తోనే పూర్తయింది. చివరి ఓవర్లలో కివీస్ బౌలింగ్ అనూహ్యంగా మెరుగైంది. పరుగులు రావడం కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో టిక్నర్ వేసిన ఇన్నింగ్స్ 48వ ఓవర్... రెండు సిక్స్‌లతో గిల్ చెలరేగిపోయాడు. ఫెర్గూసన్ వేసిన 49వ ఓవర్... తొలి మూడు బంతుల్లో ఫైన్ లెగ్, లాంగాఫ్, లాంగాఫ్...వరుసగా మూడు సిక్సర్లు... 145 బంతుల్లో డబుల్ సెంచరీ... అరుదైన మైలురాయిని దాటిన గిల్ గర్జిస్తూ విజయనాదం చేశాడు. 58 బంతుల్లోనే తర్వాతి వంద అతని ఖాతాలో చేరింది. తర్వాతి ఓవర్లోనూ మరో సిక్స్ కొట్టిన అనంతరం ఫిలిప్స్ క్యాచ్‌తో ఒక గొప్ప ఇన్నింగ్స్‌కు ముగింపు లభించింది. మైదానంలో 31,755 మంది ప్రేక్షకులు హర్షధ్వానాలతో హోరెత్తిస్తుండగా ఈ పంజాబీ స్టార్ మైదానం వీడాడు. జట్టులో తర్వాతి స్కోరు 34 మాత్రమే అంటే గిల్ జోరు ఎలా సాగిందో అర్థమవుతుంది.

పంజాబ్‌లో జిల్లా స్థాయి అండర్-16 పోటీల్లోనే 351 పరుగులు బాది అందరినీ ఆశ్చర్యపర్చిన గిల్, విజయ్ మర్చంట్ ట్రోఫీలో డబుల్ సెంచరీతో వెలుగులోకి రాగా... వరుసగా రెండేళ్ల బీసీసీఐ బెస్ట్ జూనియర్ క్రికెటర్ అవార్డు అందుకోవడంతో అందరి దృష్టిలో పడ్డాడు. ఆ తర్వాత రాహుల్ ద్రవిడ్ మార్గనిర్దేశనంలో అండర్-19 స్థాయిలో భారీ స్కోర్లు సాధిస్తూ 2018లో అండర్-19 వరల్డ్‌కప్ విజయంలో కీలకపాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాక గిల్‌కు ఎదురు లేకుండా పోయింది. టెస్టుల్లో ఇప్పటికే తన స్థానం సుస్థిరం చేసుకున్న గిల్‌కు సీనియర్ల గైర్హాజరులో వన్డేల్లో ఇటీవల అవకాశాలు వచ్చాయి. వాటిని సమర్థంగా అందిపుచ్చుకొని ఇప్పుడు తనను తప్పించే అవకాశం లేని స్థితికి వచ్చాడు. 23 ఏళ్లకే పలు ఘనతలు సాధించి గిల్ ముమ్ముందు మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయం.

–సాక్షి క్రీడా ప్రతినిధి

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మిచెల్ (బి) టిక్నర్ 34; గిల్ (సి) ఫిలిప్స్ (బి) షిప్లీ 208; కోహ్లి (బి) సాన్‌ట్నర్ 8; ఇషాన్ కిషన్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 5; సూర్యకుమార్ (సి) సాన్‌ట్నర్ (బి) మిచెల్ 31; హార్దిక్ (బి) మిచెల్ 28; సుందర్ (ఎల్బీ) (బి) షిప్లీ 12; శార్దుల్ (రనౌట్) 3; కుల్దీప్ (నాటౌట్) 5; షమీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 349. వికెట్ల పతనం: 1-60; 2-88; 3-110; 4-175; 5-249; 6-292; 7-302; 8-345. **బౌలింగ్:** షిప్లీ 9-0-74-2, ఫెర్గూసన్ 10-0-77-1, టిక్నర్ 10-0-69-1, సాన్‌ట్నర్ 10-0-56-1, బ్రేస్‌వెల్ 6-0-43-0, మిచెల్ 5-0-30-2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) (సబ్) షహబాజ్ (బి) శార్దుల్ 40; కాన్వే (సి) కుల్దీప్ (బి) సిరాజ్ 10; నికోల్స్ (బి) కుల్దీప్ 18; మిచెల్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 9; లాథమ్ (సి) సుందర్ (బి) సిరాజ్ 24; ఫిలిప్స్ (బి) షమీ 11; బ్రేస్‌వెల్ (ఎల్బీ) (బి) శార్దుల్ 140; సాన్‌ట్నర్ (సి) కుల్దీప్ (బి) సిరాజ్ 57; షిప్లీ (బి) సిరాజ్ 0; ఫెర్గూసన్ (సి) గిల్ (బి) హార్దిక్ 8; టిక్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; మొత్తం (49.2 ఓవర్లలో ఆలౌట్) 337 **వికెట్ల పతనం:** 1-28, 2-70, 3-78, 4-89, 5-110, 6-131, 7-293, 8-294, 9-328, 10-337. **బౌలింగ్:** షమీ 10-1-69-1, సిరాజ్ 10-2-46-4, హార్దిక్ 7-0-70-1, కుల్దీప్ 8-1-43-2, శార్దుల్ 7.2-0-54-2, సుందర్ 7-0-50-0.


నాదల్‌కు చుక్కెదురు

- అమెరికా ప్లేయర్ మెకంజీ సంచలనం
- సిట్సిపాస్, మెద్వెదెవ్ ముందంజ

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బుధవారం పెను సంచలనం నమోదైంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్, టాప్ సీడ్ రాఫెల్ నాదల్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. అమెరికాకు చెందిన ప్రపంచ 63వ ర్యాంకర్ మెకంజీ మెక్‌డొనాల్డ్ 6-4, 6-4, 7-5తో నాదల్‌ను ఓడించి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన నాదల్ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే వెనుదిరగడం గత ఏడేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మెకంజీ 14 ఏస్‌లు సంధించడంతోపాటు నాదల్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 31 అనవసర తప్పిదాలు చేసిన నాదల్ రెండో సెట్‌లో 3-5తో వెనుకబడిన దశలో ఎడమ తుంటి భాగంలో నొప్పి కలగడంతో మెడికల్ టైమ్ అవుట్ తీసుకున్నాడు. ప్రాథమిక చికిత్స తీసుకున్న తర్వాత ఆట కొనసాగించిన నాదల్ సహజశైలిలో ఆడలేకపోయాడు. నాదల్ సరిగ్గా కదలేకపోతుండటంతో మెకంజీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యూహాత్మకంగా ఆడి సంచలనం నమోదు చేయడంతోపాటు

ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 6-3, 6-0, 6-2తో రింకీ హిజికాటా (ఆస్ట్రేలియా)పై, ఆరో సీడ్ ఫీలిక్స్ అలియాసిమ్ (కెనడా) 3-6, 3-6, 6-3, 6-2, 6-2తో అలెక్స్ మొల్కాన్ (స్లొవేకియా)పై, ఏడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 7-5, 6-2, 6-2తో మిల్‌మన్ (ఆస్ట్రేలియా)పై, పదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 3-6, 7-6 (7/3), 2-6, 6-3, 6-3తో సొనెగో (ఇటలీ)పై, 16వ సీడ్ టియాఫో (అమెరికా) 6-4, 6-4, 6-1తో జున్‌చెంగ్ షాంగ్ (చైనా)పై గెలిచి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.


నాదల్


మెకంజీ

స్వియాటెక్ జోరు

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6-2, 6-3తో కామిలా ఒసోరియో (కొలంబియా)పై గెలిచింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6-2, 7-6 (7/5)తో సస్నోవిచ్ (రష్యా)పై, ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్) 3-6, 7-5, 6-3తో దయానా ష్నైడర్ (రష్యా)పై, ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-3, 7-6 (7/4)తో ఎమ్మా రాడుకానూ (బ్రిటన్)పై విజయం సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో 8వ సీడ్ కసత్‌కినా (రష్యా) 1-6, 1-6తో వర్వరా గ్రచేవా (రష్యా) చేతిలో, 15వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 5-7, 4-6తో అనెలినా కలినినా (ఉక్రెయిన్) చేతిలో, 2019 యూఎస్ ఓపెన్ చాంపియన్ బియాంక ఆండ్రెస్కూ (కెనడా) 6-2, 6-7 (7/9), 4-6తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్) చేతిలో ఓడిపోయారు.

అశ్విన్ హెబ్బర్ సెంచరీ

ఆంధ్ర 415 ఆలౌట్



రాజ్‌కోట్: సౌరాష్ట్రతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ అశ్విన్ హెబ్బర్ (109; 12 ఫోర్లు, 1) సెంచరీ సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 256/5తో బుధవారం ఆట ప్రారంభించిన ఆంధ్ర 415 పరుగుల వద్ద ఆలౌటైంది. లలిత్ మోహన్ (32; 4 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (28; 3 ఫోర్లు) అండతో అశ్విన్ సెంచరీ చేశాడు. సౌరాష్ట్ర బౌలర్లలో యువరాజ్ సింగ్, ధర్మేంద్రసింగ్ జడేజాలు చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెల్డన్ జాక్సన్ (63 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆంధ్ర బౌలర్ నితీశ్ కుమార్ (2/26)... హర్విక్ (8), చతేశ్వర్ పుజారా (5)లను వరుస ఓవర్లలో అవుట్ చేశాడు.

కార్తికేయకు 7 వికెట్లు

- మహారాష్ట్ర 385 ఆలౌట్
- హైదరాబాద్ 176/5



పుణే: హైదరాబాద్ మీడియం పేసర్ కార్తికేయ కక్ (7/91) నిప్పులు చెరిగే బంతులతో మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌ను కూల్చేశాడు. ఓవర్‌నైట్ స్కోరు 353/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన మహారాష్ట్ర అనూహ్యంగా కార్తికేయ విజృంభణకు 32 పరుగులకే మిగతా వికెట్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్స్ ఆశయ్ పాల్కర్ (61; 9 ఫోర్లు), నౌషాద్ షేక్ (152; 20 ఫోర్లు)లతో పాటు టెయిలెండర్లు తరణ్‌జీత్‌సింగ్ (5), సత్యజీత్ బచవ్ (4)లను కార్తికేయ పెవిలియన్‌కు చేర్చాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 75 ఓవర్లలో 5 వికెట్లకు 176 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (68; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రాహుల్ రాదేశ్ (55; 10 ఫోర్లు) రాణించారు. సంతోష్ గౌడ్ (18 బ్యాటింగ్), రవితేజ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు లైంగికంగా వేధిస్తున్నాడు


ధర్నాకు దిగిన రెజ్లర్లు అన్షు, వినేశ్, సాక్షి, సోనమ్, సరితా మోర్, సంగీత, బజరంగ్ తదితరులు

- బ్రిజ్‌భూషణ్‌ను తప్పిస్తేనే బరిలోకి...
- ధర్నాకు దిగిన భారత మహిళా రెజ్లర్లు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ భారత స్టార్ మహిళా రెజ్లర్లు రోడ్డెక్కారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్ సుదీర్ఘకాలంగా తమని లైంగికంగా వేధిస్తున్నారని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి మలిక్ సహా 30 మంది రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగారు. ఆయన నియంతృత్వాన్ని, ఆగడాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి, హోం మంత్రి జోక్యం చేసుకోవాలని... అధ్యక్ష పదవి నుంచి ఆయన్ని తప్పించేదాకా ధర్నా విరమించబోమని, పోటీల్లో పాల్గొనబోమని స్పష్టం చేశారు. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్, ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేత సరిత మోర్, సంగీతా ఫొగాట్, సత్యవర్త్ కడియాన్, జితేందర్, సుమిత్ మలిక్ తదితర రెజ్లర్లు ధర్నా చేశారు. దేశానికి పతకాలు తెచ్చిన మేటి రెజ్లర్లు రోడ్డెక్కి నినదిస్తుంటే అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ మాత్రం ఈ ఆరోపణల్లో నిజం లేదని తేలిగ్గా కొట్టిపారేశారు. ఏ ఒక్కరినైనా తాను లైంగికంగా వేధించానని నిరూపిస్తే ఉరేసుకొంటానని బ్రిజ్‌భూషణ్ అన్నారు. ఓ పారిశ్రామికవేత్త ప్రోద్బలంతో ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైన 66 ఏళ్ల బ్రిజ్‌భూషణ్ 2011 డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.


బ్రిజ్‌భూషణ్

చంపుతామని బెదిరింపులు: వినేశ్

కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్, ఒలింపియన్ వినేశ్ ఫొగాట్ మాట్లాడుతూ 'పలువురు కోచ్‌లు అదే పనిగా లక్నోలో నిర్వహించే జాతీయ శిక్షణ శిబిరంలో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నారు. 10, 12 మంది అమ్మాయిలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి పేర్లను ఇప్పుడే చెప్పను. ప్రధానిని కలిసే అవకాశమిస్తే ఆయనకే వివరిస్తా. నేను ఇదివరకు ఒకసారి బ్రిజ్‌భూషణ్‌పై ఫిర్యాదు చేస్తే చంపుతామని బెదిరించారు' అని విలేకర్ల ముందు విలపించారు. సంగీతా ఫొగాట్ భర్త, టోక్యో ఒలింపిక్స్ కాంస్య విజేత బజరంగ్ పూనియా, అతని కోచ్ సుజీత్ మాన్, ఫిజియో ఆనంద్ దూబే వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. బజరంగ్ మాట్లాడుతూ తమ పోరాటం ప్రభుత్వం, కేంద్ర క్రీడా శాఖ, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)పై కాదని... కేవలం బ్రిజ్‌భూషణ్ నియంతృత్వంపైనే అని స్పష్టం చేశారు.

'సూపర్ సిక్స్' దశకు భారత్ అర్హత

- స్కాట్లాండ్‌పై 85 పరుగులతో విజయం
- రాణించిన త్రిష, మన్నత్
- అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ

బెనోని (దక్షిణాఫ్రికా): తొలిసారి నిర్వహిస్తున్న అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ 85 పరుగుల తేడాతో నెగ్గింది. తద్వారా ఆరు పాయింట్లతో గ్రూప్ 'డి' టాపర్‌గా నిలిచి సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. టీమిండియాకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి, గొంగడి త్రిష (51 బంతుల్లో 59; 6 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. రిచా ఘోష్ (35 బంతుల్లో 33; 3 ఫోర్లు) కూడా రాణించింది. అనంతరం 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 13.1 ఓవర్లలో 66 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. భారత బౌలర్లు మన్నత్ కశ్యప్ (4/12), అర్చన దేవి (3/14), సోనమ్ యాదవ్ (2/1) స్కాట్లాండ్‌ను దెబ్బ తీశారు.


త్రిష

శ్రీకాంత్‌కు మళ్లీ నిరాశ



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం భారత క్రీడాకారులకు నిరాశ జనక ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ నంబర్ వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 14-21, 19-21తో ఓడిపోయాడు. అక్సెల్‌సన్ చేతిలో శ్రీకాంత్‌కిది పదో పరాజయం కావడం గమనార్హం. 2017లో డెన్మార్క్ ఓపెన్‌లో చివరిసారి అక్సెల్‌సన్‌ను ఓడించిన శ్రీకాంత్ ఆ తర్వాత ఈ డెన్మార్క్ ప్లేయర్ చేతిలో వరుసగా ఏడోసారి ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాళవిక (భారత్) 17-21, 12-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో... ఆకర్షి 15-21, 12-21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని-శిఖా (భారత్) 8-21, 11-21తో పియర్లీ తాన్-థినా (మలేసియా) చేతిలో ఓటమి చవిచూశారు.

ద్యుతీచంద్‌పై నిషేధం

న్యూఢిల్లీ: భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీచంద్ డోపింగ్‌లో పట్టుబడింది. దీంతో ఆమెపై తాత్కాలిక నిషేధం విధించారు. గత డిసెంబర్ 5న ఆమె నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించగా నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు 'ఎ' శాంపిల్ పరీక్షల్లో తేలింది. మరోసారి 'బి' శాంపిల్‌ను పరీక్షించాక అందులోనూ ఉత్ప్రేరకాలు నిజమని తేలితే కచ్చితమైన నిషేధం విధిస్తారు. ఆమె మూత్ర నమూనాల్లో నిషిద్ధ అనబాలిక్ స్టెరాయిడ్స్ ఉన్నట్లు తేలింది. ఇది ప్రదర్శన మెరుగుకు ఉపయోగపడే స్టెరాయిడ్. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో ఉంది. ఒడిశాకు చెందిన 26 ఏళ్ల ద్యుతీ 2018 జకార్తా ఆసియా క్రీడల్లో మహిళల 100, 200 మీటర్లలో రజత పతకాలు గెలిచింది.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
390	112
61,046	18,165

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,034	▽	65
డోజోన్స్	33,545	▽	365
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,831	▽	20
డాక్స్	15,182	▽	5
షాంఘై	3,224	▽	1
నికాయ్	26,791	▲	652

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
56,755	▲	3
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,528	▲	3
వెండి (కేజీ)		
68,993	▲	332

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.00	82.67
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	98.73	102.08
€	యూరో	ఒకటి	86.62	89.72
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.40	63.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.00	58.42
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.80	62.81
SAR	సౌదీ రియాల్	ధాంయసకట	20.67	22.34
UAE D	యూఏఈ దిర్హామ్	ధాంయసకట	21.22	23.02
¥	చైనా యువాన్	ధాంయసకట	10.91	12.98

మైక్రోసాఫ్ట్‌లో 10 వేల ఉద్యోగాల కోత

కంపెనీ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి



న్యూయార్క్: టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. తాజాగా మైక్రోసాఫ్ట్ 10,000 మంది సిబ్బందిని తొలగించనుంది. ఇది కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిబ్బందిలో సుమారు అయిదు శాతం. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల బుధవారం ఈ విషయం వెల్లడించారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలో కంపెనీ ముందుకు సాగాలంటే ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుతం చేపడుతున్న మార్పుల కారణంగా 2023 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ఆఖరు నాటికి మొత్తం మీద 10,000 ఉద్యోగాలు తగ్గనున్నాయి. ఇది మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 5 శాతం లోపే ఉంటుంది' అని సిబ్బందికి పంపిన ఈమెయిల్‌లో సత్య నాదెళ్ల వివరించారు. తొలగించే ఉద్యోగులకు చెల్లించే పరిహారాలు మొదలైన వాటికి సంబంధించి 1.2 బిలియన్ డాలర్ల వ్యయాలను రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో మైక్రోసాఫ్ట్ చూపనుంది. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు పరిహారం, ఆరు నెలల పాటు ఆరోగ్య సంరక్షణ కవరేజీ మొదలైనవి ప్రయోజనాలు దక్కుతాయి. ప్రస్తుతం పరిస్థితులు గణనీయంగా మారిపోతున్నాయని నాదెళ్ల పేర్కొన్నారు. కొన్ని దేశాల్లో ఇప్పటికే మాంద్యం నెలకొనగా, మరికొన్నింటిలో మాంద్యం తలెత్తవచ్చన్న అంచనాలుండటంతో కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయని వివరించారు. ఇప్పటికే ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సంస్థలు 11,000 పైచిలుకు ఉద్యోగాల్లో కోత విధించాయి. అమెజాన్ కూడా 18,000 మంది ఉద్యోగులను తొలగిస్తోంది.

రూ. 407 కోట్లతో సీసీఎల్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టంట్ కాఫీ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ వియత్నాం తయారీ కేంద్రంలో కొత్త యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 6,000 టన్నుల వార్షిక సామర్థ్యంతో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ఫెసిలిటీని నెలకొల్పనున్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.407 కోట్లు. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను మధ్యంతర డివిడెండ్ రూ.3 చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. డిసెంబర్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 24.9 శాతం ఎగసి రూ.73 కోట్లు సాధించింది. ఎబిటా 9 శాతం పెరిగి రూ.101 కోట్లుగా ఉంది. టర్నోవర్ 26.5 శాతం అధికమై రూ.535 కోట్లు నమోదు చేసింది.



ఎఫ్‌పీవోకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ సై

- ధరల శ్రేణి రూ. 3,112–3,276
- రిటైలర్లకు షేరుకి రూ. 64 తగ్గింపు
- రూ. 20,000 కోట్ల సమీకరణ లక్ష్యం
- ఈ నెల 27–31 మధ్య పబ్లిక్ ఆఫర్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్) ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీవో)కు రంగం సిద్ధం చేసింది. ఇందుకు రూ. 3,112 నుంచి రూ. 3,276 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఇది తాజా ధరతో పోలిస్తే 10–15 శాతం తక్కువ. రిటైల్ ఇన్వెస్టర్లకు షేరుకి రూ. 64 డిస్కౌంట్ ప్రకటించింది. రిటైలర్లు కనీసం 4 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఆపై ఇదే గుణిజాల్లో దరఖాస్తు చేయవచ్చు. ఇష్యూ ద్వారా రూ. 20,000 కోట్లు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. వెరసి దేశీయంగా అతిపెద్ద ఎఫ్‌పీవోగా నిలవనుంది. ఆఫర్ ఈ నెల 27న ప్రారంభమై 31న ముగియనుంది.



నిధుల వినియోగమిలా: ఎఫ్‌పీవో నిధుల్లో రూ. 10,869 కోట్లను గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, ప్రస్తుత విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాలపై అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెచ్చించనుంది. మరో రూ.4,165 కోట్లను ఎయిర్‌పోర్టులు, రోడ్, సోలార్ ప్రాజెక్టు సంబంధ అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్, డేటా సెంటర్లు, ఎయిర్‌పోర్టులు, రహదారుల అభివృద్ధి, ఫుడ్, ఎఫ్ఎంసీజీ, డిజిటల్, మైనింగ్ డిఫెన్స్, తదితర విభాగాలలో కార్యకలాపాలు విస్తరించిన సంగతి తెలిసిందే.

7 విమానాశ్రయాలు

ఏఈఎల్ ప్రస్తుతం నవీముంబైలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుసహా ముంబై, అహ్మదాబాద్, లక్నో, మంగళూరు, జైపూర్, గువాహటి, తిరువనంతపురంలలో ఎయిర్‌పోర్టులను నిర్వహిస్తోంది. రహదారులు తదితర మౌలిక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. రానున్న దశాబ్ద కాలంలో గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్‌పై 50 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ప్రకటించింది. 2022 సెప్టెంబర్ 30కల్లా కంపెనీ రూ. 40,023 కోట్లకుపైగా రుణ భారాన్ని కలిగి ఉంది.

ఎఫ్‌పీవో వార్తల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 1.5% నీరసించి రూ. 3,585 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ 400 రోజుల డిపాజిట్

హైదరాబాద్: కెనరా బ్యాంక్ నూతనంగా 400 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రకటించింది. దీనిపై 7.75 శాతం వరకు వార్షిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. ఇందులో నాన్ కాలబుల్ డిపాజిట్ (గడువుకు ముందు ఉపసంహరించుకోలేనివి)పై 7.25 శాతం రేటును ఆఫర్ చేస్తుండగా, కాలబుల్ డిపాజిట్‌పై (గడువుకు ముందు రద్దు, పాక్షిక ఉపసంహరణకు వీలైనవి) 7.15 శాతం వార్షిక వడ్డీ రేటును ఇస్తున్నట్టు కెనరా బ్యాంక్ తెలిపింది. 60 ఏళ్లు నిండిన వారికి 0.50 శాతం అదనపు రేటును ఇస్తోంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	84.00
18-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563–00
వరంగల్	565–00
రిటైల్ ధర	6.20

రెండో రోజూ మార్కెట్ల జోరు

- సెన్సెక్స్ 390 పాయింట్లు అప్
- నిఫ్టీ 112 పాయింట్లు ప్లస్

ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపాయి. సెన్సెక్స్ 390 పాయింట్లు జంప్ చేసి 61,046 వద్ద నిలిచింది. వెరసి మళ్లీ 61,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ 112 పాయింట్లు జమ చేసుకుని 18,165 వద్ద ముగిసింది. అయితే తొలుత మార్కెట్లు కొంతమేర డీలా పడ్డాయి. వెనువెంటనే ఊపందుకుని చివరివరకూ పటిష్టంగా కదిలాయి. ఇటీవల అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు మంగళవారం స్వల్ప కొనుగోళ్లు చేపట్టడంతో సెంటిమెంటు బలపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు ఆసియా, యూరోపియన్ మార్కెట్ల సానుకూలతలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు తెలియజేశారు. మంగళవారం(17న) సైతం సెన్సెక్స్ 563 పాయింట్లు ఎగసిన విషయం విదితమే. కాగా.. తొలుత సెన్సెక్స్ 60,569 వద్ద కనిష్టాన్ని తాకినప్పటికీ ఆపై 61,110 వరకూ దూసుకెళ్లింది. ఈ బాటలో నిఫ్టీ 18,184– 18,032 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. డాలరుతో మారకంలో రూపాయి బౌన్స్‌బ్యాక్ కావడం మార్కెట్లకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.

మెటల్స్ జూమ్

ఎన్ఎస్ఈలో మెటల్ ఇండెక్స్ 1.7 శాతం పుంజుకోగా, ఫార్మా, ప్రయివేట్ బ్యాంకింగ్ 0.6 శాతం చొప్పున లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్స్ 1.25 శాతం వెనకడుగు వేశాయి. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, యూపీఎల్, విప్రో, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ, దివీస్, గ్రాసిమ్ 3–1 శాతం మధ్య లాభపడ్డాయి.



రూపాయి స్పీడ్...

డాలరుతో మారకంలో వరుసగా మూడు రోజుల నష్టాలకు దేశీ కరెన్సీ చెక్ పెట్టింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 28 పైసలు లాభపడి 81.41 వద్ద ముగిసింది. అయితే రూపాయి తొలుత 81.80 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. తదుపరి డాలరు ఇండెక్స్ వెనకడుగు వేయడం, దేశీ ఈక్విటీలు ఊపందుకోవడంతో 81.25 వరకూ బలపడింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 0.5 శాతం క్షీణించి 101.93కు చేరడం రూపాయికి హుషారునిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

స్టాక్ హైలైట్స్

- ఈ ఏడాది తొలి 9 నెలల్లో ఆదాయం 41 శాతం ఎగసి రూ. 3,384 కోట్లను తాకడంతో ల్యాండ్ మార్క్ కార్స్ షేరు ఎన్ఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 587 వద్ద ముగిసింది. తొలుత రూ. 599 వరకూ ఎగసింది. 2022 డిసెంబర్ 23న లిస్టయిన తదుపరి ఇదే గరిష్టం!
- క్యూ3 ఫలితాలపై అంచనాలతో ఉషా మార్టిన్ కౌంటర్ జోరందుకుంది. ఎన్ఎస్ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 191 వద్ద ముగిసింది. తొలుత రూ. 199 వద్ద 52 వారాల గరిష్టానికి చేరింది.
- గత మూడు వారాల్లో 20% ర్యాలీ చేసిన యురేకా ఫోర్బ్స్ షేరు బీఎస్ఈలో తొలుత 1.5 శాతం బలపడి రూ. 537 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని తాకింది. చివరికి అమ్మకాలు పెరిగి 1.6% నష్టంతో రూ. 521 వద్ద ముగిసింది.

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

క్యూ3లో రూ. 1,964 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 58 శాతం జంప్‌చేసి రూ. 1,964 కోట్లను తాకింది. రుణాల నాణ్యత మెరుగుపడటం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 4,495 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.17 శాతం మెరుగై 4.27 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం సైతం రూ. 1,877 కోట్ల నుంచి రూ. 2,076 కోట్లకు ఎగసింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 1,654 కోట్ల నుంచి రూ. 1,065 కోట్లకు క్షీణించాయి. క్యూ2 (జూలై–సెప్టెంబర్)తో పోలిస్తే తాజా స్లిప్పేజీలు రూ. 1,572 కోట్ల నుంచి రూ. 1,467 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.11 శాతం నుంచి 2.06 శాతానికి వెనకడుగు వేశాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.01 శాతానికి చేరింది. ఈ కాలంలో 1,800 మందికి ఉపాధి కల్పించినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో సుమంత్ కథ్‌పాలియా తెలియజేశారు. తొలి 9 నెలల్లో 8,500 మందిని జత చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో బ్యాంక్ మొత్తం సిబ్బంది సంఖ్య 37,870కు చేరింది.



ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు బీఎస్ఈలో 0.7% క్షీణించి రూ. 1,222 వద్ద ముగిసింది.

కర్నూలులో కామినేని ఆసుపత్రి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగ సంస్థ కామినేని హాస్పిటల్స్ తాజాగా కర్నూలులో కొత్తగా ఆసుపత్రిని ప్రారంభించింది. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ పేరుతో రూ.150 కోట్ల వ్యయంతో 150 పడకలతో ఇది ఏర్పాటైంది. రూ.75 కోట్లతో 75 పడకల సామర్థ్యంతో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఈ ఏడాదే స్థాపించనున్నారు. మెరుగైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలతో వైద్య సేవలను ఈ కేంద్రం తదుపరి స్థాయికి మారుస్తుందని సంస్థ తెలిపింది. అందుబాటు ధరలో ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించడం లక్ష్యంగా కర్నూలులో ఆసుపత్రిని నెలకొల్పినట్టు కామినేని హాస్పిటల్స్ వివరించింది. 30 ఏళ్లకుపైగా నాణ్యమైన వైద్య సేవలతో కోట్లాది మందికి చేరువైన కామినేని హాస్పిటల్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 3,000లకుపైగా పడకలతో హైదరాబాద్, నార్కట్‌పల్లి, విజయవాడలో ఆసుపత్రులను నిర్వహిస్తోంది. మెడికల్, డెంటల్ కళాశాలలు సైతం ఉన్నాయి.



భవిత

టీఎస్ సెట్‌కు సిద్ధమా..!

టీఎస్ సెట్-2023

తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా అర్హత సాధించేందుకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)కు ప్రకటన వెలువడింది. జనరల్ స్టడీస్‌తోపాటు మరో 29 సబ్జెక్టులతో టీఎస్ సెట్‌ను నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి...

ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్–సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్ష కోసం తెలంగాణలోని పాత పది జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ నుంచి వచ్చే దరఖాస్తులను రిజర్వేషన్లతో సంబంధం లేకుండా జనరల్ కేటగిరికి చెందినవిగా పరిగణిస్తారు.

సబ్జెక్టులు

జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

అర్హత

కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ,ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం

కంప్యూటర్ ఆధారిత టెస్టు(సీబీటీ) పద్ధతిలో జరిగే పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో 50 ప్రశ్నలకు–100 మార్కులు, పేపర్–2లో 100 ప్రశ్నలకు–200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పేపర్–1: ఆబ్జెక్టివ్ తరహాలో 50 ప్రశ్నలకు పేపర్–1 ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు కేటాయిస్తారు. ఇందులో అభ్యర్థుల బోధన/పరిశోధన ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. అలాగే తార్కిక సామర్థ్యం, గ్రహణశక్తి, భిన్నమైన ఆలోచనల దృక్పథాన్ని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

పేపర్–2:

- ఈ పేపర్‌లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టు నుంచి ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కుల చొప్పున 100 ప్రశ్నలను అడుగుతారు.
- పేపర్–1 ప్రశ్నపత్రం అందరికి కామన్‌గా ఉంటుంది. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో పరీక్ష రాసుకోవచ్చు. పేపర్–2లో మాత్రం కొన్ని సబ్జెక్టులకు సంబంధించి రెండు మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 20.01.2023
- **ఎడిట్‌ఆప్షన్:** 2023 ఫిబ్రవరి 6,7 తేదీల వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడ్:** 2023 ఫిబ్రవరి చివరి వారంలో
- **పరీక్ష తేదీలు:** 2023 మార్చి మొదటి లేదా రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.telanganaset.org

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ హైకోర్టులో 17 ఎగ్జామినర్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎగ్జామినర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. • **మొత్తం పోస్టుల సంఖ్య:** 17

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/లా) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు/బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ పరీక్ష(30 మార్కులు), ఇంటర్వ్యూ(10 మార్కులు), రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)లో 90(జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్) ప్రశ్నలుంటాయి. ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 20.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

పల్లె విద్యార్థులకు 'నవోదయం'

జవహర్ నవోదయ విద్యాలయాలు.. నాణ్యమైన విద్యకు కేరాఫ్! ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ.. చదువు, వసతి, భోజనం అంతా ఉచితం. ఒత్తిడిలేని విద్య, ఆటపాటలతో వికాసానికి పెద్దపీట వేసే విద్యాలయాలు ఇవి. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వీటిల్లో అడ్మిషన్ లభిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో..నవోదయ విద్యాలయాల ప్రత్యేకతలు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం...

» జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో అడ్మిషన్స్
» 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న జేఎన్‌వీలు



స్కూల్ ఎడ్యుకేషన్

పాఠశాల చదువు విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనది. ఈ దశలో వినూత్న విద్య, బోధన విధానాన్ని అమలు చేసి.. బాలల సంపూర్ణ వికాసానికి పునాదులు వేయాలనే లక్ష్యంతో ఏర్పాటైనవే జవహర్ నవోదయ విద్యాలయాలు. ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి పేరిట ప్రత్యేక సంస్థను సైతం నెలకొల్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా జేఎన్‌వీలు అడుగులు వేస్తున్నాయి.

లెర్నింగ్ బై డూయింగ్

నవోదయ విద్యాలయాల బోధనలో లెర్నింగ్ బై డూయింగ్ విధానం అమలవుతోంది. అంటే.. ఏదైనా ఒక అంశాన్ని బోధించేటప్పుడు దానికి సంబంధించి ప్రాక్టికల్స్, పజిల్స్, క్విజ్‌లు వంటి వాటి ద్వారా సదరు అంశంపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా నవోదయ పాఠశాలల్లో మరో ప్రత్యేక విధానం..యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులకు వాస్తవ దృక్పథం, ఆలోచన పరిధి పెరిగేలా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ వర్క్స్, స్కూల్ స్థాయిలో ఎగ్జిబిషన్స్ వంటివి నిర్వహిస్తూ.. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలకు వాస్తవ రూపం ఇచ్చేలా బోధన ఉంటోంది.

పూర్తిగా రెసిడెన్షియల్

నవోదయ విద్యాలయాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ విధానం అమలవుతోంది. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులు సదరు పాఠశాలల వసతి గృహాల్లోనే ఉండి చదువుకోవాల్సి ఉంటుంది. క్లాస్ రూమ్ తరగతులతోపాటు.. అవి ముగిశాక హాస్టల్స్‌లో మెంటార్స్ సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది. తద్వారా విద్యార్థులు క్లాస్ రూమ్ వెలుపల అభ్యసనం సాగించే సమయంలో ఉపాధ్యాయుల సహకారం అందేలా చూస్తున్నారు.

ఎనిమిది నుంచి ఇంగ్లిష్ మీడియం

నవోదయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియం బోధన మొదలవుతుంది. ఎనిమిదో తరగతి నుంచి మ్యాథమెటిక్స్,సైన్స్ సబ్జెక్టులను ఇంగ్లిష్ మీడియంలో, సోషల్ సైన్స్ సబ్జెక్టును హిందీ మీడియంలో చదవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఆరో తరగతి వరకు మాత్రం విద్యార్థులు తమ మాతృ భాష లేదా తమ ప్రాంతీయ భాషలో చదివే అవకాశం కల్పిస్తున్నారు.

ఫీజులు లేవు

జేఎన్‌వీల మరో ప్రత్యేకత..ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యను అందించడం. రెసిడెన్షియల్ విధానంలో వసతి, భోజన సదుపాయం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు.. ఇలా అన్నింటినీ ఉచితంగా అందిస్తారు. విద్యా వికాస్ నిధి పేరిట ఏర్పాటు చేసిన నిధికి నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపు నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళా విద్యార్థులు, బీపీఎల్ వర్గాల(దారిద్ర్య రేఖ దిగువ ఉన్న) పిల్లలకు మినహాయింపునిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మాత్రం నెలకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది.

ఏపీలో 15, తెలంగాణలో 9

- ప్రస్తుతం జవహర్ నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా 649 నవోదయ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 అందుబాటులో ఉన్నాయి. ఏపీలోని 15 పాఠశాల్లో 2 పాఠశాలలను ఎస్సీ/ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.
- ప్రతి నవోదయలో ఆరో తరగతిలో గరిష్టంగా 80 సీట్లు అందుబాటులో ఉంటాయి. కనిష్టంగా 40 సీట్లు ఉంటాయి. గతేడాది వరకు గరిష్ట సీట్ల సంఖ్య ప్రతి పాఠశాలలో 60గా మాత్రమే ఉండేది. ఈ ఏడాది 80కి పెరగడంతో మరింతమంది విద్యార్థులకు నవోదయలో చదివే అవకాశం లభించనుంది.

అర్హతలు

- 2022–23లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. లేదా ఎన్ఐఓఎస్ నిర్వహించే 'బి' కాంపిటెన్సీ కోర్సు చదువుతుండాలి.
- విద్యార్థులు తాము దరఖాస్తులో పేర్కొన్న జేఎన్‌వీ నెలకొన్న జిల్లాలకు చెందిన వారై ఉండాలి.
- గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు కేటాయించిన 75 శాతం సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా..గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే మూడు,నాలుగు,అయిదో తరగతి చదవాలి.
- **వయసు:** మే 1, 2011–ఏప్రిల్ 30, 2013 మధ్యలో జన్మించి ఉండాలి.

100 మార్కులకు పరీక్ష

- నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ)ను నిర్వహిస్తారు. 2023–24కు సంబంధించి ఈ పరీక్ష ఏప్రిల్ 29న జరుగనుంది.
- జేఎన్‌వీఎస్‌టీ మూడు విభాగాల్లో మొత్తం 80 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు, లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే ఉంటుంది.
- ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు. ▪ విద్యార్థులు దరఖాస్తు సమయంలోనే తాము పరీక్ష రాయదలచుకున్న మాధ్యమాన్ని పేర్కొనాలి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఉర్దూ, కన్నడ భాషల్లో పరీక్ష రాసే అవకాశం ఉంది. ఏపీ విద్యార్థులు అదనంగా ఒరియా మాధ్యమంలోనూ పరీక్షకు హాజరయ్యే వీలుంది.

జిల్లా స్థాయిలో ఎంపిక

- ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో నెలకొల్పిన జేఎన్‌వీల్లో ప్రవేశం కల్పిస్తారు. అభ్యర్థులు సదరు జేఎన్‌వీ నెలకొన్న జిల్లాకు చెందిన వారై ఉండాలి.
- జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో సాధించిన మార్కులు, దరఖాస్తు చేసుకున్న జిల్లా.. సదరు జిల్లాలో ఉన్న జేఎన్‌వీలో ఉన్న సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. రిజర్వేషన్లకు అనుగుణంగా జిల్లా స్థాయిలో తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది.

పల్లే విద్యార్థులకు ప్రాధాన్యం

జేఎన్‌వీలలోని సీట్లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను పల్లే ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అదే విధంగా మహిళా విద్యార్థులను ప్రోత్సహించేందుకు మొత్తం సీట్లలో 33 శాతం(1/3వంతు) సీట్లను బాలికలకు కేటాయిస్తారు.

పాఠ్య పుస్తకాలే ఆదరవుగా

జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు పాఠ్య పుస్తకాలనే ఆదరవుగా చేసుకోవాలి. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు అకాడమీ పుస్తకాలు, అలాగే ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌ను చదవడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 31,2023
- **జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in

కో-కరిక్యులర్ యాక్టివిటీస్

జేఎన్‌వీల్లో కో–కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. ఎస్సే రైటింగ్, డిబేట్స్, క్విజ్‌లు వంటివి నిర్వహించడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా.. నైపుణ్యాలు కూడా పెంపొందుతాయి.

–కె.వి.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, జేఎన్‌వీ–హైదరాబాద్ రీజియన్

క్లుప్తంగా...

ఎస్సీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణను అమలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. కర్ణాటకలోని మైసూరులో బుధవారం ప్రారంభమైన తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏపీలో ఎస్సీల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.9,225.28 కోట్లు కేటాయించిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ నాటికి రూ.49,710.17కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎస్సీ విద్యార్థులకు ఉన్నత విద్య ప్రమాణాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని చెప్పారు. రూ.268.46 కోట్లతో విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి మేరుగు నాగార్జున వివరించారు.

'ఓబుళాపురం'పై విచారణను సీజేఐ నిర్ణయిస్తారు

సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో మైనింగ్‌కు సంబంధించి ఓబుళాపురం మైనింగ్ కంపెనీపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఏ ధర్మాసనం విచారించాలనేది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) నిర్ణయిస్తారని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ పిటిషన్ బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. గత వారం జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించి గ్రీన్ బెంచ్‌కు బదిలీ చేసిందని ఈ సందర్భంగా న్యాయవాదులు తెలిపారు. మైనింగ్ కంపెనీ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. పదేళ్ల క్రితం సమాజ్ పరివర్తన్ పిటిషన్ నుంచి వేరు చేసి.. మళ్లీ ఇప్పుడు అదే కేసుతో దీనిని జత చేయడం సరికాదన్నారు. సమాజ్ పరివర్తన్ పిటిషన్ కర్ణాటకకు సంబంధించినదని, తమ కేసు ఏపీకి సంబంధించిందని చెప్పారు. అనంతరం ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఏ ధర్మాసనం విచారించాలనేది ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) నిర్ణయిస్తారని ధర్మాసనం తెలిపింది. ఈ అంశం సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఫోను నుంచే 'ఫారిన్' మనీ

ఇక విదేశాల నుంచి కూడా డిజిటల్ చెల్లింపులు

సాక్షి, అమరావతి: ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) భారత్‌లోని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు డబ్బులు పంపించడం ఇక సులువు కానుంది. విదేశాల నుంచి కూడా చేతిలో ఉన్న సెల్‌ఫోన్ నుంచే డిజిటల్ (యూపీఐ) చెల్లింపుల ద్వారా నిధులు పంపొచ్చు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, భారత్ పే తదితర యూపీఐ పేమెంట్ మాధ్యమాల ద్వారా క్షణాల్లో డబ్బులు పంపొచ్చు. ఈ ఏడాది ఏప్రిల్ 30 నుంచి డిజిటల్ చెల్లింపులను అనుమతిస్తారు. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విధి విధానాలను ఖరారు చేసింది. ఈ తాజా విధాన నిర్ణయం 1.35 కోట్ల మంది ఎన్నారైలకు సౌలభ్యంగా మారనుంది.

తొలి దశలో 10 దేశాలకు అనుమతి

తొలి దశలో ఎన్నారైలు అధికంగా ఉన్న 10 దేశాల నుంచి చెల్లింపులకు ఎన్‌పీసీఐ అనుమతి మంజూరు చేసింది. అమెరికా, బ్రిటన్, యూఏఈ, సింగపూర్, ఆస్ట్రేలియా, కెనడా, హాంగ్‌కాంగ్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా నుంచి డిజిటల్ చెల్లింపులు చేయొచ్చు. విదేశాల నుంచి యూపీఐ చెల్లింపుల కోసం ఎన్‌పీసీఐ 2020లోనే ప్రత్యేకంగా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ అనే అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. విదేశాల్లోని డిజిటల్ పేమెంట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. ఇప్పటికే నేపాల్, యూఏఈ, యూకే, ఫ్రాన్స్‌లలోని సంస్థలు భారతీయ యూపీఏ చెల్లింపులను అనుమతించేలా ఒప్పందాలు చేసుకుంది. మన యూపీఐని సింగపూర్ పేనౌ సంస్థతో అనుసంధానించేందుకు సంప్రదింపులు జరుపుతోంది. ఇప్పుడు నేరుగా భారతీయ బ్యాంకు ఖాతాల ద్వారానే చెల్లింపులకు అనుమతించింది.



డిజిటల్ చెల్లింపులు చేయాలంటే..

విదేశాల నుంచి డిజిటల్ చెల్లింపులు చేయాలనుకునే ఎన్నారైలకు భారత్‌లో ఏదైనా బ్యాంకులో నాన్ రెసిడెంట్ ఎక్స్‌టెర్నల్ (ఎన్ఆర్ఈ) అకౌంట్ లేదా నాన్ రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్‌వో) అకౌంట్ ఉండాలి. ఆ అకౌంట్ల నుంచి యూపీఐ ద్వారా డబ్బులు పంపించవచ్చు. ఈ-కామర్స్ పోర్టళ్లకూ చెల్లింపులు చేయొచ్చు.

ప్రస్తుతం నగదు బదిలీకి 48 గంటలు

ప్రస్తుతం ఎన్నారైలు భారత్‌లోని బంధువులకు అక్కడి బ్యాంకు ఖాతా నుంచి భారత్‌లోని బ్యాంకు ఖాతాకు నగదు పంపిస్తున్నారు. దీన్ని వైర్ ట్రాన్స్‌ఫర్ అంటారు. ఈ విధానంలో నగదు బదిలీకి 48 గంటల సమయం పడుతుంది. ఇక వెస్టన్ యూనియన్, యూఏఈ ఎక్స్ఛేంజ్ వంటి మనీ ట్రాన్స్‌ఫర్ కంపెనీల ద్వారా పంపాలంటే విదేశాల్లోని మనీ ట్రాన్స్‌ఫర్ కంపెనీ ఆఫీసుకు వెళ్లి ఆ దేశం కరెన్సీని చెల్లించాలి. ఆ రోజుకు మనీ ట్రాన్స్‌ఫర్ కంపెనీ నిర్దేశించిన మారక విలువనుబట్టి భారత్‌లో ఉన్న వారికి భారత కరెన్సీలో నగదు చెల్లిస్తారు. ఇవి కాకుండా మరికొన్ని ఆన్‌లైన్ చెల్లింపు కంపెనీలు కూడా ఉన్నాయి. ఇవి డబ్బులు పంపేవారు, పొందేవారు ఇద్దరి నుంచి ఎక్కువ మొత్తంలో సర్వీస్ చార్జి వసూలు చేస్తాయి.

మనీ లాండరింగ్‌కు అవకాశం లేకుండా..

విదేశాల నుంచి డిజిటల్ చెల్లింపులపై భారత్‌లోని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)కు కట్టుబడిన బ్యాంకు అకౌంట్లకే డిజిటల్ చెల్లింపులకు అనుమతించాలని స్పష్టం చేసింది. డబ్బులు చెల్లించే ఖాతా ఉన్న బ్యాంకు, డబ్బులు తీసుకునే ఖాతా ఉన్న బ్యాంకు కచ్చితంగా విదేశాల నుంచి డిజిటల్ చెల్లింపు లావాదేవీలు దేశంలోని మనీ లాండరింగ్ నిరోధక చట్టానికి అనుగుణంగా ఉన్నాయనే విషయాన్ని నిర్ధారించుకోవాలి. ఆర్థిక ఉగ్రవాద నిరోధక చట్టాన్ని కూడా కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

డిజిటల్ చెల్లింపులకు మరింత ఊపు..

ఎన్‌పీసీఐ తాజా నిర్ణయంతో దేశీయ బ్యాంకుల ద్వారా డిజిటల్ పేమెంట్లు మరింతగా పెరగనున్నాయి. దేశంలో డిజిటల్ చెల్లింపుల విధానాన్ని 2000 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. కానీ 2016లో పెద్ద నోట్ల రద్దు (డీమోనిటైజేషన్) తరువాత నుంచి కేంద్ర ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. అప్పటి నుంచి ఇవి భారీగా పెరిగాయి. 2000లో దేశంలో రూ.4.2 లక్షల కోట్ల డిజిటల్ చెల్లింపులు జరగ్గా, 2022లో ఏకంగా రూ.12.8 లక్షల కోట్ల చెల్లింపులు జరగడం విశేషం. విదేశాల నుంచి కూడా డిజిటల్ చెల్లింపులు మొదలైతే వీటి పరిమాణం మరింతగా పెరుగుతుంది.

విదేశాల నుంచి నిధుల్లో భారత్‌దే అగ్రస్థానం

విదేశాల్లో ఉన్న వారి నుంచి స్వదేశానికి వస్తున్న నిధుల్లో ప్రపంచంలో భారత్‌దే మొదటిస్థానం. 2021లో ఎన్నారైలు భారత్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు రూ.7.15 లక్షల కోట్లు పంపించగా.. 2022లో రూ.8 లక్షల కోట్లు పంపించారు. అందులో 25 శాతం గల్ఫ్ దేశాల నుంచి, 20 శాతం అమెరికా నుంచి వచ్చాయి. డిజిటల్ చెల్లింపులకు అనుమతించడంతో ఈ నిధుల వరద మరింతగా పెరగనుంది.

రైతు పక్షపాతి ఆడారి

సంస్మరణ సభలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

యలమంచిలి (అనకాపల్లి జిల్లా)/ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): రైతు పక్షపాతిగా దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు నిలిచిపోయారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రశంసించారు. యలమంచిలిలోని తులసీనగర్‌లో బుధవారం నిర్వహించిన తులసీరావు సంస్మరణ సభలో ఆయన పాల్గొని తులసీరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తులసీరావు కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టాన్ని తెలుసుకుని, నిరంతరం వారి సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పథకాలను అమలుచేసిన ఒక శక్తి తులసీరావు అన్నారు. ఆయన మృతి పార్టీకి, ఉత్తరాంధ్ర జిల్లాల పాడి రైతులకు తీరని నష్టమని చెప్పారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు యు.వి.రమణమూర్తిరాజు, అవంతి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ విశాఖజిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, చింతలపూడి వెంకట్రామయ్య, మళ్ల విజయప్రసాద్ పాల్గొన్నారు. కాగా, ఆడారి తులసీరావుకు పద్మశ్రీ ప్రదానం చేయాలని కోరుతూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఆయన బుధవారం అడారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



తులసీరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

జీవో నంబర్ 1పై నేడు సుప్రీంకోర్టు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: అమాయక ప్రజలు మృతిచెందకుండా బహిరంగ ర్యాలీలు, రోడ్‌షోలకు నియంత్రణ ఉండేలా ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 1పై సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది మెహ్‌ఫూజ్ నజ్కీ బుధవారం సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఈ అంశంపై శుక్రవారం హైకోర్టులో విచారణ ఉందని ప్రతివాది రామకృష్ణ న్యాయవాది కోర్టుకు తెలిపారు. అనంతరం అత్యవసర విచారణకు అంగీకరించిన సీజేఐ గురువారం జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ప్రభుత్వం సమతుల్యతతో వ్యవహరిస్తోంది!

- రోడ్లపై సభలు, రోడ్‌షోల నియంత్రణపై హైకోర్టు

సాక్షి, అమరావతి: రోడ్లపై సభలు, రోడ్‌షోలను నియంత్రించడం, పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటం మధ్య ప్రభుత్వం సమతుల్యతతో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట కారణంగా పలువురు మరణించిన నేపథ్యంలో.. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, రోడ్‌షోలకు అనుమతివ్వకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు కొట్టి బాలగంగాధర్ తిలక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రోడ్లు, రోడ్ మార్జిన్లలో సభలు, రోడ్‌షోలను నియంత్రిస్తూ జారీ చేసిన జీవో 1 విషయంలో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ వ్యాజ్యంపై తదుపరి విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిలక్ ఇటీవల హైకోర్టులో దాఖలు చేసిన పిల్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. కందుకూరులో మానవ తప్పిదం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, సన్నని వీధుల్లో రోడ్‌షోలు నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, రోడ్లపై జరిగే ప్రతి కార్యక్రమాన్ని నిషేధించాలని కోరలేరని తెలిపింది. సభలు, రోడ్‌షోలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1పై ఓ వ్యాజ్యం పెండింగ్‌లో ఉందని గుర్తు చేసింది. ఈ సమయంలో ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగంగానే జీవో 1 జారీ చేసిందన్నారు. జీవో 1 అమలును నిలిపివేస్తూ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరపనుందని వివరించారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఘోర ఓటమి

యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్



విమానాశ్రయం(గన్నవరం): రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి ఘోర ఓటమి తప్పదని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్న ఢిల్లీ, పంజాబ్, కేరళ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాను, పినరయి విజయన్‌తో కలిసి ఆయన తిరుగు ప్రయాణం నిమిత్తం హెలీకాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో అఖిలేష్ యాదవ్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన యాదవ సంఘాల నాయకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. కొద్దిసేపు యాదవ సంఘాల నేతలతో ఆయన ముచ్చటించారు. అనంతరం అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మకర సంక్రాంతితో దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణం ప్రారంభమైనట్లుగా బీజేపీకి కూడా అపజయాలు మొదలయ్యాయని చెప్పారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమి చవిచూసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోకడలతో తనకు తానే ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. భారత రాష్ట్ర సమితి ద్వారా దేశంలోని విపక్షాలను ఏకతాటిపైకి తేచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. 2024 ఎన్నికల్లో తృతీయ ఫ్రంట్ ప్రభావాన్ని అంతా చూస్తారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రిమోట్ ఈవీఎంలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

సీఎంలకు ఘనంగా వీడ్కోలు..

అనంతరం ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాను ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లగా, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరో విమానంలో తిరువనంతపురం బయలుదేరివెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో వీరందరికి తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, పలువురు అధికారులు వీడ్కోలు పలికారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943